ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-6-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 147 పేజీలు: 12 వెల: 6.50

సరిహద్దు ఉద్రిక్తతల కట్టడికి కొత్త ఫార్ములా 5లో

జగన్నాథ రథయాత్రలో భక్తులపైకి గజరాజులు



శుక్రవారం పూరీలో లక్షలాది భక్తుల మధ్య సాగుతున్న జగన్నాథ రథయాత్ర

## అంగరంగ వైభవంగా పూరీ జగన్నాథ రథయాత్ర

**దేశ, విదేశాలనుంచి తొలిరోజునే 12 లక్షల మంది పైగా భక్తుల రాక**

**10 వేల మంది భద్రతా సిబ్బందితో భారీ ఏర్పాట్లు**

**పూరి,జూన్ 27:** ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. మొదటి రెండురోజుల్లోనే 15లక్షలమంది వస్తారన్న అంచనాలున్నాయి. ఇసుకవేస్తే రాలనంతగా తొలిరోజు భక్తులు రథయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కన్నుల పండుగగా జరిగే ఈ యాత్రను చూడడానికి దేశ, విదేశాలనుంచి లక్షలాది మంది భక్తులు మరింతగా తరలి వస్తున్నారు. ఈ రథయాత్రలో భక్తులు జగన్నాథుడు, ఆయన సోదరసోదరీమణులు బల భద్రుడు, సుభద్రలకు చెందిన రథాలను లాగుతారు. ఈ ముగ్గురు దేవతలు ముందుగా గుండిచా ఆలయానికి వెళ్లి అక్కడ కొంతకాలం గడుపుతారు. తరువాత అక్కడ నుంచి జగన్నాథ ఆల >>2

# పర్యాటక పరిశ్రమలో 2 లక్షల కోట్ల పెట్టుబడులు

**సాంకేతికతవల్ల ఎవరికీ ఉద్యోగాలు పోవు**

**కొత్త పర్యాటక పాలసీ పెట్టుబడులను పెంచుతుంది**

**పర్యాటకశాఖ సలహాదారుగా రామ్‌దేవ్ బాబా: ముఖ్యమంత్రి చంద్రబాబు**





శుక్రవారం విజయవాడలో బాబా రాందేవ్‌తో కలిసి పర్యటక క్యారవాన్లను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్27,ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనా రంగంలో సాంకేతికతను ఉపయోగించడం వల్ల ఎవ్వరి ఉద్యోగాలు పోవన్నారు ఈ విషయంలో ఎవ్వరు భయపడవద్దు. టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్(సరళం)గా పని చేసుకోవాలని తానంటున్నారు.మనం మానవ వనరులు పెరగాలంటున్నామంటే, అభివృద్ధి రంగంలో ఆ వనరుల అవశ్యకత అధికంగా ఉందన్నారు.అందరూ హెల్తీ, వెల్తీ, హ్యాపీగా ఉండాలనేది తన లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గేమ్ ఛేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో జరిగిన గ్లోబల్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్ ఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ) టూరిజం కాన్‌క్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని ఇజంల కంటే టూరిజమే మిన్న అని దశాబ్దాల కిందటే తాను చెప్పిన మాట నిజమవుతోందని >>2

**రూ.500 కోట్లతో పతంజలి ప్రాజెక్టు** 2లో

## దిక్కుతోచని తోతాపురి రైతు

**రోజు రోజుకు ధర పతనం**

**కేజీ రూ.12 నిర్ణయిస్తే రూ.6.50 దక్కని వైనం**

**మామిడి సరఫరా చేసిన రైతుకు పైసా ఇవ్వని ఫ్యాక్టరీలు, ప్రభుత్వం**



**చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:** ఈ సీజన్‌లో తోతాపురి మామిడి ధర రోజు రోజుకు పతనం అవుతుండటంతో రైతు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి ఒక కేజీ రూ.12 గిట్టుబాటు ధరను ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీల్లో రైతుకు కేజీ తోతాపురి మామిడిపై రూ.6.50 కంటే మించి ఇవ్వడం లేదు. మామిడి సరఫరా చేసిన రైతుకు ఈ డబ్బులను సైతం ఫ్యాక్టరీలు ఇప్పటికిప్పుడు చెల్లించడం లేదు. రైతు మామిడి సాగు కోసం ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టివుండటం, ప్రస్తుతం కోత సమయంలో కూలీలు, మామిడి రవాణాకు వినియోగించే ట్రాక్టర్లకు సైతం ప్రభుత్వం, పల్ప్ ఫ్యాక్టరీలు డబ్బులు ఇవ్వడం లేదు. రైతు సొంత ఖర్చులు పెట్టుకుని మామిడి కోతలు కోసి, ట్రాక్టర్ బాడుగ చెల్లించి పల్ప్ ఫ్యాక్టరీలు, మండీలు, ర్యాంపుల వద్దకు వెళ్ళి తన మామిడి కాయలను ఇచ్చి ఒట్టి చేతులతో తిరుగుముఖం పడుతున్నాడు. అష్టకష్టాలుపడి తోట నుండి మామిడిని ఫ్యాక్టరీలకు వద్దకు తీసుకువస్తున్న రైతుకు తన కాయలను ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేయడానికి కనీసం 48 గంటలకు పైగా సమయం పడుతుంది. ఈ రెండు రోజుల పాటు ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు పడుతున్న రైతులకు భోజనానికి సైతం దిక్కులేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి పుష్కలంగా కాపు కాయడంతో మామిడి రైతుధరపై ఆశలు పెట్టుకొని ఆశల్లో విహరించాడు. అయితే పల్ప్ ఫ్యాక్టరీల వద్ద గత ఏడాది తయారు చేసిన పల్ప్ అలాగే నిల్వ వుండటం, అంతర్జాతీయ మార్కెట్ నుండి పల్ప్ ఫ్యాక్టరీలకు ఆశించిన ఆర్డర్లు రాకపోవడంతో తోతాపురి మామిడి రైతులో గుబులు ఏర్పడింది. ఒక దశలో తోతాపురి మామిడిని అడిగేవారు లేకపోవడంతో ప్రభుత్వం పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులు, మామిడి రైతులతో చర్చించి కేజీ తోతాపురి మామిడికి రూ.12 చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఇందులో ప్రభుత్వం రైతుకు సబ్సిడీ రూపంలో కేజీకి రూ.4చెల్లిస్తే పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ తోతాపురి మామిడిపై రైతుకు రూ.8 చెల్లించాల్సి వుంది. అయితే పల్ప్ ఫ్యాక్టరీ యాజమానులు సైతం కేజీపై రూ.8 చెల్లించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. అయితే ప్రభుత్వం పట్టుబట్టడంతో కొన్ని రోజుల పాటు ఫ్యాక్టరీలు రైతుల నుండి తోతాపురి మామిడిని తీసుకోలేదు. మామిడి రైతులు ఎలాగైనా తన తోతాపురి మామిడిని అమ్ముకోవాలని భావించి ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా ప్రారంభించారు. అయితే ఫ్యాక్టరీలు కేజీకి ఎంత చెల్లిస్తామనే విషయంను మామిడి రైతులకు ముందు చెల్లించలేదు. ఈ మేరకు ప్రారంభంలో కేజీ తోతాపురి మామిడికి రూ.7 వరకు చెల్లించిన ఫ్యాక్టరీలు, ఆపై కేజీపై రూ.6,ఆపై రూ.5 వరకు చెల్లించడం ప్రారంభించాయి. అయితే ఈ డబ్బులను ఫ్యాక్టరీ యాజమానులు అప్పటికప్పుడు రైతులకు ఇవ్వడానికి సాధ్యం కాదని తేల్చిచెప్పడంతో రైతులు సైతం ఎప్పుడో ఒకప్పుడు వస్తుందిలే! అని ఫ్యాక్టరీలకు మామిడి సరఫరాను ప్రారంభించాయి. అలాగే ర్యాంపులు, మండీల్లో తోతాపురి మామిడిని అడిగేవారు లేకపోయారు. మండీలు, ర్యాంపుల్లో తోతాపురి మామిడి ప్రస్తుతం కేజీ రూ.2.50 పలుకుతుంది. ఈ డబ్బులను సైతం మామిడి రైతులకు ర్యాంపుల యాజమానులు అప్పటికప్పుడు ఇవ్వడం లేదు. మరోవైపు ప్రభుత్వం మామిడి రైతులకు సబ్సిడీ రూపంలో కేజీపై రూ.4 చెల్లిస్తుందని చెప్పినప్పటికీ ఆ మొత్తం ఎప్పుడు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందనే విషయంను స్పష్టం చేయలేదు. ఈ పరిస్థితిలో రైతులు అప్పులు చేసి మామిడి కోత చేపట్టి ట్రాక్టర్ అద్దె చెల్లించి ఉచితంగా ఫ్యాక్టరీలు, మండీల వరకు మామిడి తీసుకెళ్ళి >>2



## ఈ యేడాదిలోనే నిరుద్యోగ భృతి

**సంబంధితశాఖలతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్**

**విజయవాడ,జూన్27,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఏడాదిలోపే నిరుద్యోగ భృతిని అమలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్న ద్ధమవుతోంది.ఆ దిశలో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేష్ అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖాధికారులతో పలు పర్యాయాలు సంప్రదించినట్లు సమాచారం అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలలో నిరుద్యోగ భృతి ఒకటి. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని అర్హులైన నిరుద్యోగులకు ప్రతీనెల రూ.3000 వారి అకౌంట్లో ప్రభుత్వం జమ చేయనుంది. ఈ పథకంపై ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సైతం స్పందించినట్లు తెలు >>2

## టెక్నాలజీతో నేరాల కట్టడి

**శాంతి భద్రతలు ఉంటేనే పెట్టుబడులు, అభివృద్ధి**

**ఎఐ ఫర్ ఎపి పోలీస్ హ్యాకథాన్‌లో సిఎం చంద్రబాబు**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 27:** టెక్నాలజీ సాయంతో ఆంధ్రప్రదేశ్ ని నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసులకు పిలుపినిచ్చారు. టెక్నాలజీతో దర్యాప్తు ఎలా చేయాలో వివేకా హత్య కేసే ఉదాహరణ అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఏఐ ఫర్ ఏపీ పోలీస్‌హ్యాకథాన్2025 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నేరాల కట్టడికి వేగవంతమైన దర్యాప్తునకు పోలీస్ విభాగం టెక్నాలజీని వినియోగించుకునే అంశంపై హ్యాకథాన్ నిర్వహించింది. ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన 4సైట్ ఏఐ సంస్థలు ఈ హ్యాకథాన్ నిర్వహించాయి. ఈ హ్యాకథానులో 160కు పైగా టీములు పాల్గొన్నాయి. ఈ టీములతో సీఎం చంద్రబాబు నాయుడు కొద్ది సేపు ముచ్చటించారు. పోలీస్ విభాగంలో టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఎలాంటి సేవలు అందించవచ్చు. పనితీరును ఏ విధంగా మెరుగు పరుచుకోవచ్చనే అంశంపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు.

**వివేకా హత్య కేసు... గూగుల్ టేకౌవుట్:** హ్యాకథాన్ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. శాంతి భద్రతలు కంట్రోల్లో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు కూడా శాంతి భద్రతలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చానని స్పష్టం చేశారు. దీనికి పోలీస్ శాఖ సమర్థవంతంగా పని చేయాలి. గతంలో మాదిరి కాకుండా పోలీసుల పనితీరు మారాలి. సహజంగా పోలీసులు పాత పద్ధతులను అవలంభిస్తారు. కానీ ఏపీ పోలీసులు టెక్నాలజీ అవసరాన్ని గుర్తించి ఈ రకమైన హ్యాకథాన్ ఏర్పాటు చేయడం సంతోషం. పోలీసులు తమ దర్యాప్తులో టెక్నాలజీని విరివిగా వినియోగించాలి. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. నారాసుర రక్తచరిత్ర అంటూ విమర్శించారు. కానీ సీబీఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ వాళ్లూ మారలేదు. మాజీ సీఎం అయ్యుండి తెనాలిలో రౌడీ షీటర్లకు సంఘీభావం తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లాలో పర్యటనలో ఏం జరిగిందో >>2

## జన్మతః పౌరసత్వ హక్కుపై ట్రంప్‌కు ఊరట

**దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పును కట్టడి చేసిన 'సుప్రీం'**



**న్యూయార్క్,జూన్ 27:** జన్మతఃపౌరసత్వం హక్కును రద్దుచేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జారీచేసిన ఉత్తర్వులను జిల్లాకోర్టులు రద్దుచేయడాన్ని అమెరికా సర్వోన్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ కేసుల విచారణలోట్రంప్‌కు పెద్ద ఉపశమనం లభించినట్లయింది. జిల్లాకోర్టుల ఈ జన్మతహ పౌరసత్వ హక్కును రద్దు చేయడం అంటే రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను ఉల్లంఘించడమేనని ఆనాడు ఉత్తర్వులను కొట్టివేసాయి. అయితే వీటిపై అప్పీలు చేసిన ట్రంప్ యంత్రాంగం జిల్లాకోర్టు న్యాయమూర్తుల >>2

## దక్షిణ మధ్య రైల్వే జిఎంగా సందీప్ మాథుర్

**అదనపు బాధ్యత అప్పగిస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు**

**గుంతకల్లు రైల్వే, జూన్ 27,ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జిఎం సందీప్ మాథూర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జిఎం అరుణ్ కుమార్ జైన్ ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం దక్షిణ >>2



సందీప్ మాథుర్





శుక్రవారం చంద్రబాబుకు హరిద్వార్ నుంచి తీసుకుని వచ్చిన గంగా జలం అందిస్తున్న బాబా రాందేవ్

# 2లక్షల కోట్ల పెట్టుబడులు

>> ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యాటక రంగం ద్వారానే పెద్ద ఎత్తున ఉద్యోగ అవ కాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉందని స్పష్టం చేశారు. వెల్‌నెస్, హ్యాపీనెస్ ఫ్యూచర్ డెస్టినేషన్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని ముఖ్య మంత్రి స్పష్టంచేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం పెట్టుబడులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. ఐటీ, ఉత్పత్తి పరిశ్రమలు, వ్యవసాయం కంటే ఎక్కువ మందికి పర్యాటక రంగం ఉద్యోగాలు కల్పిస్తుంది. పర్యాటక రంగం 20 శాతం వృద్ధి నమోదు చేస్తుంది. ఏపీలో భక్తుల్ని, పర్యాటకుల్ని ఆకట్టుకునేలా కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. శ్రీశైలంతో పాటు మరో 10 ప్రముఖ దేవాలయాలు పర్యాటక సర్క్యూట్‌లో ఉన్నాయి. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, అద్భుతమైన బీచ్‌లు, పురాతత్వ ఆనవాళ్లు కలిగిన ప్రదేశాలు, వెయ్యి కిలోమీటర్ల బీచ్ లైన్, కోనసీమ, హార్సిలీ హిల్స్ ఇలా వేర్వేరు అంశాలు ఏపీకి ఆకర్షణలు. ప్రస్తుతం అఖండ గోదావరి ప్రాజెక్టు చేపడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయని యువత భయపడుతున్నారని కానీ నైపుణ్యం పెంచుకుని స్మార్ట్ వర్క్ చేస్తే ఉద్యోగాలు ఎక్కడికీ పోవని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తు అంతా పర్యాటకరంగానిదే అని తాను ఎప్పుడో చెప్పానన్నారు. దశాబ్దాల క్రితమే భారత్‌లో ఐటీ అభివృద్ధి గురించి బిల్‌గేట్స్‌తో చర్చించానని గుర్తు చేశారు. తర్వాత బిల్‌గేట్స్ హైదరాబాద్‌లో ఐటీ కేంద్రం ఏర్పాటు చేశారని చెప్పారు. పర్యాటకశాఖకు సలహాదారుగా బాబా రామ్‌దేవ్ ఇటీవల యోగా డేను ఘనంగా జరుపుకున్నామన్న చంద్రబాబు, ఒక్క పిలుపుతో 3 లక్షల మందికి పైగా వచ్చారన్నారు. యోగా డేను ఘనంగా నిర్వహించడాన్ని ప్రధాని కూడా ప్రశంసించినట్లు చెప్పుకొచ్చారు. ఆధ్యాత్మికవేత్తగా ఉన్నా బాబా రామ్‌దేవ్ సమాజానికి సేవ చేస్తున్నారని, పర్యాటకశాఖకు సలహాదారుగా ఉండాలని ఆయనను కోరుతున్నానన్నారు. పర్యాటకరంగంలో అనేక ఉద్యోగాలు వస్తాయని, రాష్ట్రంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని బాబా రామ్‌దేవ్‌ను కోరారు. యోగా, మెడిటేషన్ గేమ్ ఛేంజర్ కానున్నాయన్న సీఎం, అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే సేంద్రియసాగు ఎక్కువ చేస్తున్నామని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో అనేకచోట్ల అందమైన అటవీ ప్రాంతం ఉందని, పాపికొండలు, కోనసీమ, హార్సిలీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. మదనపల్లె దేశంలోనే గొప్ప వెల్‌నెస్ సెంటర్‌గా మారాలని కోరుకుంటున్నానని చెప్పారు. ప్రతి రంగంలో సంపద సృష్టించాలనేదే తన లక్ష్యమన్న సీఎం, పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన ప్రభుత్వం తమదని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, విదేశాల్లో ఉన్న భారతీయుల్లో 35 శాతం తెలుగువాళ్లే అని పేర్కొన్నారు. విదేశాల్లో ఎక్కువ ఆదాయం పొందుతున్నదీ తెలుగువాళ్లేనన్నారు. బకింగ్‌హామ్ కాలువ ద్వారా కాకినాడ-చెన్నై మధ్య వాణిజ్యం జరిగేదని గుర్తు చేశారు. బాబా రామ్‌దేవ్ స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తారని కొనియాడారు. దేశంలో 1991 తర్వాత పీవీ ఆర్థిక సంస్కరణలు తెచ్చారని, తర్వాత మనదేశంలో ఐటీ బాగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశీయంగా తయారైన ప్రతి ఉత్పత్తిలో అంతర్జాతీయస్థాయి నాణ్యత ఉండాలన్న చంద్రబాబు, సరైన సమయానికి సరైన వ్యక్తి మనకు ప్రధానిగా ఉన్నారని తెలిపారు. మన దేశంలో బిలియనీర్లు బాగా పెరుగుతున్నారని, పేదవాళ్లను పైకి తెచ్చేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యాటకరంగం అభివృద్ధిపై ఏటా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం టూరిజం బ్రోచర్ సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. అదే విధంగా వివిధ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ టూరిజం కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు, బాబా రామ్‌దేవ్, మంత్రి దుర్గేష్, ఎంపీ కేశినేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం అమలు చేస్తున్నాం

### టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,జూన్27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పర్యాటకాభివృద్ధి కోసం గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం అమలు చేస్తున్న టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఏపీటీడీసీ సంయుక్తంగా నిర్వహిస్తున్న టూరిజం కాన్ క్లేవ్ టెక్ ఏఐ 2.0 కార్యక్రమంలో మంత్రి కందుల దురేష్ ప్రసంగించారుజ..రాష్ట్ర పర్యాటక విధానాలు, నిర్దేశిత లక్ష్యాలవివరణ..టూరిజం ప్రాజెక్టుల వేగవంతం వంటి అంశాలపై ఆయన మాట్లాడారు.టూరిజం ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటకులకు ప్రపంచస్థాయి అనుభవాల కల్పన, స్థానిక భాగస్వామ్యాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఇన్వెస్టర్ల సహకారం అవసరమని కాన్ క్లేవ్‌లో మంత్రి స్పష్టం చేశారు. తొలిరోజు పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే అంశాలపై చర్చ జరిగింది.. 2047 నాటికి రాష్ట్రాన్ని ప్రపం చస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసారు అంత ర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతామిని మంత్రిపేర్కొన్నారు. ఏపీలో పర్యా టకరంగానికి సీఎం చంద్రబాబునాయుడు పారిశ్రామిక హోదా కల్పించడ జరిగిందన్నారు. అందువలనే ఈ రంగం అభివృద్ధికి ఊతం వచ్చింది.పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు, ప్రాంతాల సందర్శన ద్వారా ప్రజలతో కనెక్ట్ అవ్వడం అనుభూతి చెందడం జరుగుతుందన్నారు. జీవితకాల జ్ఞాపకాలను కల్పించాలన్నది మా ఉద్దేశమన్నారు. టూరిజంలో ఆకాశమే హద్దు.. అవకాశాలను వదలవద్దు అన్న సీఎం మాటలు ఇన్వెస్టర్లకు గుర్తుచేస్తున్నాను. గతంలో టూరిజం రంగం నిరాదరణకు గురైందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాబోయే కాలంలో ఏపీ పర్యాటకాభివృద్ధి చెందుతుందని, ఇప్పటికే స్వదేశీ దర్శన్ 2.0, ప్రసాద్, శాస్కి, సీబీడీడీ స్కీమ్ ల ద్వారా వందలాది కోట్ల నిధులు కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఏపీలో వెల్ నెస్ సెంటర్లను వృద్ధి చేస్తే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తామని యూరోపియన్లు వెల్లడించారు. జూన్ 26న రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకి శంకుస్థాపన చేశామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఏపీ పర్యాటకం పెట్టుబడులకు అనుకూలం..ప్రభుత్వంతో కలిసి ఆలోచనలు పంచుకోండి..పెట్టుబడులతో వస్తే భరోసా కల్పించే బాధ్యత మాదని మంత్రి దుర్గేష్ అన్నారు.

# పౌరసత్వ హక్కుపై ట్రంప్‌కు ఊరట

>> అధికారాలను నియంత్రిస్తూ ఆదేశాలు జారీచేసింది. 6ః3 నిష్పత్తిలో వెలువడిన ఈ తీర్పులో జిల్లాకోర్టు న్యాయమూర్తులు కాంగ్రెస్ ఫెడరల్‌కోర్టులకు కేటాయించిన సమానత్వ అధికారాలను ఉల్లంఘించినట్లయిందని అభిప్రాయపడ్డారు. అయితే ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు వెనువెంటనే స్పందించలేదు. అయితే ట్రంప్ జారీచేస్తున్న వివాదాస్పద ఉత్తర్వులపై దేశవ్యాప్తంగా వెలువడుతున్న నిరసనలు వ్యక్తం అవుతున్నా దిగువ కోర్టులు తీర్పులు ఇస్తున్నా సర్వోన్నత న్యాయస్థానంలో ఈ ఒక్క ఉత్తర్వుతో సడలింపులు ఇవ్వడం ట్రంప్‌తోపాటు శ్వేతసౌధం అధికారాలకు మరింత పదును పెట్టినట్లయింది. కార్యనిర్వాహక వ్యవస్థపై ఫెడరల్‌కోర్టులు మితిమీరి వెళ్లకూడదని కాంగ్రెస్‌చట్టసభ కేటాయించిన సమానత్వ హక్కులకు లోబడి వారు విచారణలు, తీర్పులు ఉండాలని జస్టిస్ అమి కానీ బారెట్ అన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థను ఉల్లంఘించినట్లు కోర్టు ముగింపునకు వచ్చినంతమాత్రాన ఆకోర్టు రాజ్యాంగాన్ని ఉల్లంఘించి వ్యవహరించిందనికూడా భావించలేమని బారెట్ అన్నారు. ఈ తీర్పుపై ముగ్గురు లిబరల్ న్యాయమూర్తులు మాత్రం తమ అసమ్మతిని తెలిపారు. ఏకన్యాయమూర్తులున్న జిల్లాకోర్టుల్లోని జడ్జిలు ఇచ్చే తీర్పులు ఇకపై ప్రతినిధులచట్టసభ కల్పించిన అధికారాలకు, రాజ్యాంగపరిమితులకు లోబడి ఉండాలని న్యాయమూర్తులు పేర్కొన్నారు. మేరిలాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్‌స్టేట్ కోర్టులుట్రంప్ జారీచేసిన జన్మతహపౌరసత్వ హక్కు చట్టాన్ని రద్దుచేస్తూ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులు చెల్లనేరవని ప్రకటించాయి. దీనితో అహం దెబ్బతిన్న ట్రంప్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశవ్యాప్తంగా జారీచేస్తున్న ఇంజక్షన్ ఉత్తర్వులనురద్దుచేయాలని తన పిటిషన్‌లోకోరారు. ఓటర్ల అభిమతానికి వ్యతిరేకంగా ట్రంప్ ఆయన పార్టీ రిపబ్లికన్లు వెళుతున్నారన్న నిరసనలు కూడా వ్యక్తం అవుతున్న తరుణంలోసుప్రీం తీర్పు ట్రంప్‌కు భారీ ఊరటకల్పించింది.

# దక్షిణ మధ్య రైల్వే జిఎంగా సందీప్ మాథూర్

>> కోస్తా రైల్వే జోన్ జిఎంగా పనిచేస్తున్న సందీప్ మాథూర్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే రెగ్యులర్ జిఎంను నియమించే వరకు సందీప్ మాథూర్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని ఆయన ఆదేశాల్లో పేర్కొన్నారు.

# రూ.500 కోట్లతో పతంజలి ప్రాజెక్టు

### ఎపి పర్యాటక ప్రాంతాల గురించి ఉత్తరాది వారికి తెలియజేస్తా: బాబా రాందేవ్

**విజయవాడ, జూన్27, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రూ.500 కోట్లతో పతంజలి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని యోగా గురువు రామ్ దేవ్ బాబా తెలిపారు.విజయవాడలో జరిగిన జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్‌లో బాబు మాట్లాడుతూ, ఏపీ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఉత్తర భారత్ వాసులకు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాలు చాలా తెలియవని, వాటి గురించి పరిచయం చేయాలని తాను భావిస్తున్నట్లు వెల్లడించారు. యోగా ఆయుర్వేద, నేచురోపతి లాంటి అంశాలను పర్యాటక ప్రాంతాల్లో అవసరమని గుర్తు చేశారు. హార్సిలీ హిల్స్, అరకు, విశాఖ, రాజమహేంద్రవరం, పిచ్చుక లంక, సూర్యలంక లాంటి మంచి ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. పారిస్, స్విట్జర్లాండ్, టర్కీ ఇలాంటి దేశాలకు పర్యాటకం కోసం వెళ్తున్నాం కానీ మనదేశంలో మరిన్ని అందాలున్నాయని తెలిపారు. ఏపీలో ఉన్న పర్యాటక విధానం ఎంతో ఆకర్షణీయమన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని రాంబేవ్ ప్రశంసించారు. సీఎం చంద్రబాబు దార్శనికత తెలుగురాష్ట్రాల అభివృద్ధికి ఓ గొప్ప వరమని రామ్ దేవ్ బాబా కొనియడారు. సృజన, ప్రొడక్టివిటి, ప్రొఫెషనలిజం, సమర్థత, నిబద్ధత వంటి అంశాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని తెలిపారు. ఈ వయస్సులోనూ ఎంతో చలాకీగా నిర్ణయాలు తీసుకుంటూ, పాలన చేస్తున్నారని పొగడ్తలతో ముంచెత్తారు. ఏపీలో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు చేయాలని పతంజలి సంస్థ భావిస్తోంది. హార్సిలీహిల్స్‌ను ప్రపంచ ఐకానిక్ వెల్‌నెస్ సెంటర్‌గా మారుస్తాం. బాబా రాందేవ్ ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో అంతకంటే సుందరమైన ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. వీటిని అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్న రామ్ దేవ్ బాబా, నదీ తీరం, సముద్ర తీరాలు, సుందరమైన ప్రకృతి వనరులు ఏపీ సొంతమన్నారు. దిండి లాంటి ప్రాంతాల్లో వెడ్డింగ్ క్రూయిజ్ లేదా బోట్ లాంటి ప్రాజెక్టు చేపట్టవచ్చునని అభిప్రాయపడ్డారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఈ ప్రాంతాన్ని మార్చాలని ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. భారతీయ సంప్రదాయం పరంగా వివాహాలు జరిపించేలా డెస్టినేషన్ వెడ్డింగ్ ప్రాజెక్టు ఉంటుందని వివరించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలో పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా తెలిపారు.

### విజయవాడ నుంచి అమరావతి వరకు

# రోప్‌వే సదుపాయం కల్పించండి

### పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి సహకరించాలి

### కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వినతి

**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ కోరింది. శుక్రవారం మంత్రిని కలిసిన ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి భాస్కరరావు, బి రాజశేఖర్ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను మంత్రికి అందించారు. సుదీర్ఘ తీరప్రాంతం, సాంస్క ృతిక వారసత్వం, ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రాలు ఎపిని దేశంలో ఒక ముఖ్యమైన కేంద్రంగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. ఇంద్రకీలాద్రి బెర్మ్పార్క్ భవానీఐలాండ్"ను అమరావతిరాజధానిప్రాంతంతో అనుసంధానిస్తూ ఆధ్యాత్మిక, వెల్నెస్, సాహస, పాకశాస్త్ర, రోప్వే, బోటింగ్మరియు వాటర్ఫ్రంట్ అంశాలతో ఒక రివర్ఫ్రంట్మెగా టూరిజంహబ్‌గా అభివృద్ధిచేయాలని సూచించింది. సూర్యలంక, ఓడరేవు మధ్య కోస్టల్ బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. 10 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఇప్పటికే 50 వరకూ రిసార్టులు ఉన్నాయని, బీచ్‌రోడ్డు వేస్తే మరోగోవాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విశాఖపట్నాన్ని గేట్‌వే ఆఫ్ ఎపిగా తీర్చిదిద్దాలని, ఎయిర్‌పోర్టుకు ఓపెన్ స్కైపాలసీ రూపొందిస్తే పర్యాటకుల రాక పెరుగుతుందని వివరించారు. గోవా కోవలం బీచ్‌తోపాటు విశాఖపట్నం బీచ్‌కు బీచ్ డెస్టినేషన్ హోదా కల్పించాలని కోరారు. బీచ్ ఫ్రంట్ టైరిజం డెస్టినేషన్‌గా మచిలీపట్నం బీచ్‌ను తీర్చిదిద్దాలన్నారు. విజయవాడలో ఇంద్ర కీలాద్రి బెరంపార్కు, అమరావతి ప్రాంతంతో అనుసంధానిస్తూ రివర్‌ఫ్రంట్ మెగా టూరిజం హబ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. భీమిలి, భోగాపురం, కోనసీమ అగ్రిటూరం ఏర్పాటు చేయాలని కోరారు.

# టెక్నాలజీతో నేరాల కట్టడి

>> అందరూ చూశారు. తప్పులు చేసి బుకాయిస్తున్నారు. ఇలాంటి బుకాయింపులను తిప్పికొట్టాలంటే టెక్నాలజీని ఉపయోగించక తప్పదు." అని సీఎం స్పష్టం చేశారు.

**ప్రభుత్వం, పోలీసులే కాదు..యువత కూడా టెక్నాలజీ బాట పట్టాలి:** ప్రభుత్వంలో టెక్నాలజీని వినియోగిస్తున్నామని.. పోలీస్ విభాగం కూడా సాంకేతిక అందిపుచ్చుకుంటోందని.. దానికి ఈ హ్యాక్ థాన్ నిర్వహణే నిదర్శనమన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. టెక్నాలజీ ద్వారా సేవలు అందించడమే కాదు. పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని, డ్రోన్లను, సీసీ టీవీ కెమెరాలు అన్ని చోట్లా పెడుతున్నామని తెలిపారు. రౌడీలు గొడవ చేస్తే.. ఆధారాలతో వారి చొక్కా పట్టుకునే పరిస్థితి తెస్తాం. ఇష్టానుసారంగా గంజాయి అమ్ముతాం, సేవిస్తాం, పండిస్తాం అంటే కుదరదు.. తాటతీస్తాం. ఆడబిడ్డలను గొడవ చేస్తాం.. అత్యాచారాలను చేస్తాం అంటే కుదరదు అని అన్నారు. ఏఐ లేనప్పుడు కంట్రోల్ చేశాం. ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది, ఆధారాలు చాలా సులువుగా లభిస్తాయి. తప్పు చేస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేసి చూపిస్తాం. యువత టెక్నాలజీతో లబ్ధి పొందాలి. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు సత్తాను చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఇక్కడ క్వాంటం వ్యాలీ. వర్క్ లోకల్లీ థింక్ గ్లోబల్లీ యాక్ట్ గ్లోబల్లీ అనే విధంగా ప్రస్తుతం ప్రపంచం రూపాంతరం చెందుతోంది." అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

# పిఎస్సార్‌కు ముందస్తు బెయిలు నిరాకరణ

**విజయవాడ,జూన్ 27,ప్రభాతవార్త ప్రతినిధి:** శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నం జరిగినట్లు నమోదైన కేసులో వైకాపా ప్రభుత్వంలో నిఘా విభాగాధిపతిగా పనిచేసిన పీఎస్సార్ ఆంజనేయులుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరిస్తూ గుంటూరు రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.నాగరాజు తీర్పు చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండో నిందితుడిగా ఉన్న పీఎస్సార్ ఆంజనేయులు తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును ఆశ్రయించారు. కేసులో ఆయన పాత్ర కీలకంగా ఉందని, దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున ముందను బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి నాగరాజు తీర్పు చెప్పారు.

# జగన్ క్వాష్ పిటీషన్ విచారణ మంగళవారానికి వాయిదా

### ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశం

### జగన్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేసిన రవాణా శాఖ అధికారులు

**విజయవాడ,జూన్27,ప్రభాతవార్తప్రతినిధి:** రెంటపాళ్ళ తర పర్యటన సందర్భంగా ఒక వాహనం కింద పడి సింగయ్య మృతి ఘటనలో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ జగన్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది.తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.అంత వరకు జగన్‌పై ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జగన్ సత్తెనపల్లి పర్యటనలో సింగయ్య అనే వైకాంగ్రెస్ పార్టీ కార్యకర్త కారు కిందపడి దుర్మరణం చెందారు.ఈ మృతిపై నేల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసారు.ఈ కేసును కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు.ఇక జగన్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులు ఉంచారు.,ఏపీ 40 డిహెచ్ 2349 వాహనం ఫిట్‌నెస్ తనిఖీ చేసిన రవాణా శాఖ అధికారులు+ఎంవీఐ గంగాధర ప్రసాద్ అధ్వర్యంలో వాహన తనిఖీలు చేసారు.జగన్ క్వాష్ పిటీషన్ విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

# జగన్నాథ రథయాత్ర

>> యానికి తిరిగి వస్తారు. అంటే 27న మొదలైన ఈ రథయాత్ర జులై 8న ముగ్గురు దేవతలు తమ ప్రధాన మందిరానికి తిరిగి రావడంతో ముగుస్తుంది. 12వ శతాబ్దం నుంచి నేటి వరకు ఏటా ఇలానే పూరీ జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా అప్రతిహతంగా జరుగుతూనే ఉంది. పూరీ జగన్నాథుని రథయాత్రకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. అందుకే అధికారులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు 10,000 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. వీరిలో ఒడిశా పోలీసులు సహా సెంట్రల్ ఆర్మ్‌డ్‌ఫోర్స్ (సీఏపీఎఫ్)కు చెందిన 8 కంపెనీలు ఉన్నాయి. నిఘా కోసం పోలీసులు పూరీ పట్టణంలో 250కి పైగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎనేబుల్డ్ కెమెరాలు అమర్చారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు మారణహోమం సృష్టించిన దృష్ట్యా, పూరీలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఒడిశా డీజీపీ వైబీ ఖురానియా తెలిపారు. పూరీలో మొదటిసారి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. ఉత్తరా చెక్‌పూరి పట్టణాల మధ్య, పూరికోణార్క్ మార్గాల్లో దాదాపు 250కి పైగా ఏఐఎనేబుల్డ్ సీసీటీవీ కెమెరాలను అమర్చాం. వీటి ద్వారా ట్రాఫిక్ కదలికను నిత్యం పర్యవేక్షిస్తాం. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. రథయాత్ర భద్రత కోసం ప్రత్యేకంగా భవనాలపై ఎన్ఎస్‌జీ స్నిప్పర్ కమాండోలను మోహరించాం. యాంటీడ్రోన్ టెక్నాలజీని వాడుతున్నాం. పోలీసులు నిరంతర పర్యవేక్షణ కోసం డ్రోన్‌లను కూడా మోహరిస్తున్నారు. యాంటీ సాబోటేజ్ బృందాలు, బాంబ్‌స్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లను కూడా రంగంలోకి దింపామని ఒడిశా డీజీపీ వైబీ ఖురానియా తెలిపారు. రథయాత్ర దృష్ట్యా ఒడిశాలోని సముద్రతీరంలోనూ భద్రత పెంచారు.



శుక్రవారం నైనిటాల్‌లోని షేర్‌వుడ్ కాలేజీ 156వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

# ఈ యేడాదిలోనే నిరుద్యోగ భృతి

>> స్తోంది. ఈ నిరుద్యోగ భృతి పథకాన్ని ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకం అమలుకు సంబంధించి అనుసంధానమైన శాఖలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ హామీని వదిలిపెట్టేది లేదు అని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చి తీరుతామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన సంగతి తెలిసిదే. దీంతో ఈ ఏడాదిలోనే అంటే మరికొన్ని నెలల వ్యవధిలోనే నిరుద్యోగ భృతి పథకం అమలుకు నోచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగ భృతి పథకానికి అర్హులు ఖచ్చితంగా ఏపీ నివాసి అయి ఉండాలి.

18 నుంచి గరిష్టంగా 35 ఏళ్ల వయసు మధ్యలో ఉండాలి. అభ్యర్థి తప్పనిసరిగా పదో తరగతి /ఇంటర్మీడియట్ /డిప్లమా/ ఐటిఐ లేదా డిగ్రీ పాసై ఉండాలి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి ప్రభుత్వా లేదా ప్రైవేటు ఉద్యోగం చేయకూడదు ఏపీకి సంబంధించిన ప్రభుత్వ పథకాలు నుండి రాయితీ పొందుతూ ఉండకూడదు. దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు: దరఖాస్తు దారుడి ఆధార్ కార్డ్, పదో తరగతి మార్క్స్ లిస్ట్ ఆధారంగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్లు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫీసులో నిరుద్యోగి రిజిస్ట్రేషన్ ఐడి, రెసిడెన్సీ సర్టిఫికెట్ లేదా రేషన్ కార్డు. **దరఖాస్తు చేసుకునే విధానం:** ఈ పథకానికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుంది. ప్రారంభం అయినప్పుడు ఏపీఎస్ఎస్ డీజీ/ మీసేవ అధికారిక వెబ్ సైట్‌ను సందర్శించి పథకానికి సంబంధించిన డిటైల్స్ పూర్తి చేసుకోవాలి.

# దిక్కుతోచని తోతాపురి రైతు

>> అన్‌లోడ్ చేసి వస్తున్నారు. ఇప్పటికే మామిడిపంట సాగు కోసం లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన మామిడి రైతుకు ప్రస్తుతం పంట కోత దశకు వచ్చినప్పటికీ మళ్ళీ అప్పులు చేసి పంటను కోసి ఉచితంగా తీసుకెళ్ళి ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద ఇచ్చి వస్తుండటంతో మామిడి రైతు పరిస్థితి మరింత దిగజారింది. ఒక టన్ను మామిడి సరఫరా చేసిన రైతుకు కోత, రవాణా ఖర్చులు పోను కేవలం రూ.500 మాత్రమే మిగిలే పరిస్థితి నెలకొంది. ఈ రూ.500 సైతం ఇప్పటికిప్పుడు ఇచ్చే పరిస్థితుల్లో పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల యాజమానులు లేకపోవడంతో కోత, ట్రాక్టర్ల అద్దెలు రైతు చెల్లించే సమయానికి ఆ మొత్తంకు వడ్డీ చెల్లిస్తే రైతుకు ఒక టన్నుపై మిగిలిన రూ.500 సైతం ఖర్చు అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో మామిడి రైతు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

# అమరావతిలో రూ.145 కోట్లతో ఫోర్ స్టార్ లగ్జరీ హోటల్

**విజయవాడ జూన్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో రూ.145 కోట్ల పెట్టుబడితో ఫోర్‌స్టార్ లగ్జరీ హోటల్ ఏర్పాటుకు మంగళూరు కేంద్రంగా ఉన్న గ్రీన్‌పార్క్ హోటల్, రిసార్ట్స్, ముందుకొచ్చింది. దీనికి పర్యాటక విధానం-2024-29 కింద ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు మంజూరుచేసింది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 19న నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ సంస్థ ప్రతిపా దనలను ఆమోదించి, పర్యాటక విధానంలో ఎస్‌జీఎస్టీ స్టాంపుడ్యూటీ స్థిర మూలధన పెట్టుబడి విద్యుత్తు ఛార్జీలు విద్యుత్తు సుంకం, ఆస్తి పన్ను,నీటి, యూజీడీ ఛార్జీల్లో రాయితీలు అందించాలని నిర్ణయించారు. తాజాగా తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక సంస్థ సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది. ఈ హోటల్ ఏర్పాటు ద్వారా 250మందికి ఉపాధి లభించనుంది.

# సాహస పర్యాటకంలో ముందడుగు మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,జూన్ 27,ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటక రంగంలో మరో కీలక ముందడుగు పడింది. సాహస పర్యాటకం(అడ్వెంచర్ టూరిజం) కార్యకలాపాలకు సంబంధించి రాష్ట్ర పర్యాటక శాఖ గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. సాహస పర్యాటకం అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఆపరేటర్ల వివరాల నమోదు,లైసెన్స్,పర్మిట్ జారీ, సురక్షిత ప్రమాణాలు,భద్రత తనిఖీ విధానం,పర్యావరణ పరిరక్షణ,స్థానిక యువతకు ఉపాధి ప్రధానాంశాలుగా మార్గదర్శకాలు ఇచ్చింది.

సాహస పర్యాటకాన్ని మూడు విభాగాలుగా విభజించింది. భూమి ఆధారిత ట్రెక్కింగ్, జంపింగ్, నీటి ఆధారిత నెట్ స్కీయింగ్, స్కూబా డ్రైవింగ్,గగన ఆధారిత పారా గైడింగ్,హాట్ ఎయిర్ బెలూనింగ్,స్కై డైవింగ్‌గా విభజించారు. ప్రతి దానికీ ప్రమాద అంచనా,ప్రాథమిక చికిత్సపై శిక్షణ కల్గిన గైడ్లు తప్పనిసరని ప్రభుత్వం పేర్కొంది. 18 ఏళ్ళ లోపు పిల్లలకు ప్రమాద అవకాశం ఉన్న కార్యకలాపాల్లో పాల్గొనడంపై నిషేధం విధించింది.

# ముస్లిం సోదరులకు సిఎం మొహర్రం శుభాకాంక్షలు

**విజయవాడ,జూలై 27,ప్రభాతవార్తప్రతినిధి:** మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సందేశం ఇచ్చారు. చారిత్రాత్మక పోరాటానికి గుర్తు మొహర్రం అని.. మహమ్మద్ ప్రవక్త మనుమడు బలైన రోజు అని అన్నారు. ఈరోజుతో ఇస్లామ్ సంవత్సరం ప్రారంభమవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మానవ హక్కుల కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటానికి గుర్తు మొహర్రం. మహమ్మద్ ప్రవక్త మనుమడైన ఇమామ్ హుస్సేన్‌ను శత్రువులు బలిగొన్న రోజు ఇదే. మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు సాంప్రదాయాలకు అనుగుణంగా మొహర్రం జరుపుకోవాలని కోరుకుంటున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

### మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

ముస్లిం సోదరులకు మొహరం పండుగ సందర్భంగా మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.ఇస్లామిక్ క్యాలెండర్‌లోని మొదటి నెలైన మొహర్రం, ముస్లింలకు పవిత్రమైనది. ప్రవక్త మహమ్మద్ మనవడు ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని గౌరవించే సంతాప కాలంలో త్యాగం, భక్తి, విశ్వాసం ప్రకటించడమే మొహర్రం అంటూ మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

### గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా

# సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

**విజయవాడ జూన్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీఆర్డీఏ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు నియమితులయ్యారు.గవర్నర్‌కు ప్రస్తుత కార్యదర్శి హరజవహర్ లాల్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు.ఈ క్రమంలో సిఆర్డీఏ కమిషనర్‌గా పనిచేస్తున్న కన్నబాబు గవర్నర్ కార్యదర్శిగా నియమించారు.

## వారం - వర్జ్యం

తేది : 28-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
తదియ ఉ.9.58
పుష్యమి ఉ.6.36
వర్జ్యం రా.7.23-8.59
దు.తె.5.38-ఉ.7.18
శుభసమయం :ఉ.10.45-11.15, సా.7.15-8.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం** : స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి.

**వృషభం** :మిత్రులనుండి విలువైన సమాచారం అందుకొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం**: ఆర్థిక వ్యవహారాలలో ఆచితూచి ముందుకు సాగండి. రుణాలు కొంతవరకు తీరుతాయి.

**కర్కాటకం** :భూముల క్రయ విక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ప్రముఖుల కలయిక.

**సింహం**: వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో ముందుకుసాగుతారు.

**కన్య** : కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల** : దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరటచెందుతారు. ముఖ్యమైన పనుల సకాలంలో పూర్తిచేస్తారు.

**వృశ్చికం**: జీవితభాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకొంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**ధనుస్సు**: గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపందాలుస్తాయి. వృత్తి-వ్యాపారాలలో లాభాలుపొందుతారు.

**మకరం**: రాజకీయ, సాంకేతిక రంగాలలోని వారికి విదేశీపర్యటనలు వుంటాయి. ధనలాభం.

**కుంభం**: ఎదురుచూస్తున్న విధంగా ఒక మంచి అవకాశం లభిస్తుంది. దాని సద్వినియోగం చేసుకోండి.

**మీనం** : దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆశ్చర్యంకలిగిస్తుంది. ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రతి జిల్లాలో క్రికెట్ స్టేడియంలు

## యువజన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో శాప్ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

**విజయవాడ, జూన్ 27:** రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి నిర్మాణాత్మచర్యలు తీసుకంటున్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికిగారు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతనంగా నియమితులైన డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభా వంతమైన ఆటగాళ్ళను, క్రీడాకారులు గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, "రాష్ట్రంలో క్రీడా అభివృద్ధి, యువత లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడం జరిగిందన్నారు. శారీరకంగా దృఢమైన సమాజ నిర్మాణం మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని" అని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో క్రికెట్ స్టేడియంలు నిర్మించేందుకు కృషి జరుగుతోందని, విద్యార్థు లకు పాఠశాల స్థాయిలోనే క్రీడా మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి విజన్‌లో భాగంగా 2014-2019 మధ్య ఖరారు చేసిన ప్రణాళికల ద్వారా ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి పునాదులు పడ్డాయన్నారు. అదే మార్గంలో నేటి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రానికి అవసరమైన గేమ్ ప్రాజెక్టులకు కేంద్రాన్ని అభ్యర్థించిన విషయాన్ని గుర్తు చేస్తూ,

శాప్ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కలసి గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ, "క్రీడల్లో రాజకీయాలకు స్థానం లేదు. అభివృద్ధే లక్ష్యం.

## పోస్టల్ ఎంప్లాయిస్ కళాకారుల సంఘం అధ్యక్షుడు సూర్యారావుకు ప్రతిష్టాత్మక ఎన్టీఆర్అవార్డు

**విజయవాడ జూన్ 27 ప్రభాతవార్త ప్రతినిధిఃు** పోస్టల్ పెన్షనర్స్ పోస్టల్ ఎంప్లాయిస్ కళాకారుల, సంఘం అధ్యక్షులు తురగా సూర్యారావుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. డాక్టర్ ఎన్టీఆర్ విద్యాభూషణ్ విశిష్ట ప్రతిభారత్న లభించింది.:ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ స్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈఎస్ నారాయణమాస్టారు ప్రధాన కార్యదర్శి ఈ సూర్య తేజ శుభ్రం మాస్టర్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ స్వరోవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియం లో సేవా స్వర్ణం నుండి డాక్టర్ ఎన్టీఆర్ కళారత్నం డాక్టర్ ఎన్టీఆర్ విద్యాభూషణ్ విశిష్ట ప్రతిభారత్న పురస్కారాల మహోత్సవం జరిగినది. సభాధ్యక్షులుగా మందటి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా దైవజశర్మ పాల్గొన్న సభలో కాకినాడకు చెందిన రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ నటుడు సామాజిక వేత్తగా తురగా సూర్యారావు కి టర్బన్ పెట్టి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసారు. సూర్యారావుకు సత్కారం చేసి మెమెంటో అందచేసి విశిష్ట ప్రతిభారత్న అవార్డు 2025 అందజేసినారు కృతజ్ఞతపరంగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపకఅధ్యక్షులు సూర్యారావు కృతజ్ఞతలు తెలిపారు అనేకమంది కళాకారులు వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి అవార్డులు ఇవ్వడం సాహసోతమైన నిర్ణయమన్నారు. ఒక ఎన్టీఆర్ అవార్డుపొందిన తురగా సూర్యారావును పోస్టల్ పెన్షనర్స్ పోస్టల్ ఎంప్లాయిస్ కళాకారులు, విజయవాడ సాహితీ మిత్రులు శుక్రవారం ఒక కార్యక్రమంలో అభినందనలు తెలిపారు.


## బొలెరో వాహనం లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి

### మహిళకు తీవ్ర గాయాలు

**కసింకోట, జూన్ 27, ప్రభాత వార్త:** బొలెరో వాహనం లారీని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కి దుర్ఘటన మండలంలోని జమాదులపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున1.45 నిమిషాలకు చోటు చేసుకుంది. కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం, టీఎస్ 07యు జి 3405 నెంబర్ గల లారీ, ఏపీ 39యు ఎం 9180 నెంబర్ గల బొలెరో వాహనం ఎలమంచిలి నుండి అనకాపల్లి వైపు జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందున్న లారీ అకస్మాత్తుగా ఆగడంతో వెనుక ఉండి వస్తున్న బొలోరో వాహనం లారీని ఢీకొట్టడంతో బొలెరో వాహనం లో ఉన్న కసింకోట మండలం తీడ గ్రామానికి చెందిన పువ్వుల వ్యాపారి కన్నూరు లక్ష్మి (40), కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బొలెరో వాహనం డ్రైవర్ పి.సత్యనారాయణ(25) అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరో వాహనం లో ఉన్న అనకాపల్లి మండలం కోడూరు గ్రామానికి పువ్వుల వ్యాపారి చెందిన ఎన్. వరలక్ష్మి తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సైలు కే లక్ష్మణరావు ఎం .మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మహిళ ఎన్. వరలక్ష్మిని చికిత్స నిమిత్తం విశాఖపట్నం. మృతురాలు లక్ష్మి భర్త కన్నూరు వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కసింకోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద స్థలం వద్ద ట్రాఫిక్ నియంత్రించారు. ఎస్సై కే లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ అల్లు స్వామినాయుడు

## కేరళలో మూడేళ్ల చిన్నారి విక్రయం

### - సోషల్ మీడియాలో వైరల్ కావడంతో - హుటాహుటిన కేరళకు పోలీసులు - కేరళలో చిన్నారి స్వాధీనం



**కదిరి, జూన్ 27 ప్రభాతవార్త** డబ్బుల కోసం కన్న కూతురుని విక్రయించిన ఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో చోటు చేసుకోవడం కలవరమైంది. కదిరి రూరల్ మండలం మరవతాండకు చెందిన శ్రీవాణి, రవీంద్రనాయక్ ఉపాధి నిమిత్తం కేరళకు వలస వెళ్లారు. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి మూడో సంతానమైన మూడేళ్ల చిన్నారి జశ్వితబాయిని, కేరళ రాష్ట్రంలో కొతాయం అనే ప్రాంతానికి చెందిన రాజేష్ అనే వ్యక్తికి విక్రయించి గుట్టు చప్పుడు కాకుండా స్వస్థలానికి చేరుకున్నారు. చిన్నారిని రెండు నెలల క్రితమే విక్రయించినప్పటికీ బయటకు పడకుండా శ్రీవాణజ, రవీంద్రనాయక్ దంపతులు జాగ్రత్తలు పడ్డారు. అయితే అదే గ్రామానికి చెందిన రామచంద్రనాయక్, వారి బంధువులు కేరళ రాష్ట్రానికి ఉపాధికోసం వెళ్లారు. కొతాయం ప్రాంతంలో కూలీపనులు చేసుకుంటున్న వీరికి ఆ చిన్నారి కంట పడింది. మా పాప మీ దగ్గర ఎందుకుందని రాజేష్ అనే వ్యక్తిని వారు నిలదీయగా, అయితే ఆ ప్రాంతంలో పలుకుపబడి ఉన్న రాజేష్, రామచంద్రనాయక్ ఉండే అద్దె ఉన్న ఇంటి యజమానిని బెదిరించి ఖాళీ చేయించారు. మరువతాండాకు చేరుకున్న రామచంద్రనాయక్ వారి బంధువులను పిలిపించి జరిగిన విషయాన్ని తెలిపారు. మూకుమ్మడిగా అందరూ కలిసి దంపతులను నిలదీయడంతో అసలు విషయం బయట పడింది. ఈ దశలో ఇరువురు ఘర్షణ పడి గాయాలు కావడంతో ఆసుపత్రికి చేరారు. పూర్తి స్థాయిలో చిన్నారి విక్రయ ఘటన బయట పడటంతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, పోలీస్‌స్టేషన్‌కు పంచాయితీ చేరింది. డిఎస్పీ శివనారాయణస్వామి అప్‌గ్రేడ్ స్టేషన్‌కు చేరుకుని ఘటనపై సిఐ నిరంజన్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులను విచారించి చిన్నారి విక్రయ ఘటనను నివేదికను అందజేయాలని డిఎస్పీ ఆదేశించడంతో సిఐ నిరంజన్‌రెడ్డి చిన్నారి తల్లిదండ్రులు శ్రీవాణి, రవీంద్రనాయక్‌లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని ఒప్పుకోవడంతో ఎన్‌పికుంట ఎస్ఐ వలీబాషా ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి కేరళకు పంపించారు. శుక్రవారం కేరళ రాష్ట్రంలోని కొతాయం ప్రాంతానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాజేష్ అనే వ్యక్తి ఇంటిలో ఉన్న మూడేళ్ల చిన్నారి జశ్విత బాయిని స్వాధీనం చేసుకుని కదిరికి తీసుకొస్తున్నారు. సకాలంలో పోలీసులు చాక చక్యంగా స్పందించి ప్రత్యేక టీంను కేరళకు పంపి చిన్నారిని స్వాధీనం చేసుకోవడం పట్ల ప్రజలు, నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.7,976 కోట్లతో 281 అమృత్ ప్రాజెక్ట్‌లకు టెండర్లు!

**విజయవాడ,జూన్ 27,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 117 పట్టణ స్థానిక సంస్థల్లో అమృత్ 2.0 పథకంలో రూ.7,976 కోట్లతో 281 తాగునీటి సరఫరాల, మురుగునీటి పారుదల, నీటివనరుల పునరుద్ధరణ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచామని, త్వరలోనే మొదలవు తాయని రాష్ట్ర పట్టణ, ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీయూఎఫ్ఐడీసీ) కోట్లతో 134 నీటి సరఫరా, మరో రూ. 2037.43 కోట్లతో 30 మురుగునీటి పారుదల, ఇంకో రూ.371.77 కోట్లతో 117 నీటి వనరుల పునరుద్ధరణ ప్రాజెక్టుల పనులు 98 అసెంబ్లీ నియోజక వర్గాల్లో చేపడుతున్నామని ఆయన వివరించారు.

## జుత్తాడ హత్యల కేసులో నిందితునికి మరణశిక్ష

### నాల్గవ అదనపు జిల్లా జడ్జి సంచలన తీర్పు



**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)** సంచలనం సృష్టించిన జుత్తాడ హత్యల కేసుల్లో నిందితునికి మరణశిక్ష విధిస్తూ నగరంలోని నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం .నాగేశ్వరరావు తీర్పునిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు బత్తిని అప్పలరాజు (47) విశాఖ జిల్లా పెందుర్తి మండలం వి జుత్తాడ గ్రామపంచాయతీ ఎగువ యాతపేటకు చెందినవాడు. మృతులు కుటుంబానికి చెందిన ఒక వ్యక్తితో జరిగిన కారణం వల్ల 2021 ఏప్రిల్ 15వ తేదీన ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేశాడు. హత్య చేయడంతోపాటు తానే హత్య చేశానని 100 నెంబర్ కు 108కు పోలీసులకి కూడా సమాచారం ఇచ్చి అదే రోజు రాత్రి పోలీసులు లింగా పోయాడు. పెదవాల్తేరు సమీపంలోని శివాజీ పాలెం చెందిన అల్లు రమాదేవి (55) నెక్కల అరుణ (57) బమ్మిడి రమణ (63) బమ్మిడ ఉషారాణి (35) బమ్మిడి ఉదయ నందన్ (2) బమ్మిడి లిఖిత్ (ఆరు నెలలు) లను కమ్మ కత్తితో అతి కిరాతకంగా నరికి చంపాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302,449,450,451,506(2) ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. పోలీస్ ఇన్స్పెక్టర్ కె.వి సతీష్ కుమార్ ప్రాసెక్యూషన్కు సహకరించారు. ప్రాసెక్యూషన్ 91 మంది సాక్షులను విచారించారు. ఈ కేసులో మరి కొంతమంది నిందితులో ఉన్న వారిపై కేసును రుజువు కాలేదు. ఆరు హత్యలు.. డయల్ 100 కి కాల్ జుత్తాడ గ్రామంలో ఆరు హత్యలు చేసిన తర్వాత నిందితుడు అప్పలరాజు 100 కు కాల్ చేసి తానే హత్యలు చేసినట్లు పెందుర్తి పోలీసులకు లొంగిపోయాడు..నిందితుడు అప్పలరాజు కుమార్తెను రమణ కుమారుడైన విజయ్ గతంలో ప్రేమించాడు. ఈ విషయంపై రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. ఆ విషయంలోనే 2018లో పెందుర్తి స్టేషన్‌లో విజయ్ కుటుంబ సభ్యులు అప్పలరాజుపై కేసు పెట్టారు. అప్పటి నుంచి విజయ్ కుటుంబంపై అప్పలరాజు కక్ష పెంచుకున్నాడు. ఆ తర్వాత చిన్న చిన్న గొడవలు జరిగేవి. అయితే కొన్నాళ్లకి విజయ్ ఉపాధి కోసం విజయవాడ వెళ్లిపోయారు. అక్కడే ఉష అనే అమ్మాయిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. విజయ్ తండ్రి రమణ మాత్రం జుత్తాడలోనే ఉన్నారు. అయితే ఓ పెళ్లి షాపింగ్ నిమిత్తం విజయ్ భార్య, ఇద్దరు పిల్లలు విశాఖకు వచ్చారు. ఆ ఉదయాన్నే షాపింగ్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. వేకువజామున ఇంటి ముందు రమణ భార్య ముగ్గులు వేస్తున్నారు. ఈ విషయాన్ని ఎదురుగా గేదెలను కడుతున్న అప్పలరాజు చూశారు. వెంటనే అక్కడే ఉన్న గడ్డి కోసే కత్తి తీసుకుని రమణ భార్యను నరికేశాడు. తర్వాత ఇంట్లో రమణ కోడలు, ఇద్దరు పిల్లలు, మరో ఇద్దరు మహిళలను దారుణంగా హత్య చేశాడు. ఈ విషయాన్ని అప్పలరాజే ఊరిలో కత్తి పట్టుకుని తిరుగుతూ అరుస్తూ చెప్పినట్టు గ్రామస్తులు అప్పట్లో పోలీసులకు చెప్పారు.. హత్యలకు కారణం ఇదే.. "నిందితుడు అప్పలరాజు కుమార్తెను విజయ్ ప్రేమించి మోసం చేశాడని, అత్యాచారం చేశాడని పోలీస్ స్టేషన్లో అప్పలరాజు కుటుంబీకులు అప్పట్లో ఫిర్యాదు చేశారు. అలాగే, అప్పలరాజు కుటుంబంతో తమకు ప్రాణభయం ఉందంటూ విజయ్ కుటుంబం కూడా ఫిర్యాదు చేసింది. ఈ రెండు ఫిర్యాదులపై పెందుర్తి స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. తన కుమార్తె జీవితం నాశనం అవ్వడానికి కారణమైన విజయ్ కుటుంబంపై అప్పలరాజు పగ పెంచు కున్నాడు. సమయం కోసం వేచి చూశాడు. ఆరుగురిని హత్య చేశాడు.

## పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బిఎ అనుమతి

**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతిలోని పద్మావతి మహిళ పాలిటెక్నిక్ కళాశాలకు విద్యాబోధన, ల్యాబ్స్, తరగతి గతుల నిర్వహణకు న్యూఢిల్లీ ఎన్‌బిఎ (నేషనల్ బోర్డు అక్రిడిటేషన్)లభించింది. మూడేళ్ళపాటు ఈ అనుమతి ఉంటుంది. టిటిడి ఆధ్వర్యంలో పద్మావతి మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఎన్‌బిఎ నిపుణులు కళాశాలో ప్రయోగశాలలు, అధ్యాపకుల బోధన, సిబ్బంది వివరాలు, రికార్డులు, మౌళిక సదుపాయాలు, ల్యాబ్స్, లైబ్రరీ నిర్వహణ తదితర అంశాలపై విద్యార్థులనుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

## అంగరంగ వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల తిరుణాళ్లు ప్రారంభం

**శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయాలనికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ నిర్వహించారు. ఆలయ సాంప్రదాయాల మేరకు ధ్వజారోహణ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఆలయాధికారులు, కూటమి నాయకులు సహచరులు హాజరుకాగా సంప్రదాయబద్ధంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వారి సహచరులు పర్యవేక్షించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, ధర్మరాజలస్వామి ఆలయ పూజారులు సహాయకులు వేదపండితులు అర్ధగిరి హాజరు అయి పర్యవేక్షించారు. ఆలయం తరఫున డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, హేమామాలిని ఉత్సవాల ఇన్‌చార్జి లక్ష్మయ్య హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది అత్యంత వేడుకగా నిర్వహించుటకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో ఇఓ డి.బాపిరెడ్డి వారం రోజులుగా పర్య వేక్షించారు. భక్తులకు కల్పించాల్సిన సదుపాయాల గురించి వివరించారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి



ఉత్సవర్లను ఊరేగింపుగా తెచ్చారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయంలో వార్షికోత్సవాలు బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో 12 రోజులు ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆలయాధికారులు, రాజకీయ నాయకులు హాజరు కాగా ఏర్పాట్లును చిన్న ఆల యాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

## రాష్ట్రంలో మరో మూడు పరిశ్రమలు ఏర్పాటు

### - అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్27.ప్రభాతవార్తప్రతినధి:** రాష్ట్రంలో మరో మూడు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం వాటికి అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అనంతపురం జిల్లా గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ సంస్థ తిమ్మసముద్రంలో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా రూ.1150 కోట్లతో 155ఎంఎం ఆర్టిలరీ గన్‌ల కోసం బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ను నెలకొల్పనుంది. కంపెనీ ఏర్పాటు కోసం ఎకరం రూ.8.30 లక్షల చొప్పున 121.53 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఆదేశాలిచ్చింది. భూమి స్వాధీనం చేసుకున్న 14 నెలల్లో ఉత్పత్తి చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిశ్రమ ఏర్పాటుతో 299 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అదేవిధంగా ట్రిపుల్ బేస్ ప్రొపెల్లెంట్ , సింగిల్ బేస్ ప్రొపెల్లెంట్ యూనిట్‌లను ఈ సంస్థ అదనంగా నెలకొల్పనుంది. నెల్లూరు జిల్లా నాయుడుపేటలో పరిశ్రమ ఏర్పాటుకు సంగం సంస్థకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ క్రమంలో నాయుడుపేట ఎంపీసెజ్‌లో రాయితీపై భూములు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఎకరం రూ.50 లక్షల చొప్పున 22.80 ఎకరాలు కేటాయించింది. రూ.112 కోట్లతో పాలు, ఉత్పత్తుల యూనిట్ ను ఆ సంస్థ నెలకొల్పనుంది.

## ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ వాహనం పేలి మహిళ మృతి

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త:** ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటీ పేలి వృద్ధమహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఛార్జింగ్ పెట్టడంతో తెల్లవారు జామున సుమారు 4 గంటల సమయంలో అకస్మాత్తుగా వాహనం పేలడంతో పక్కనే నిద్రిస్తున్న వెంకటలక్ష్మి(62) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఈ ఘటనలో ఛార్జింగ్ ఉపయోగించిన ప్లగ్‌పాయింట్ వాహనంలో ఏదైనా లోపం ఉందా, అనే కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలి

### - అతిక్రమిస్తే చర్యలు .. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తుల సౌలభ్యంకోసం పలుచోట్ల లైసెన్స్ కలిగి దుకాణాలు నడుపుకుంటున్న వ్యాపారులు నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. హాకర్‌లైసెన్స్‌లు, దుకాణాల లైసెన్స్‌లను శుక్రవారం సాయంత్రం ఆయన రెవెన్యూ, విజిలెన్స్ విభాగాలతో కలసి తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్ పడమరవైపు తనిఖీలు చేశారు. లైసెన్స్‌లో సూచించిన మేరకు ఆయా వ్యాపారాలు నిబంధనల మేరకు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పలు దుకాణాల లైసెన్స్‌లను, ధరల పట్టికను గమనించారు.

## దివ్వెల మాధురికి టిటిడి నోటీసులు

### - కొండపై అతిథిగృహం వద్ద రీల్స్ దుమారం

**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలపుణ్యక్షేత్రంపవిత్రతను మరోసారి మంటగలుపుతూ వైసిపి ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ భార్య దివ్వెలమాధురి బసచేసిన విభవ అతిథిగృహం వద్ద రీల్స్‌చేయడం ఇప్పుడు దుమారం రేపుతోంది. ఇద్దరూ కలసి బుధవారం ఉదయం తిరుమలకు శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం దివ్వెల మాధురి బసచేసిన అతిథిగృహం వద్ద మరోసారి రీల్స్ చేస్తూ వివాదాస్పదంగా మారారు. గతంలోనూ వీళ్ళు ఆలయం ముందు పరిసరాల్లో చేసిన రీల్స్ వీడియోలుపెద్ద దుమారాన్ని రేపిన విషయం విదితమే. తాజాగా బుధవారం రోజు తిరుమలకు వచ్చిన ఈమె కొండపై రీల్ చిత్రీకరించి భక్తులను మనోభావాలు దెబ్బతీశారని భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిటిడి విజిలెన్స్ అధికారులు ఆమెకు నోటీసులు జారీచేశారు. మరీ దీనిపై ఆమె ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే. అతిథిగృహం వద్ద రీల్స్‌చేయడం వరకే పరిమితంతో విచారణ చేస్తారా లేక కేసు నమోదు చేస్తారా అనేది తెలియడంలేదు. తిరుమలకొండపై ఆధ్యాత్మికత, భక్తిభావం ,గోవిందనామం తప్ప మరొకటి ఉండరాదని టిటిడి విజ్ఞప్తి. మరీ ఈ రీల్స్ వివాదం ఎక్కడకు దారితీస్తుందో ముందుముందు తెలియనుంది.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆనందం

### చీఫ్ సమాచార కమిషనర్ హీరాలాల్



**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మనసు ఆనందంగా ఉందని చీఫ్ సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా తెలిపారు. శుక్రవారం ఉదయం హీరాలాల్ దంప తులు తిరుమలకు చేరుకుని విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలుగు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలి : టిజి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



**తిరుమల,జూన్27ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాలు అన్ని విధాలా ప్రజలకు మంచిచేస్తున్నా యని, ప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు టిజి ఎంఎల్ఎ కౌశిక్‌రెడ్డి తెలిపారు. శ్రీవారి దయతో సకాలంలో వర్షాలు కురిసి అన్ని వర్గాల ప్రజలు సంక్షేమంతో ఆనందంగా ఉన్నారన్నారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసిఆయన తిరుమలకుచేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భగవంతుని ఆశీస్సులు అందరిపై కలగాలి

### - దేవాదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్



**తిరుమల,జూన్ 27ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంక టేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలం దరిపై ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు దేవాదాయశాఖ ప్రిన్సి పల్ కార్యదర్శి, టిటిడి బోర్డు ఎక్స్‌ఎఫిషియో సభ్యుడు వాడరేవు వినయ్‌చంద్ తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పి స్తున్నారన్నారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదాశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారి ఆశీస్సులతో శుభాలు: ప్రముఖులు

**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థలూథ్ర, కర్నాటకమంత్రి శివానంద్ ఎస్‌పాటిల్, ఆదాయపు పన్నుకమిషనర్ మిట్టల్ మధుస్మిత, రాజకీయవేత్త ఎంసి సుధాకర్ తదితరులు కుటుంబంతో కలసి తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

CORTEVA agriscience గమనిక

కోర్టేవా అగ్రిసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్రింద పేర్కొన్న బ్రాండ్ పేర్లలో దిగుమతి చేసుకున్న 100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువుల గ్రేడ్ లను మీకు అందిస్తుంది. దిగుమతి చేసుకున్న 100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువుల యొక్క అన్నీ పేర్కొన్న గ్రేడ్ లు వ్యవసాయం మరియు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూ ఢిల్లీ జారీ చేసిన FCO నోటిఫికేషన్ నంబర్ S.O 2900E ప్రకారం ఉన్నాయి.

గ్రేడ్ లు:
1. హార్వెస్ట్ మోర్ NPK-10:44:10
2. హార్వెస్ట్ మోర్ NPK-11:05:41
3. హార్వెస్ట్ మోర్ NPK-10:55:10
4. హార్వెస్ట్ మోర్ NPK-05:05:45
5. హార్వెస్ట్ మోర్ NPK-19:19:19

పై గ్రేడ్ ల ముఖ్య లక్షణాలు:
1. దిగుమతి చేసుకున్న 100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు.
2. దిగుమతి మరియు నాణ్యతను మెరుగుపరుస్తుంది.
3. బిందు సేద్యం పద్ధతి & పంట పై పిచికారి ద్వారా ఉపయోగించడానికి అనుకూలం.

అందుబాటులో ఉన్న ప్యాకింగ్ లు:
1.1 కిలో, 5 కిలోలు, 10 కిలోలు & 25 కిలోలు

గమనిక:
పైన పేర్కొన్న దిగుమతి చేసుకున్న 100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువుల సరఫరా మరియు అమ్మకాల ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజుల తర్వాత ప్రారంభమవుతాయి

వార్త

మాటలకే పరిమితమయ్యే మిత్రుడెవ్వడూ నీ మిత్రుడిగా ఉండలేడు. మానవ సంక్షేమానికి అసలు మూలం పనే.

-లియో టాల్‌స్టాయ్

# 'మత్తు' ముప్పు నుంచి కాపాడలేమా?

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయడమో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తిచేయడం సామర్థ్యం. మానవ జాతిని ప్రధానంగా యువతను పట్టిపీడిస్తున్న బ్రహ్మారాక్షసి మాదకద్రవ్యాలకు అడ్డుకట్టవేయాలనేది పాలకులతోసహా అందరికి తెలిసిందే. మాదకద్రవ్యాల వ్యసనం మానవజాతి వినాశనానికి దారితీస్తుందని, దాన్ని సమిష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా పాలకులు పదే పదే చెబుతున్నారు. దీన్ని ఎలా నిరోధించాలో కూడా స్పష్టంగా తెలుసు. కానీ ఆ రక్కసిని దేశం నుంచి పారద్రోలలేకపోతున్నారు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి మాదకద్రవ్యాలపై యుద్ధమే ప్రకటించారు. రాబోయే రోజుల్లో కళాశాలల్లో పాఠశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలు పట్టుబడితే యాజమాన్యాల మీద కూడా కేసులు పెట్టాలని ఆదేశించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో తెలంగాణ యాంటీనార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఫీజులు వసూలు చేయడం తప్పపిల్లల బాధ్యత తమది కాదని, విద్యాసంస్థలు భావిస్తే ఇక కుదరదు అని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్ విక్రయించే సంస్కృతి కన్పిస్తోందని, అలాంటి సమాచారం వెంటనే పోలీసులకు అందివ్వాలని సూచించారు. తల్లిదండ్రులు ఉద్యోగాల్లో తలమునకలై విద్యాసంస్థలపై నమ్మకంతో లక్షల రూపాయలు చెల్లించి పిల్లలను చేర్పిస్తున్నారని, ఎక్కువ సమయం విద్యాసంస్థల్లోనే పిల్లలు గడుపుతున్నారని, అందుకే చదువు చెప్పడంతోనే యాజమాన్యం బాధ్యత అయిపోదని పిల్లల్లో వచ్చే మార్పులు, ఎలాంటి వ్యసనాలకు గురవుతు న్నారో పర్యవేక్షించాల్సిన సామాజిక బాధ్యత విద్యాసంస్థలపై ఉన్నదని స్పష్టంచేశారు. విద్యార్థుల్లో వచ్చే మార్పులను గమనించడానికి మానసిక నిపుణులను కూడా నియమించుకోవాలని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. వాస్తవంగా కూడా ఈ మాదకద్రవ్యాలు తమ సంస్థల్లోకి ప్రవేశించినా కొన్ని యాజమాన్యాలు నిస్సహాయక స్థితిలో చూస్తూ ఉండిపోతున్నాయి. ఎన్నోసార్లు విద్యాసంస్థల చుట్టుపక్క లనే ఉన్న కిరాణాదుకాణాల్లో మాదకద్రవ్యాలతో తయారు చేసిన చాక్లెట్లను అమ్ముతూ పట్టుబడ్డాయి. పోలీసులు అరెస్టు చేసి కేసులుపెట్టారు. అయినా మళ్లీ అదేవ్యాపారం ఆ షాపుల్లోనే జరుగుతుండడం దురదృష్టకరం. రానురాను ఏడు, ఎనిమిది తరగతులు చదువుతున్న విద్యార్థులను లక్ష్యంగా ఎన్నుకొని వారికి అలవాటు చేస్తున్నట్లు ఎన్నో సందర్భాల్లో వెలుగు చూసింది. ఇది రానురాను విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా ఈ పిశాచి భావి భారత పౌరులుగా ఎదిగి దేశాన్ని పురో గాభివృద్ధివైపు పరుగులు పెట్టించాల్సిన యువతను పట్టిపీడిస్తున్నది. అధునాతనమైన శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుత విజయాలు సాధిస్తున్న మానవుడు ఈ మత్తు రక్కసిపోరులో చతికిలపడిపోతున్నాడు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈమత్తు సామ్రాజ్యం విస్తరించిపోతున్నది. ఈరోజు, ఆరోజు అనికాదు. ప్రతిరోజూ వేలాదికోట్ల రూపాయల విలువైనమాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు. ఈమత్తువ్యాపారం ఇప్పటికిప్పుడు ప్రారంభమైంది కాదు. ఏనాటినుంచో కొనసాగుతున్నది. అంతర్జాతీయంగా హెరాయిన్ వాడకం దాదాపు రెండువేల టన్నులకు మించిందంటే పరిస్థితి ఏస్థాయికి వెళ్లిందో ఊహించుకోవచ్చు. మత్తుపదార్థాలకు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా తయారైంది. మారుతున్న జీవనవిధానం, అధిక మొత్తాల్లో లభించే ఆదాయం యువతను ఈ వక్రమార్గంలోకి నడిపిస్తున్నది. హుక్కా కేంద్రాలు, మరికొన్ని పబ్‌లు, రెస్టారెంట్లు మొదలు విద్యాలయాలు, ప్రయాణప్రాంగణాలు, నగరాల శివార్లలోని పారిశ్రామికవాడల దాకావ్యాపించిన ఈ దుష్ట సంస్కృతి జాతి భవితను ప్రశ్నార్థకం చేస్తున్నది. దీన్ని నిరోధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతంకావడం లేదు. వాస్తవంగా సరఫరా, వినియోగమవుతున్న మత్తు మందుల్లో వందోవంతు కూడా పట్టుబడడం లేదు. పట్టు బడిన కేసుల్లోకూడా తొంభైశాతానికిపైగా న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. అందుకే పట్టు బడి జైళ్లకు వచ్చినవారు సైతం మళ్లీ అదేవ్యాపారంలో కొనసాగుతున్నారు. పోలీసులన్నా, నార్కోటిక్ విభాగం అధికారులన్నా ఈమత్తుమందు వ్యాపారుల్లో భయభక్తులులేవు. తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందు నేరం రుజువుచేసి నిందితులకు శిక్ష వేయించడంలో అధికార గణం విఫలమవుతున్నది. యువతను నిర్వీర్యంచేసి జాతి ప్రయోజనాలను దెబ్బతీసే ఈ మత్తుమందులను నిర్మూలించేందుకు ఎన్నోదేశాలు పకడ్బందీవ్యూహాలతో పదునైన చట్టాలతో అడుగులుముందుకు వేస్తున్నాయి. చైనా, వియత్నాం, ఇరాన్, థాయిలాండ్, సౌదీ అరేబియా, కాంబోడియా, ఇండోనేషియా ఉత్తర కొరియా, కొలంబియా తదితర దేశాలు మత్తుమందుల నేరాల్లో మరణశిక్ష విధిస్తున్నాయి. ఫిలిప్పీన్స్‌లోనైతే పాలకులు మరోఅడుగుముందుకు వేసి ఈ మత్తుమందుల వ్యాపారంలోభాగస్వాములైన వారిని కాల్చిచంపింది. అమెరికా లాంటిదేశాలు మత్తుమందుల నియంత్రణ, నిరోధం విషయంలో యేటావేలాదికోట్లు ఖర్చుపెడుతున్నాయి. ఇలా ఎన్నోదేశాలు రకరకాలవ్యూహాలతో ఈ మత్తుపై యుద్ధాన్ని ప్రకటి స్తుంటే మనదేశంలో ఏదో నామమాత్రపు కేసులతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఫలితంగా అంతకంతకు పెరిగిపోతున్నది. యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈ మాదకద్రవ్యాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది.

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



## హింసను ప్రేరేపించే భాష వద్దు

సినిమా భాష కొన్ని సందర్భాలలో సన్నివేశాన్ని బట్టి అసభ్యంగా ఉండవచ్చు. దాన్ని ప్రామాణికంగా తీసుకుని రాజకీయ నాయకులు, ఇతరులు ప్రజా వేదికల మీద మాట్లాడితే అది విమర్శలకు దారి తీస్తుంది. గత ఆంధ్ర రాష్ట్రాధినేత రప్పారప్పా ఏదో జాతరలోలాగ తలలు తెగ్గోడతాం అంటూచేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయే తప్ప మరల పదవిలోకి రావడానికి పునాదిలా మాత్రంలేవు. వేలకోట్ల రూపాయల అవినీతి, అనేక కోర్టు కేసులు సదరు పూర్వ ప్రజానాయకుని మీద ఉన్నా, ఆ కేసులు వేలసార్లు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నా ఆ నాయకుడు ధైర్యంగా, నోటికొచ్చినట్లు మాధ్యమాల్లో మాట్లాడుతున్నా, ఏళ్ల గడుస్తున్నా కోర్టులు తీర్పు ఇవ్వడం లేదంటే ఆవ్యక్తికి ఏదో ఒక అతీతమైన శక్తి తెర వెనుక నుంచి కాపాడుతోందనే నిశ్చితాభిప్రాయం ప్రజలలో కలుగుతోంది. ఆ కారణంగా ప్రస్తుత ప్రభుత్వం ఆవ్యక్తి మీద ఏ చర్య తీసుకోలేకపోతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రభుత్వ బడులను మెరుగుపర్చాలి

గవర్నమెంట్ పాఠశాలలో సరైనసౌకర్యాలు కల్పిస్తూ పిల్లలు ఆహ్లాదకరమైనవాతావరణంలో చదువుకునే విధంగా మౌలిక వసతులు కల్పించిపేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు అందించాలి. పెరిగిన శాస్త్రసాంకేతికత అనుగుణంగా నూతన విద్యావిధానంతో పాటు కంప్యూటర్ విద్యకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే కార్పొరేట్ దీటుగా ప్రభుత్వబడులలో కూడా విద్యను అందించినప్పుడే సంపూర్ణ అక్షరాస్యత వస్తుంది.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## అంధకారంలోకి ప్రజాస్వామ్యం

భారతదేశంలో ప్రజాస్వామ్యం అంధకారంలోకి వెళుతుంది. ప్రజలపై రాజకీయ శక్తుల అఘాయిత్యాలు అధికమై ప్రజలు స్వేచ్ఛగా స్వతంత్రంగా నివసించలేక తీవ్ర వేదనలకు గురవుతున్నారు. సామాన్యులపై రాజకీయశక్తుల ఆగడాలు అధికమై ప్రజాస్వామ్య రాజ్యంలో శాంతియుతంగా బతికే అవకాశం లేకుండాపోతుంది. దేశంలోని ప్రజలు శాంతియుతంగా, మతసామరస్యాలు లేకుండా స్వేచ్ఛగా బతికినాడే ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోవచ్చు.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## సామాన్య ప్రజలపై భారం తగ్గించాలి

జూలై 1, 2025 నుండి రైల్వే టికెట్ ధరలు పెంచనున్నట్టు రైల్వేశాఖ ప్రకటించినది. ప్రస్తుతం పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులధరలు పెరిగిన దృష్ట్యా, రైల్వే టికెట్ ధరల పెంపు సామాన్య ప్రజలకు ఆర్థిక భారం కలిగించే అవకాశం ఉంది. రైల్వేలు ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సాధారణ ప్రయాణికులపై భారం తగ్గించే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి జనరల్ టికెట్ల ధరలు గణనీయంగా పెరగకూడదు. తక్కువ ఆదాయ గల వర్గాలకు, వృద్ధులకు, విద్యార్థులకు, దివ్యాంగులకు కొనసాగుతున్న రాయితీలు యథావిధిగా ఉండాలి. పెరిగే ధరలకు తగ్గట్లుగా రైల్వే ప్రయాణదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉంది. రైల్వే స్టేషన్లలో శుభ్రత, కూర్చొనే స్థలాలు, తాగునీటి వసతి, లైటింగ్, సమాచార బోర్డులు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## విద్యావ్యవస్థల పట్ల చిన్నచూపు

యువతకు ఉద్యోగ, ఉపాధులు కల్పన చేయలేకపోతున్న ప్రభుత్వాలు తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు విద్యావ్యవస్థ పట్ల చిన్నచూపు చూస్తున్నాయి. విశ్వవిద్యాలయాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించడంలోను, కొరతపడ్డ ఆచార్యులు నియామకాల్లోను పూర్తిగా నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తున్నాయి. చాలా చింతించవలసిన విషయం ఇది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రేమను కొత్తగా ఒక కోర్సుగా ప్రవేశపెట్టి యువతతో, వారి బలహీనతలతో ఆడుకోనారంభించాయి. ఏది మంచో, ఏది చెడో గ్రహించజాలని అమాయకమైన యువత ముందు కల్పనలు సృష్టించి వారిని ఊహాప్రపంచంలో విహరింపచేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి.

-బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్

## ఆధిపత్యధోరణి పనికిరాదు

ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం కావొచ్చు. బలమైన ఆర్థిక వ్యవస్థలు అని చెప్పుకున్న దేశాలు తోక ముడిచాయి ఎందుకని ఉక్రెయిన్‌తో వారికి నిత్యావసరాల అవసరం ఉంది. ఈయుద్ధాలు ఇలాగే కొనసాగితేఆర్థిక మాంద్యాలు, ధరల పెరుగుదలలు, సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం అన్నింటికీ మించి మానవ హననం జరుగుతుంది. నేడు చిన్న దేశాలు పెద్ద దేశాలకు భయపడడంలేదు. ఇక ఎంత మాత్రం ఆధిపత్య ధోరణి పనికి రాదు.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మృత్యుపాశాలుగా మూఢనమ్మకాలు!

**కొందరు స్వార్థపరులు స్వామిజీల అవతారం ఎత్తి భూతవైద్యమనో, మరో పేరుతోనో మోసం చేయడమేకాక చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. అందరూ స్వామిజీలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. త్రికరణ శుద్ధిగా దైవాన్ని నమ్ముతూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వామిజీలు ఎందరో ఉన్నారు. కానీ ఈ నకిలీ స్వాముల సంఖ్య రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇది కూడా వ్యాపారంగా మారిపోయింది. దీనికి ఎలాంటి పెట్టుబడి అక్కరలేదు. కావల్సిందల్లా ప్రజలను నమ్మించడం, వారి విశ్వాసం, బలహీనతలే పెట్టుబడులు. ప్రజలనాడీని పట్టుకొని విశ్వాసం కలిగించగలిగితే కనకవర్షం కురిసినట్లే. దీనికి కనీసం అర్హతలు అంటూ ఏమీ లేవు. వయసుతో నిమిత్తం లేదు. రాత్రికిరాత్రే కషాయవస్త్రాలు ధరించి స్వామిజీలుగా, బాబాలుగా భూతవైద్యులుగా అవతారం ఎత్తవచ్చు. అందుకే ఎక్కడపడితే అక్కడ బాబాలు, స్వామీజీలు వెలుస్తున్నారు.**

దామెర్ల సాయిబాబ

అన్ని తెలిసిన వారు అమావాస్యరోజు చనిపోతే ఏమీ తెలియనివారు ఏకాదశిరోజు చనిపోయినట్లుగా ఉంది. ఒకపక్క సాంకేతిక పరిజ్ఞానంతో అంచనాలకు అందని అభివృద్ధితో పరుగులిడుతుంటే, మరొకపక్క సైన్స్, విజ్ఞానం రోజురోజుకు పురోభివృద్ధివైపు అడుగులిడుతుంటే ఇంకొకపక్క మూఢనమ్మకాలు సమాజాన్ని అతలాకుతలం చేస్తుండడం అత్యంత దురదృష్టకరం. అందులోనూ ఏమీ తెలియని అమాయకులు ఈ మూఢనమ్మకాలలో మునిగిపోతున్నారంటే కొంత అర్థం చేసుకోవచ్చు. కానీ అంతోఇంతో చదువుకున్న వారు లోకజ్ఞానం ఉన్నవారు నగరాలకు, పట్టణాలకు చేరువలో నివాసాలు ఉంటున్నవారు సైతం ఈ మూఢనమ్మకాలతో బజారుపాలవుతున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, వందల్లో కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఈ మూఢనమ్మకాలకు బలైపోతున్నాయి. ఎన్నో ఏళ్లుగా కూడబెట్టుకున్న బంగారం, డబ్బులే కాదు చివరకు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఎంతో మంది తమ కుటుంబ సభ్యులను తమ కళ్లముందే వైద్యం పేరుతో భూతవైద్యుడు మంత్రాల ప్రయోగాలతో పెట్టే చిత్రహింసలను చూస్తూ మనసు చంపుకొని ఏదో ఆశతో ఎదురుచూసి చివరకు తమ కళ్లముందే ప్రాణాలు వదిలిన తర్వాత కానీ అసలు విషయం వారికి బోధపడడం లేదు. కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోతున్నది. గతంలో నెల్లూరు జిల్లాలో ఒక భూతవైద్యుడు చేసిన ఘాతుకానికి చేతికి అందివచ్చిన ఇరవైఏదేళ్ల కన్నబిడ్డను కాటికి పంపారు. ఆ యువకుడు మానసికంగా కొన్ని ఇబ్బందులకు గురౌతుండటంతో దెయ్యం పట్టిందని ప్రచారం జరిగింది. దానికి ఎవరు సలహా ఇచ్చారోఏమోకానీ సమీపంలో ఉన్న భూతవైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లారు. దెయ్యం పట్టిన మాట వాస్తమేనని, దాన్ని వదిలిస్తానని తల్లిదండ్రులను నమ్మించాడు. ఆయన సూచన మేరకు ఇంట్లో పసుపు, కుంకుమ అన్ని చల్లి చుట్టుపక్కల వారిని పిలిచి అందరూ చూస్తుండగా ఆ యువకుని నోట్లో గుడ్డలు కుక్కి సైకిల్ చైన్‌తో గట్టిగా బిగించారు. పెనుగులాడుతున్న ఆ యువకుడిని కదలకుండా పట్టుకున్నారు. ఇరుగుపొరుగు యువకులను పిలిచి ఆ యువకుని శరీరంపై ఎక్కమని లేకపోతే దెయ్యం ఆయన శరీరం నుంచి బయటపడి గ్రామంపై పడుతుందని బలవంతం పెట్టారు. ఎంత బతిమిలాడినా ఆ యువకుడిని వదలలేదు. ఈ తతంగంతో ఆ యువకునిలో చలనం లేకుండాపోయింది. దెయ్యం వెళ్లిపోయిందంటూ ఆనందోత్సాహం వ్యక్తం చేశారు. ఈ అరుపులు విని గ్రామస్థులు వచ్చి ఆ యువకుడు చనిపోయాడని చెప్తే కానీవారికి తెలియలేదు. ఇరవైఏదేళ్లపాటు పెంచి పెద్ద చేసి చేతికి అందాల్సిన సమయంలో చేతులారా కళ్లముందే చంపుకున్న వాస్తవాన్ని ఇప్పటికీ వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలా ఎన్నో జరుగుతున్నాయి. ఇక ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామంటూ కొందరు బాబాలనండి, స్వామిజీలుఅనండి రకరకాల ప్రశ్నలకు జవాబులు అందిస్తుంటారు. ఇవికూడా ఎందరి ప్రాణాలకో ముప్పు తెస్తున్నాయి. మొన్న నెల్లూరు జిల్లాలోనే ఒకరి ఇంట్లో సెల్‌ఫోన్ పోయింది. ఆ సెల్‌ఫోన్ ఎవరు దొంగతనం చేశారన్న ప్రశ్నకు సమీపంలో ఉన్న మైనర్ గిరిజన బాలిక చేసిందని సమాధానం వచ్చింది. దాంతో ఆ బాలికను అత్యంత కిరాతకంగా కొట్టడమేకాక ముఖంమీద వీపులపై వాతలుపెట్టి చిత్రహింసలకు గురిచేశారు. ఆర్తనాదాలు విని ఇరుగుపొరుగు వారు పోలీసులకు

ఒక్క మాట

సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సమీప ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చావుబతుకుల మధ్యఉన్న ఆ బాలికను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆమె స్వయంగా ఆస్పత్రికి వెళ్లి బాలికను పరామర్శించి చికిత్స పూర్తి అయిన తర్వాత విపిఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో చేర్పించి బాగోగులన్నీ చూస్తామని హామీ ఇచ్చారు. ఆ మధ్య తిరుపతిలో ఒక ప్రొఫెసర్ తన కుమార్తెలను దేవుడు పిలుస్తున్నాడని బలవంతంగా బలి పీఠంపై ఎక్కించారు. ఇప్పటికీ వారు తిరిగి వస్తారని ఆయన నమ్ముతున్నాడు. రాయలసీమలోని ఒక జిల్లాలో నరబలులు ఇచ్చిన సంఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. తమ వ్యతిరేకులను మానసికంగా, శారీరకంగా ఇబ్బం ది పెట్టేందుకు కొందరు చేతబడి, బాణావతి, చిల్లంగి వంటి అనేక పేర్లతో క్షుద్రపూజలు చేయిస్తున్నారు. గ్రామాల్లో విష జ్వరాలు వ్యాపించినప్పుడు కూడా ఇలాంటి క్షుద్రపూజలు, జంతుబలులు, చివరకు నరబలులు కూడా ఇస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు కొందరు చేత బడులు చేయడం వల్లనే తమ కుటుంబాలకు, గ్రామాలకు నష్టం జరుగుతుం దనే అపోహతో దాడులు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఆరోపణల్లో జగిత్యాల్లోని ఒక కుటుంబమే బలైపోయింది. కొందరు బంగారం భూమి లో ఉందంటూ క్షుద్రపూజలు చేసి నరబలులు ఇస్తే నిధులు దక్కించుకోవచ్చన్న భ్రమతో అన్నెంపున్నెం ఎరుగని చిన్న పిల్లలను బలి ఇచ్చిన సంఘటనలు కూడా అక్కడక్కడ జరు గుతున్నాయి. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ మూఢనమ్మకాలు మృత్యు పాశాలు అవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బద్రాస్‌లో జరిగిన అత్యం త మానవీయ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ముక్కుపచ్చలారని బాలిక శరీర అవయవాలను ఆహారంగా భుజిస్తే సంతాన యోగం కలుగు తుందన్న ఒకే ఒక నమ్మకం ఓ ఏడేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, ఆపై పాశవికంగా హత్యచేసి, ఆమె శరీరంలోని గుండె, కాలేయం తదితర ముఖ్యమైన అవయవాలను వెలికితీసి వండు కొని భోంచేసిన సంఘటన చోటు చేసుకున్నది. పోలీసులకు సమాచారం అందడంతో డొంకలాగడంతో మొత్తంకథఅంతా బయటకు వచ్చింది. నిందితులను అరెస్టుచేశారు. ఇక మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలో పదకొండు మంది చిన్నారులను బలిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందనే భూతవైద్యుడి సలహా మేరకు ఆ జంట అత్యంత కిరాతకంగా మారి అభంశుభం తెలియని ఐదుగురు పసికందులను పొట్టన పెట్టుకున్నారు. ఆ తర్వాత పోలీసు దృష్టికి వెళ్లడం, వారికి సంకెళ్లువేయడంలో అది అక్కడికే ఆగిపోయింది. దేశవ్యాప్తంగా వెలుగు చూడని, పోలీసుల దృష్టికి వెళ్లని కేసులు ఎన్నోఉన్నాయి. జరగాల్సిన నష్టం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, న్యాయస్థానాల చుట్టూ తిరగలేక, కొత్త ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో పోలీసు స్టేషన్ మెట్లెక్కడానికి భయపడుతున్నారు. కొందరు స్వార్థపరులు స్వామిజీల అవతారం ఎత్తి భూతవైద్యమనో, మరో పేరుతోనో మోసం చేయడమేకాక చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. అందరూ స్వామిజీలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. త్రికరణ శుద్ధిగా దైవాన్ని నమ్ముతూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వామిజీలు ఎందరో ఉన్నారు. కానీ ఈ నకిలీ స్వాముల సంఖ్య రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇది కూడా వ్యాపారంగా మారిపోయింది. దీనికి ఎలాంటి పెట్టుబడి అక్కరలేదు. కావాల్సిందల్లా ప్రజలను నమ్మించడం, వారివిశ్వాసం, బలహీనతలే పెట్టుబడులు. ప్రజల నాడీని పట్టుకొని విశ్వాసం కలిగించగలిగితే కనకవర్షం కురిసినట్లే. దీనికి కనీసం అర్హతలు అంటూ ఏమీలేవు. వయసుతో నిమిత్తం లేదు. రాత్రికిరాత్రే కాషాయ వస్త్రాలు ధరించి స్వామిజీలుగా, బాబాలుగాభూత వైద్యులుగా అవతారం ఎత్తవచ్చు. అందుకే ఎక్కడపడితే అక్కడ బాబాలు, స్వామీజీలు వెలుస్తున్నారు. అలాంటివారు వికృత చేష్టలు అమాయకుల ప్రాణాలమీదకు తెస్తున్నాయి. ఇలాంటి నకిలీస్వాములు చేసే కార్యక్రమాలుముందు గానే పసిగట్టి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే పటిష్టమైన చట్టాన్నికూడా తీసుకురావాల్సిన అవసరంఉంది. బాధ్యతంతా ప్రభుత్వం మీదనే పెట్టకుండా స్వచ్ఛందసంస్థలు, ప్రజాసంఘాలు, వీటిని నిరోధించే యజ్ఞంలో పాలుపంచుకోవాలి. ●

# ఇంతకు ఐక్యరాజ్య సమితి ఏం చేస్తున్నట్లు?

కనుమ ఎల్లారెడ్డి

శాంతికి కృషి చేయాల్సిన ఐక్యరాజ్య సమితి దేశాలు ఈ విధంగా పెట్రేగిపోతుంటే ఏమి చేస్తుందో అర్థం కావడం లేదు. పశ్చిమ ఆసియాలో ఇప్పుడు పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతతో ఉన్నాయి. అమెరికా ప్రవేశించటంతో యుద్ధం వేడెక్కింది. ఇరాన్ ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. పైగా అమెరికాను బెదిరించే ధోరణి కనిపిస్తూ ఉంది. ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేని ఘాటుగా అమెరికాను హెచ్చరించడం తెలిసిందే. ఇరాన్ ప్రజల కోసం మేము వెరవం అని చెప్పడం చూస్తే మాతృ భూమి పట్ల అతనికి గల నిబద్ధత ఇరాన్‌కు ధైర్యాన్ని ఇచ్చే విధంగా ఉంది. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ అస్తవ్యస్తం అవుతోంది. ఇజ్రాయెల్‌ను దెబ్బ తీయాలన్న అక్కడ రష్యా భాష మాట్లాడే వాళ్ల మిక్కుటం అని పుతిన్ చెప్పడం, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరా ఘిచిని నివ్వెర పరచింది. అతను రష్యా నేత పుతిన్‌తో భేటీ కావడం, ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం జరగడం, అమెరికా దాడులు చేయడం పుతిన్‌కు చెప్పడంతో, పుతిన్ స్పందించి మేము ఇరాన్ వెంటే అని సంకేతాలు ఇచ్చారు. ఇంత జరుగుతున్నా నాయకులు ఒకరిని ఒకరు కలుస్తున్నా, దేశాలు కలవరపడుతున్నా శాంతిని కాంక్షించే ఐక్యరాజ్య సమితి ఏమి పట్టనట్లుగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇజ్రాయెల్ పై ఇరాన్ ప్రతీకారదాడులు చేయడం ప్రారంభించింది. ఒకప్రక్క ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడి, మరోవైపు ఇజ్రాయెల్ దాడితో ఇరాన్ రాజధాని టెహరాన్‌లో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ విధంగా దాడులు, ప్రతిదాడులతో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాలు ఉన్నాయి. ఇంత నష్టం జరుగుతున్న ఐక్యరాజ్య సమితి ఎందుకు మిన్న కుందో, అది ఏర్పడింది శాంతి కోసమే. దేశాలను, నాయకులను కట్టడి చేయకపోతే దాని లక్ష్యం నెరవేరదు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రధాని మోదీయే ఇది యుద్ధాలా యుగంకాదు అని అంటున్నారు. మిగతాయే దేశం, యే నాయకుడు కూడా ఇటువంటి శాంతిమాటలు అనడం లేదు. యుద్ధంకే ప్రాముఖ్యత ఇస్తున్నాయి. వాటికి శాంతి అనే మాటలు వినిపించడం లేదు. ఈదిశలోట్రంప్‌కు నోబుల్ బహుమతి ఇవ్వాలని పాక్‌చెప్పడం విడ్డురం. నోబుల్ బహుమతి అంటే శాంతికి కృషి చేయడం, అటువంటి కృషి



ట్రంప్ యే కోశానా చేయడం లేదు. పాలస్తీనా, లెబనాన్, సిరియా, ఇరాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ఇవ్వడం శాంతికి కాక అశాంతిని ప్రొదిచేసినట్లు అవుతుంది. పాక్ వెంటనే ట్రంప్‌కునోబుల్ బహుమతి ఇవ్వడం అనే మాట వదులుకోవాలి. ఇదే విషయాన్ని ఐక్యరాజ్య సమితి కూడా చెప్పాలి. దేశాలు శాంతిగా ఉండాలంటే ఆయా దేశాల మధ్య ఏవైనా సమస్యలుంటే చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. అందుకు సమితికృషి చేయాలి. నాయకులు సంయమనం పాటించాలి. ఇప్పుడున్న దేశ నాయకులు, ఒక్క భారత్ తప్పా అందరూ యుద్ధాన్ని కాంక్షిస్తూ ఉన్నారు. అందుకేనేమో పహెల్గాం దాడితో భారత్ పాక్‌ను తీవ్రంగా దెబ్బతీస్తే పాక్ ప్రాధేయపడటంతో భారత్ కరుణించి పాక్‌పై దాడులుఆపింది. లేకుంటే పాక్ తీవ్రనష్టం చవి చూడవలసి వచ్చేది. ఇంత జరిగినా కూడా బిలవల్ భుత్తో వైఖరిలో మార్పు రాలేదు. సింధు జలాలు ఆపితే రక్తం పారుతుంది అనే మాటలు మేకపోతు గాంభీర్యాన్ని సూచిస్తున్నాయి. ఇరాన్ సుప్రీం కమాండర్ కూడా బీరాలు పోతున్నట్లుగా అతని మాటలు ఉంటున్నాయి. అమెరికాకు శిక్ష విధిస్తాం, యుద్ధాన్ని మేముముగిస్తాం అనే మాటలు వాళ్ల ధోరణి తెలియపరుస్తోంది. నాయకులు కాని, దేశాలు కాని ఆచితూచి నడచుకోవాలి. యే దేశభద్రతదానికి ఉంటుంది. అయితే యుద్ధంలో అమెరికా దిగటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. అది ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ముందు శాంతి కోసం ప్రయత్నం చేసిఉంటే బాగుం డేది. అమెరికా చెప్పుచేతలలో ఉన్న ఐక్యరాజ్య సమితి అమెరికా, ఇజ్రాయెల్‌కు వంత పాడటంతోమౌనంగా ఉంది. ఐక్యరాజ్య సమితి ఎందుకు ఏర్పడిందో, దాని ఆశయం అది పూర్తిగా మరచిపోయినట్లు ఉంది. ఎప్పుడో పాతవిజయాలు విద్యార్థుల పాఠ్యపుస్తకాలో ఉన్నాయి. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి పని తీరు ఏమాత్రం సమంజసంగా లేదు. అదిఉండి ఏమి ప్రయోజనం? అంత మంది సిబ్బంది, దానికొక ప్రధాన కార్యదర్శి ఏమిచేస్తున్నారో అంతు బట్టడం లేదు. దేశాలు, నాయకులు హద్దుమీరి ప్రవర్తిస్తే వాటిని కట్టడిచేసేశక్తి ఐక్యరాజ్యసమితికి ఉండాలి. అంటే ఐక్య రాజ్య సమితి బలోపేతం కావాలి. సొంత నిధులుఉండాలి. ఏదేశ పెత్తనం ఐక్యరాజ్య సమితిపై ఉండరాదు. అదిఎప్పుడైతే సొంత నిర్ణయాలు తీసుకుంటుందో అప్పుడు యుద్ధాలే ఉండవు. నాయకులు కూడా చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటారు. ఐక్యరాజ్య సమితి కూడా పరిపుష్టం అవుతుంది. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు ప్రతిదేశం గౌరవించాలి. అప్పుడే విశ్వం శాంతితోఉంటుంది. దేశపౌరులు కూడా ఐక్యరాజ్యసమితిని కొనియాడతారు. ●

# ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయండి!

భాస్కర్ యలకంటి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరగా 2011లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేశారు. వారంతా ప్రస్తుతం ప్రమోషన్లు పొంది ఉన్నత హోదాలో ఉన్నారు. వీరంతా అప్పటి నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలోకి వచ్చినవారే కావడం గమనార్హం. అప్పటి నుండి ఇప్పటివరకు ఆ పోస్టులు మళ్లీ భర్తీకి నోచుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లందరూ ఇన్చార్జిలే కావడం గమనార్హం. అట్లే 612 మండలాలలో 90నుంచి 95 శాతం వరకు ఆయా మండలాలలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులుగా ఇన్చార్జ్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. వారంతా ఒకపక్క పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ అదనంగా మండల విద్యాశాఖ అధికారులుగా కొనసాగుతున్నారు. వీరే కాకుండా 33 జిల్లాలకుగాను 26 జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఇన్చార్జిలే ఉండడం వల్ల విద్యాశాఖలో పర్యవేక్షణ పడకేసిందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునికి మండల విద్యాధికారిగా ఇన్చార్జ్ బాధ్యతలను ఇవ్వడం వల్ల తన బడికి హెడ్మాస్టర్‌గానే కాకుండా తరగతి బోధకుడిగా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, పిఎం శ్రీ నోడల్ అధికారిగా ఇలా బహుళ పాత్రలను పోషించాల్సిన పరిస్థితి రావడంతో సొంత పాఠశాల పర్యవేక్షణ గాల్లో దీపంగా మారిపోయింది. పైపెచ్చు పెరిగిన పని ఒత్తిడి వల్ల బోధన చేయడం సాధ్యం కాకుండా పోతుంది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు తదితర అంశాలను పర్యవేక్షించే తీరికే లేకుండా పోతుంది. అలాగే ఒక జిల్లా విద్యాధికారి రెండు, మూడేసి జిల్లాలకు జిల్లా విద్యాధికారిగా కొనసాగుతుండడం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నామని, అలాగే తన మాతృ సంస్థలకు కూడా సరియైన న్యాయాన్ని చేకూర్చలేకపోతున్నామని చాలామంది ఇన్చార్జిలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లా విద్యాధికారుల కింద ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు కూడా ఇన్చార్జిలే కావడం గమనార్హం. ఇలా పర్యవేక్షణ అధికారులందరూ ఇన్చార్జిలుగా కొనసాగుతుండటం వల్ల వికేంద్రీకరణకు బదులుగా కేంద్రీ



కరణ ఎక్కువగా జరుగుతున్నదని, విద్యా వ్యవస్థకు మేలు కన్నా కీడే ఎక్కువ అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. గత విద్యాసంవత్సరం సుమారు 11 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కావడంతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులను కూడా చేపట్టడంతో కొంత మేర విద్యాబోధన గాడిలో పడి నట్లయింది. బోధనా నైపుణ్యాల పెంపు కోసం ఎస్సీఈఆర్టీ ఉపాధ్యాయులకు వేసవి సెలవులలోనే వృత్యంతర శిక్షణను సైతం అందించింది. అయితే కేవలం బోధనా నైపుణ్యాలను పెంచడం ద్వారా మాత్రమే సత్ఫలితాలను ఆశించలేమని నిరంతరం పటిష్ట పర్యవేక్షణ కూడా అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇన్చార్జి పర్యవేక్షణా ధికారుల ద్వారా అనుకున్న ఫలితాలు రాబట్టలేమని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొత్త నోటిఫికేషన్ ద్వారా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చునని వారు అభిప్రాయపడుతున్నారు. ఆ భర్తీ ప్రక్రియలో ఇప్పటికే క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉండి, బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు కొంత వెయిటేజ్ ఇవ్వడం బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టులను కూడా భర్తీ చేయడం ద్వారా విద్యావ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళనకు నోచుకునే అవకాశం ఉందని పలువురు విమర్శకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా పూర్తిస్థాయిలో పర్యవేక్షణపై దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఏర్పడుతుంది. మండల స్థాయిలో ఎంఈఓ పాత్ర పోషిస్తున్న సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల స్థానంలో రెగ్యులర్ ఎంఈఓల నియామకం ద్వారా మరింత పర్యవేక్షణను పెంచవచ్చునని, తద్వారా ఇప్పుడున్న ఇన్చార్జిల మీద పని భారం తగ్గుతుందని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని విద్యాశాఖకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులను కేటాయింపు చేయడం ద్వారా మౌలిక వసతులను కూడా కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు 30 శాతం బడ్జెట్లో కేటాయింపులు చేయాలి. కనీసం 20 శాతం అయినా కేటాయింపులు చేయడం ద్వారా విద్యా కమిషన్ సూచనలకు సార్థకత లభిస్తుంది. ఇటు నిధుల కేటాయింపు ద్వారా విద్యా వ్యవస్థ పరిపుష్టికి దారి తీయగా అటు ఖాళీల భర్తీ ద్వారా పర్యవేక్షణ అధికారుల నియామకం వల్ల పర్యవేక్షణ పటిష్టంగా నిర్వహించబడుతుంది. తద్వారా విద్యా వ్యవస్థ తప్పక గాడిన పడుతుందని ఆశించవచ్చు. ●


# సరిహద్దు ఉద్రిక్తతల కట్టడికి కొత్త ఫార్ములా

## 4 అంశాలతో రూపొందించిన భారత్
## రక్షణమంత్రి రాజ్‌నాథ్ చైనా రక్షణమంత్రితో భేటీ



**బీజింగ్,జూన్ 27:** భారత్–చైనాల సరిహద్దు ఉద్రిక్తతల సమస్యలు పరిష్కారం కోసం ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నాలుగు అంశాల ఫార్ములాను ప్రతిపాదించారు. 2024లో కుదిరిన బలగాల ఉపసంహారణకు కట్టుబడి ఉండటం, ఉద్రిక్తతలను తగ్గించేందుకు నిరంతర ప్రయత్నాలు, సరిహద్దుల గుర్తింపు నిర్ధారణ లక్ష్యాలను సాధించేందుకు చర్యలు విభేదాలను తొలగించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతంచేసే దిశగాప్రత్యేక ప్రతినిధుల వ్యవస్థను కొనసాగించడం వంటి నాలుగు అంశాలతో రాజ్‌నాథ్ ఈప్రణాళికను సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పాక్‌ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం అంశాన్ని కూడా రాజ్‌నాథ్ ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకే తాము ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టామని చైనా రక్షణమంత్రి మంత్రి డాంగ్‌జన్‌తో ఆయన చెప్పారు. తన భేటీకి సంబంధించిన చిత్రాలను ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టుచేసారు. చైనా రక్షణమంత్రితో జరిగిన సమావేశం ఫలప్రదం అయిందన్నారు. ఆరేళ్ల తర్వాత కైలాస మానస సరోవర యాత్రనుచైనా పునఃప్రారంభించడంపై ఆయన ఆనందం వ్యక్తంచేసారు. ఈ సందర్భంగా బీహార్‌ప్రత్యేక మదుబని పెయింటింగ్‌ను చైనా మంత్రికి రాజ్‌నాథ్ కానుకగా అందించారు. షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణమంత్రుల సదస్సులో పాల్గొనేందుకు రాజ్‌నాథ్‌చైనాలోపర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సు అనంతరం ఆయన మాట్లాడుతూ జాయింట్ డాక్యుమెంట్‌లో పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కరదాడులను మచ్చుకైనా ప్రస్తావించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఉమ్మడిప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించారు. దీనితో సంయుక్త ప్రకటన లేకుండానే చర్చలు ముగిసాయి. గత డిసెంబరులోనే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ బీజింగ్‌లో పర్యటించారు. అక్కడ ఉన్న భద్రతా సలహాదారు విదేశాంగమంత్రి ప్రత్యేకప్రతినిధి వాంగ్‌యీతో చర్చలు జరిపి సరిహద్దు సమస్య లపైనే ఎక్కువ ఫోకస్ పెంచారు. ఆ తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోడీ 2023అక్టోబరులో కజాన్‌లో జరిగిన సదస్సులో కలిసి చర్చలు జరిపారు.

దేశ్‌పాంగ్, డెమ్‌చోక్‌ల నుంచి బలగాల ఉపసంహారణకు అంగీకరించిన రెండురోజుల తర్వాతనే వీరి భేటీ అప్పట్లో జరి గింది. ఇదిలా ఉండగా చైనాలోని క్వింగ్డావ్ నగ రంలో జరిగిన షాంఘైసహకారసంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రుల సమావేశానికి హాజరయిన ఇతర దేశాలు ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, తజకిస్తాన్, భారత్‌లతో వేరువేరుగా చైనా రక్షణమంత్రి డాంగ్‌జంగ్ అంతర్జాతీయ భౌగోళిక, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపారు.



## మా విధుల్లో 80% ప్రాధాన్యేతర పనులకే
### లింక్డ్‌ఇన్‌లో సీనియర్ ఐఎఎస్ సుదీర్ఘ పోస్టు

**జైపూర్,జూన్ 27:** భారత పరిపాలనా వ్యవస్థలో కీలకమైన ఐఏఎస్ అధికారుల పనితీరుపై ఓ సీనియర్ అధికారి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఐఏఎస్ అధికారులు తమ పని సమయంలో 80శాతానికి పైగా తమ విభాగానికి ఏమాత్రం సంబంధం లేని పనులకే కేటాయించాల్సి వస్తోందని రాజస్థాన్ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజితాభ్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిపాలనా సంస్కృతిపై ఆయన చేసిన ఈ విమర్శలు బ్యూరోక్రసీలో అంతర్గత చర్చకు దారితీశాయి. రాజస్థాన్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన అజితాభ్ శర్మ, ఇటీవల ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తన లింక్డ్‌ఇన్ ఖాతాలో ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. "మా పనిలో 80 శాతానికి పైగా సమయం అన్ని శాఖల అధికారులు హాజరయ్యే సాధారణ సమావేశాలు, మానవ వనరుల సమస్యలు, కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు, పత్రికల్లో వచ్చిన వార్తలకు జవాబులు ఇవ్వడం, సాధారణ ఉత్తర ప్రత్యుత్తరాలు, వివిధ రకాల నివేదికలు తయారు చేయడానికే సరిపోతోంది. నేను దీనిని నాన్‌కోర్ వర్క్ (ప్రధానంకాని పని) అని పిలుస్తానని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పరిపాలనలో అన్ని పదవులు, బాధ్యతలు ఒకే రకమైన సవాళ్లతో కూడుకున్నవి అనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ఐఏఎస్‌లో అన్ని బాధ్యతలు ఒకే స్థాయిలో ఉంటాయన్న ఆలోచనతో నేను ఎప్పుడూ ఏకీభవించలేను. బహుశా మనం పనిచేసే పరిపాలనా సేవల సాధారణ స్వభావం వల్ల ఈ అభిప్రాయం ఏర్పడి ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. ఈ రకమైన ఆలోచనావిధానం వల్ల అధికారులు తమ శాఖాపరమైన లక్ష్యాలపై దృష్టి సారించలేకపోతున్నారని, కేవలం పరిపాలనాపరమైన లాంఛనాల్లో చిక్కుకుపోతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.



## కనీసం ముగ్గురిని కనాలి
### టెస్లా సిఇఒ ఎలాన్‌మస్క్ సందేశం

**వాషింగ్టన్,జూన్ 27:** పిల్లలను కనే అవకాశం ఉన్నవాళ్లు కనీసం ముగ్గురిని కనాలని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కోరారు. అమెరికాలో జననాలరేటు తగ్గుతుండటంపై మస్క్ ఆందోళన వ్యక్తంచేశారు. పలు కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు తగ్గుతున్నదని, దాన్ని నివారించాలంటే సంతానం కనగలిగిన వాళ్లు కనీసం ముగ్గురికి జన్మనివ్వాలని సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ప్రపంచదేశాల్లో తగ్గుతున్న జనాభా స్థాయిలను నిలబెట్టడానికి మహిళలు సగటున ముగ్గురు పిల్లలను కనాలని ఇటీవల ఫార్చ్యూన్ నివేదిక పేర్కొన్నది. దాన్ని ఉటంకిస్తూ మస్క్ తాజా పోస్టు చేశారు. ఈ నివేదిక ప్రకారం ధనిక దేశాలైన అమెరికా, ఇటలీ, జపాన్ తదితర దేశాల్లో జననాలరేటు ప్రతి ఏడాది తగ్గుతోందని, దాంతో జనాభా క్రమంగా పడిపోతోందని నిపుణులు పేర్కొన్నారు. దీనిని నివారించాలంటే సంతానం కనగలిగే మహిళలు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని సూచించారు. అమెరికా లాంటి దేశాల్లో జననాలరేటు తగ్గుతుండటం వల్ల వారి నాగరికత పతనమయ్యే ప్రమాదం ఉందని మస్క్ హెచ్చరించారు. తన మాటలను నమ్మకపోతే మరో 20ఏళ్లు వేచి చూడాలని రాసుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్న జనాభాపై ఐక్యరాజ్యసమితి జనాభా నిధి సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల యూఎన్ఎఫ్‌పీఏ విడుదలచేసిన నివేదిక ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తిరేట్లు క్రమంగా తగ్గుతున్నట్లు వెల్లడించింది.

## న్యాయవిద్యార్థినిపై అత్యాచారం కేసులో
# ముగ్గురు అరెస్టు, వీరిలో ఒకరు టిఎంసివిపి కార్యదర్శి

**కోల్‌కత్తా,జూన్ 27:** దక్షిణ కోల్‌కత్తా లాకళాశాల విద్యార్థిని అత్యాచారంకేసుకు సంబంధించి ఇప్పటివరకూ ముగ్గురిని అరెస్టుచేసినట్లు పోలీసులు వెల్లడించారు. కస్బాలో ఉన్న లాకళాశాల విద్యార్థినిని క్యాంపస్‌లోనే మూకుమ్మడి అత్యాచారం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 7.30 గంటలనుంచి 10.50 గంటలమధ్య ఈ అకృత్యం నడిచిందని అన్నారు. ఫిర్యాదుల ఆధారంగానే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసారు. వీరిలో ఒకరు లాకళాశాల మాజీ విద్యార్థి, మరో ఇద్దరు ఇదే సంస్థలో థర్డ్ సెమిస్టర్ చదువుతున్నవారు కావడం గమనార్హం. నిందితుల్లో ఇద్దరిని గురువారం సాయంత్రం అరెస్టుచేస్తే మూడో వ్యక్తిని అర్ధరాత్రివేళలో అరెస్టుచేసినట్లు చెప్పారు. పోలీసులు మనోజిత్ మిశ్రా(31) మొదటి ముద్దాయి అని తెలిపారు. జైబ్ అహ్మద్(19), ప్రమిత్ ముఖోపాధ్యయ్(20)లు మిగిలిన ఇద్దరు నిందితులని తెలిపారు. మిశ్రా టిఎంసి విద్యార్థి విభాగంలో కొనసాగుతున్నట్లు కూడా తేలింది. దీనితో ఈ సంఘటనకు రాజకీయ రంగు కూడా పులుముకుంది. దక్షిణ కోల్‌కత్తా జిల్లాకకు తృణమూల్‌విద్యార్థి విభాగం ఆర్గనైజేషనల్ కార్యదర్శి అని ఫేస్‌బుక్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నాడు. అంతేకాకుండా ఆలిపూర్‌కోర్టులో క్రిమినల్ లాయర్‌గా ప్రాక్టీసుచేస్తున్నట్లు తేలింది. టిఎంసిపి రాష్ట్ర అధ్యక్షుడు తృణంకూర్ భట్టాచార్య మాట్లాడుతూ ఎవరు మా విభాగంనుంచి ఈ సంఘటనలో ప్రమేయం ఉందని తేలినా మేం కఠిన చర్యలకు డిమాండ్‌చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఆరోపణలున్న వ్యక్తి మా విభాగంతో ఎలాంటి సంబంధంలేదని ఈ ఆరోపణలు నిజమైతే టిఎంసిపి నూరుశాతం న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు డిమాండ్ చేస్తుందన్నారు. బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ ఇది కేవలం నేరం మాత్రమే కాదని, విద్యాసంస్థల్లో టిఎంసి నేతల అవినీతి, అక్రమ కార్యకలాపాలు ఎలా ఉన్నాయో తెలియచేస్తోందన్నారు. ఇలాంటి అకృత్యాలను విద్యాసంస్థల్లోకి అనుమతించకూడదని సమాజానికి సిగ్గుచేటని అన్నారు. తృణమూల్ విద్యార్థి నాయకులు పదేపదే ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. అరెస్టు చేసిన ముగ్గురునీ ఆలిపోర్ కోర్టులో హాజరుపరిచారు. 14 రోజుల పోలీస్ కస్టడీకి కోరితే కోర్టు వారిని మంగళవారం వరకూ పోలీస్ కస్టడీకి ఆదేశించింది. కోల్‌కత్తా మేయర్ ఫిర్హాద్ హాకీమ్ మాట్లాడుతూ పోలీసులను సమగ్ర నివేదిక కోరామని ఆ తర్వాతే స్పందిస్తామని చెప్పా రు. ఏడాదిక్రితమే రాధాగోవింద్‌కర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో పిజిమెడికోపై అత్యాచారం జరిగిన సంఘటన తర్వాత మళ్లీ ఇలా లా విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైంది.



# వరదల్లో కొట్టుకుపోయిన ఐదు మృతదేహాలు వెలికితీత
## హిమాచల్‌లో కుంభవృష్టి, భారీగా వరదలు



**సిమ్లా,జూన్ 27:** హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్రా, కుల్లూ వ్యాలీల్లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయిన వ్యక్తుల ఆచూకీ గాలింపుచేస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఐదు మృతదేహాలను వెలికితీసాయి. ఉరుములు మెరుపులతోపాటు కుంభవృష్టి సంభవించడంతో కాంగ్రా, కుల్లు జిల్లాల్లో భారీ ఎత్తున ప్రవాహం కాలనీలను ముంచెత్తింది. హైడ్రోప్రాజెక్టుకు సైతం వరదలు సంభవించడంతో కొంత వరదనీటిని బయటికి వదిలివేయాల్సి వచ్చింది. ఇప్పటికీ ముగ్గురు ఆచూకీ తెలియాల్సి ఉంది. కుల్లుజిల్లాలోని రెహ్లా బిహాల్‌నుంచి మిస్ అయిన ముగ్గురు వ్యక్తుల ఆచూకీ కోసం విస్తృత గాలింపు జరుపుతున్నారు. ఛాంబాజిల్లాలో గాలింపు బృందాలు సమీపంలోని అటవీప్రాంతంనుంచి 13 మంది చిక్కుకున్నట్లు తేలింది. వారిలో ఐదుగురు కొండలవైపు పరుగులుతీసారు. మిగిలిన వారు వరదనీటిలో కొట్టుకునిపోయినట్లు తేలింది. వరదలు వస్తున్నాయని పెద్దగా అరుస్తూ ముందునుంచే ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని అందువల్లనే లోతట్టుప్రాంతాల వాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లగలిగారని దయా కృష్ణన్ అనే కార్మికుడు తెలిపాడు. ప్రాజెక్టువద్ద పనులను వరదల కారణంగా సస్పెండ్‌చేసారని అందువల్ల అందరం సురక్షిత ప్రాంతాలకువెళ్లిపోయామన్నారు. కొందరు తాత్కాలిక షెడ్లలోనే బసచేస్తున్నారని, మనుని ఖాద్ వంటి సమీప డ్రైన్లనుంచి వరదనీటిని వదిలివేసారని, ఈ నీటిలోనే కొందరు కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ బల్జీందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రాజెక్టుసైట్‌నుంచి కొట్టుకుపోయినవారి ఆచూకీకోసం చూస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే ధర్మశాల బిజెపి ఎమ్మెల్యే ఉధీర్‌శర్మ ఈ వరదప్రాంతాల వాసులకోసం షెల్టర్లను ఏర్పాటుచేసామని అందువల్ల ఎవ్వరూ కూడా పరుగులు తీసే అవసరం లేదని వెల్లడించారు.

# మహాకూటమి సిఎం అభ్యర్థిగా ఆర్జేడి అధినేత తేజస్వియాదవ్..
### తేల్చిచెప్పిన కాంగ్రెస్ నేత కన్హయ్యకుమార్



**న్యూఢిల్లీ,జూన్ 27:** మహాఘటబంధన్ నుంచి బీహార్‌ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వియాదవ్ ఉంటారని అందులో ఎలాంటి అనుమానం లేదని కాంగ్రెస్ నాయకుడు కన్హయ్యకుమార్ ప్రకటించారు. మా కూటమికి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసే సంఖ్యాపరమైన సీట్లు లభిస్తాయన్నారు. బిజెపికి ఛాన్స్ రాగానే ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను మార్చి తమ పార్టీ నేతను సీఎం కుర్చీలో కూర్చోబెడుతుందని అన్నారు. ముందు ప్రాంతీయ పార్టీ మద్దతు తీసుకుంటుందని, రానురాను ఆ పార్టీని తరిమేస్తుందని, ఇక రానున్న కాలంలో నితీష్‌కు, ఆయన పార్టీకి అదే గతిపడుతుందని హెచ్చరించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు అనివార్యమని, ప్రజలు మార్పు కోరుతున్నారని, ఖచ్చితంగా ఈ సారి మహా కూటమి గెలుస్తుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆపరేషన్ సింధూర్ అస్త్రంగా వాడినా ప్రజలు స్వాగతించరని, సింధూర్ ఒక దేశ భద్రతకు సంబంధించిన అంశమని, ఎన్ని కల్లో రాజకీయం చేయకూడదన్నారు. సీనియర్లనున నిర్లక్ష్యంచేస్తున్నారన్న విమర్శలపై కన్హయ్య కుమార్ స్పందిస్తూ ఒక కారునే తీసు కోండి క్లచ్ తోపాటు బ్రేక్, వెనుక అద్దం కూడా ముఖ్యమని అదిచోదక శక్తిఉన్నవాడే నాయ కుడవుతాడని అన్నారు. వికాస్‌సీల్ ఇన్‌సాన్‌పార్టీ మహాకూటమిలో భాగస్వామి అని ప్రతి ఒక్కరు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కూటమిలోని అన్ని పార్టీలో అసెంబ్లీలోని 243 సీట్లకు కూడా పోటీ చేయవచ్చని కాంగ్రెస్ పార్టీకూడా పోటీ చేస్తుందన్నారు. ఆర్జేడి, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, సహాని పార్టీ కూడా ఎన్నికల్లో పోటీచేస్తుందని స్పష్టంచేసారు. ఈపార్టీలన్నీ సమిష్టిగా 243 స్థానాల్లో ఉంటాయన్నారు. ఎవరికి భారీస్థాయి మెజార్టీ వస్తుందో రాష్ట్ర బాధ్యతలు వారికే వెళతాయని కుమార్ అన్నారు. ఆర్జేడి ఎక్కువస్థానాల్లో పోటీచేస్తుందని, ఎక్కువ సీట్లు గెలుస్తుందని, అందువల్ల సీఎం పదవి అడిగే హక్కు వారికి ఉంటుందని అందులో ఎలాంటి సందేహంలేదన్నారు. ఎటొచ్చీ ఎన్డీయేలోనే సందేహం వస్తోందని సీఎం అభ్యర్థిగా నితీష్ ఉంటారా లేక బిజెపి నాయకుడెవరైనా ఉంటారా అన్నది ఎన్డీయే తేల్చిచెప్పలేకపోతోందని విమర్శించారు. ప్రశాంత్‌కిశోర్ జనసురాజ్‌పార్టీపై మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పోటీచేసే హక్కు ఉంటుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు రానున్న అక్టోబరులో జరిగే అవకాశం ఉన్నందున బీహార్‌ప్రజలు ఈసారి మార్పును కోరుతున్నారన్నారు.

# విమానప్రమాద బాధితుల కోసం రూ.500 కోట్లతో ప్రత్యేక ట్రస్టు
## టాటాసన్స్ బోర్డు కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,జూన్ 27:** ఎయిరిండియా విమానం ఏఐ 171 ప్రమాద బాధితులను ఆదుకునేందుకు టాటా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఏకంగా రూ. 500 కోట్లతో ఒక ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని టాటా సన్స్ బోర్డు నిర్ణయించింది. అంతేగాక ఈ తీవ్రమైన సంక్షోభ సమయంలో ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాలను టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్లు ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొంది. ఈ ట్రస్ట్ ఏర్పాటుకు రూ. 500 కోట్లు కేటాయించాలని బోర్డును అనుమతి కోరారు. ఈ నిధులతో 271 బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించనున్నారు. దీంతో పాటు క్షతగాత్రుల వైద్య ఖర్చులు, ప్రమాదం జరిగిన సమీపంలో దెబ్బతిన్న మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, విమాన శకలాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చడం వంటి పనులను ఈ ట్రస్ట్ చేపట్టనుంది. మిగిలిన మూల నిధిని బాధిత కుటుంబాల దీర్ఘకాలిక అవసరాల కోసం వినియోగించాలని భావిస్తున్నారు. త్వరలోనే ఈ ట్రస్ట్‌ను అధికారికంగా రిజిస్టర్ చేసి, దేశ, విదేశాల్లోని బాధితుల కుటుంబాలకు నేరుగా సహాయం అందించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి టాటా మోటార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) పీబీ బాలాజీ నేతృత్వం వహిస్తారు.

ఈ విమాన దుర్ఘటనను టాటా యాజ మాన్యం అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు ఇది పెనుసవాలుగా మారడంతో ఛైర్మన్ చంద్రశేఖరన్ స్వయంగా రంగంలోకి దిగారు. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల భద్రత, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటి కీలక అంశాలను ఆయన నేరుగా పర్యవేక్షిస్తారు. తమ సంస్థలు కష్టాల్లో ఉన్నప్పుడు ఛైర్మన్లు స్వయంగా బాధ్యతలు తీసుకోవడం టాటా గ్రూపులో ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. 1989లో టాటా స్టీల్‌లో జరిగిన అగ్నిప్రమాదం సమ యంలో జేఆర్‌డీ టాటా, 26/11 తాజ్ హోట ల్‌పై ఉగ్రదాడి జరిగినప్పుడు రతన్ టాటా స్వయంగా వ్యవహారాలను పర్యవేక్షించారు. ఆ దాడి తర్వాత కూడా బాధితుల కోసం టాటా గ్రూప్ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, ఉద్యోగుల కుటుంబాలకు దీర్ఘకాలం పాటు అండగా నిలిచింది. ఇప్పుడు అదే స్ఫూర్తితో చంద్రశేఖరన్ ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు.



# పంజాబ్‌లో భారీ ఉగ్ర కుట్ర భగ్నం
## పోలీసుల ఆపరేషన్‌లో మైనర్ సహా ముగ్గురి అరెస్టు
### గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**చండీగఢ్, జూన్ 27:** పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రకు జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారం భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆట కట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్(బికెఐ)కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని పంజాబ్ డిజిపి గౌరవ్‌యాదవ్ తెలిపారు. అమృత్‌సర్‌లో లక్షిత హత్యలు, పోలీసుస్టేషన్ లపై దాడులకు ఈ టెర్రర్ మాడ్యూల్ ప్లాన్ చేసినట్లు చెప్పారు. 'ఇంటెలిజెన్స్ సమాచా రంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మాడ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యుకెకు చెందిన నిషాన్‌సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్టు హర్విందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బికెఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం' అన డిజిపి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రెండు హ్యాండ్ గ్రెనేడ్లు, ఒక పిస్తోలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డిజిపి చెప్పారు. పట్టుబడిన ఇద్దరిని అమృత్‌సర్ రూరల్‌కు చెందిన సెహజ్‌పాల్‌సింగ్, విక్రమ్‌జిత్ సింగ్‌గా గుర్తించామని, మరో జువైనల్ కూడా ఉన్నాడని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, పేలుడు పదార్థాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మోహాలి పోలీస్ స్టేషన్‌ను ఎఫ్ఐఆర్ నమోదైం దన్నారు. రాష్ట్రంలో టెర్రర్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసి, సంస్థాగత నేరాలను నిర్మూలించడం ద్వారా శాంతి, సామరస్య స్థాపనకు పంజాబ్ పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారని వివరించారు. దీనికి ముందు ఏప్రిల్‌లో పంజాబ్ పోలీసులు ఐఎస్ఐ సహకారం సహకారం ఉన్న ఖలిస్థాన్ టెర్రర్ మాడ్యూల్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు. రెండు రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌లు, రెండు హ్యాండ్ గ్రెనేడ్లు, ఐఇడిలు, ఆర్‌డిఎక్స్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## విద్యుత్‌సరఫరా లేదని ఫిర్యాదు చేస్తే చావబాదిన సెక్యూరిటీ సిబ్బంది



**గ్రేటర్‌నోయిడా,జూన్ 27:** విద్యుత్‌సరఫరా ఎందుకులేదని నిలదీసిన పాపానికి ఒక రెసిడెంట్‌కాలనీ వాసులను సెక్యూరిటీ గార్డులు, మెయింటెనెన్స్ సిబ్బంది లాఠీలతో చితక్కొట్టిన సంఘటన నోయిడా ఎకోవిలేజ్‌వన్ సొసైటీలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించిన విడియోలు వైరల్ కావడంతో పోలీసులు వెంటనే స్పందించి సెక్యూరిటీ గార్డులు, మెయింటెనెన్స్ సిబ్బందిలో నలుగురిని అరెస్టులు చేసారు. గంటలకొద్దీ హౌసింగ్‌కాలనీలో విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు నిరసన తెలిపారు. మెయింటెనెన్స్ స్టాఫ్‌వద్దకు ఫిర్యాదులు చేసేందుకువెళ్లారు. ఆ తర్వాత వారు సరైన వివరాలు ఇవ్వడకపోవడం ఆపై ఉభయులు వాగ్వాదాలకు దిగడం రానురాను ఇది మరింత తీవ్రతరం కావడంతో సెక్యూరిటీ గార్డులు, మెయింటెనెన్స్‌స్టాఫ్ జాయింట్‌గా కాలనీ వాసులపై దాడులకు దిగారు. వారి వద్ద ఉన్న కర్రలతో వారిని కొడుతూ వారిని తరిమికొట్టారు. అంతేకాకుండా కొందరు సిబ్బంది అయితే దొరికినవారిని దొరికినట్లుగా చితక కొట్టారు. కాలనీలో విద్యుత్ సరఫరా మూడు గంటలపాటు నిలిచిపోయింది. మెయింటెనెన్స్ సిబ్బంది మేంచేస్తున్న కాల్స్‌ను కూడా తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఫిర్యాదులుచేసారు. సెంట్రల్ నోయిడా డిసిపి శక్తిమోహన్ అవస్థి మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని నలుగురిని అరెస్టు చేసారని తెలిపారు. వారు రవీంద్ర, సోహిత్, సచిన్ కుంతాల్, విపిన్ కసానాలుగా గుర్తించినట్లు తెలిపారు.

## సిఎం కాన్వాయ్ కార్లలో డీజిల్‌కు బదులు నీళ్లు!



**భోపాల్, జూన్ 27:** రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని 19 కార్లు ఉన్నట్లుండి ఒకేసారి ఆగిపోయాయి. దీంతో గందరగోళం తలెత్తింది. అనుమానం వచ్చిన సిబ్బంది ఆ వాహనాల డీజిల్ ట్యాంక్‌లను తెరిచి చూడగా అందులో నీళ్లు ఉండటంతో వారంతా షాక్ అయ్యారు. డీజిల్‌లో నీళ్లు కలిపి ఏకంగా సిఎం కాన్వాయ్‌నే బురిడీ కొట్టించిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. రాట్లాంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ గురువారం రాత్రి రోడ్డు మార్గంలో బయల్దేరారు. మార్గమధ్యంలో దోసిగావ్ అనే ప్రాంతంలో ఉన్న శక్తి ఫ్యూయెల్ పెట్రోల్ పంప్ వద్ద సిఎం కాన్వాయ్‌లోని వాహనాలన్నింటికి సిబ్బంది డీజిల్ కొట్టించారు. ఆ తర్వాత కొద్ది దూరం ప్రయాణించగానే వాహనాలన్నీ ఒక్కొక్కటిగా ఆగిపోయాయి. ముందుకు కదలకుండా మొరాయించడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో సిబ్బంది తోసుకుంటూ వాటిని రోడ్డుపక్కకు తీసుకెళ్లారు. సిఎం కాన్వాయ్ ఆగిందన్న సమాచారం రాగానే స్థానిక యంత్రాంగం హుటాహుటిన అక్కడికి చేరుకుంది. వాహనాలు ఎందుకు బ్రేక్‌డౌన్ అయ్యాయని తెలుసుకునేందుకు వారంతా తీవ్రంగా శ్రమించారు. చివరకు డీజిల్ ట్యాంక్ తెరిచి చూడగా అందులో నీళ్లు కనిపించాయి. వాహనాల్లో నింపిన డీజిల్‌ను బయటకు తీయగా సగానికి సగం అందులో నీరు కలిపినట్లుగా ఉంది. డీజిల్‌ను కల్తీ చేసినట్లు గుర్తించిన అధికారులు వెంటనే ఆ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. ఆ బంక్‌లో డీజిల్ కొట్టించుకున్న ఇతర వాహనదారులు కూడా ఇదే విధమైన ఫిర్యాదులు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులు రంగంలోకి దిగారు. పెట్రోల్ పంప్‌ను తనిఖీ చేసి కల్తీని నిర్ధారించారు. ఆ బంక్‌ను సీజ్‌చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సిఎం ప్రయాణం కోసం ఇండోర్ నుంచి మరో వాహనశ్రేణిని తెప్పించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

## జగన్నాథ రథయాత్రలో భక్తులపైకి గజరాజులు..
### గుజరాత్‌లోని అమ్మాదాబాద్‌లో ఘటన!

**గాంధీనగర్, జూన్27:** దేశవ్యాప్తంగా జగన్నాధుడి ఆలయాల్లో రథయాత్రకు సంబంధించిన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గుజరాత్‌లోని అమ్మాదాబాద్‌లో ఓఆలయంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. రథయాత్రలో ఊరేగింపుగా వచ్చిన మూడు ఏనుగులు ఒక్కసారిగా అదుపుతప్పి భక్తుల పైకి దూసుకురావడంతో తోపులాట జరిగింది. ఏనుగులు తమ పైకి రావడంతో తీవ్ర భయాందోళనకు గురైన భక్తులు వాటి నుంచి తప్పించుకోవడానికి పరుగులు తీయడంతో ఆ ప్రాంతంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అయితే కొంతసే పటికి పరిస్థితిని అదుపుచేయడంతో రథయాత్రను తిరిగి కొనసాగించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల సమయంలో జగన్నాథ రథయాత్ర ఊరేగింపు అమ్మాదాబాద్‌లోని ఖాదియా ప్రాంతం గుండా వెళుతుండగా ఒక్కసారిగా ఏనుగులు అదుపు తప్పాయన్నారు. ఈ వేడుకల్లో ఎటువంటి అసాధారణ ఘటనలు జరగకుండా ఉండేందుకు నగరం అంతా దాదా పు 23,800 మంది భద్రతా సిబ్బందిని మోహా రించినట్లు అధికారులు పేర్కొన్నారు. 16 కిలో మీటర్ల మేర జరిగే రథయాత్రను వీక్షించేందుకు సుమారు 15లక్షల మందిభక్తులు పాల్గొనే అవ కాశం ఉన్నట్లు తెలిపారు.

## ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు



**న్యూఢిల్లీ,జూన్ 27:** దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ రోజు ఉదయం తీవ్ర కలకలం రేగింది. ఎయిర్ ఇండియా విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన ఓ బెదిరింపుతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమై విస్తృత తనిఖీలు చేపట్టగా, అది బూటకపు బెదిరింపని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఢిల్లీ విమానాశ్రయంలోని టెర్మినల్ 3 వద్ద ఉన్న ఎయిర్ ఇండియా విమానంలోని క్యాబిన్‌లో సిబ్బందికి ఓ టిష్యూ పేపర్ లభించింది. దానిపై ఎయిర్ ఇండియా 2948 లో బాంబు ఉందని రాసి ఉండటాన్ని గమనించిన సిబ్బంది, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ బెదిరింపు సందేశంతో విమానాశ్రయ భద్రతా అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీతో పాటు విమానంలోని ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంటల తరబడి సాగిన ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించలేదు. దీంతో ఇది ఎవరో ఆకతాయిలు చేసిన పనిగా అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, టిష్యూ పేపర్‌పై సందేశం రాసిందెవరనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

# తిరుమలలో హోటళ్ల అద్దెలు తగ్గింపునకు యోచన!

## -కాలపరిమితి ఐదేళ్లకు పెంచే దిశగా నిర్ణయం

**తిరుమల,జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు ప్రైవేట్ హోటళ్ళు నాణ్యమైన ఆహారం అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మార్పులు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తిరుమలలోని కొందరు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న హోటళ్ళు,ఫాస్ట్‌పుడ్ సెంటర్‌లలో సాంప్రదాయ వంటకాలు తయారుచేసి భక్తుకు అందించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలిచ్చారు. ఈ ఆహారపదార్థాలలో, భోజనంలో పూర్తిగా మార్పుతీసుకురావడంతో భక్తులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక హోటళ్ళలో పనిచేస్తున్న సిబ్బంది,కార్మికులు కూడా సాంప్రదాయదుస్తులు ధరించి భక్తులకు వడ్డిస్తున్నారు. తిరుమలేశుని దర్శనానికి దేశం నలుమూలల నుండి లక్షమంది భక్తులు వస్తున్నారు. వీరికి గతంలో చైనీస్‌పుడ్స్ వంటకాలు, ఉత్తరభారతదేశం వంటకాలు తయారుచేసి వడ్డించేవారు. దీనివల్ల చాలామంది భక్తులు అసహనం, అసంతృప్తి, అనారోగ్యకారణాలతో బాధపడేవారు. అంతేగాక నాణ్యత, రుచి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అందిన ఫిర్యాదులతో రెండువారాల క్రిందట అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తనదైన శైలిలో హోటళ్ళలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చైనీస్‌పుడ్స్ వంటకాలు, గోబీ, మంచూరియా, నూడిల్స్ నాసిరకంగా ఉండేవి. దీరితో ఆయన సంప్రదాయ వంటలను తయారుచేసి అందించాలని ఆదేశించడంతో హోటళ్ళ యాజమాన్యం పూర్తిగా హోటళ్ళ వంటశాలలను మార్పుచేశారు. శుచిగా ,శుభ్రంగా ఆదునీకరించారు. సాంప్రదాయ వంటలను భక్తులకు అందించడంతోబాటు వంటచేసే వ్యక్తులు కూడా డ్రెస్‌కోడ్ అమలుచేస్తున్నారు. ఈ నేపధ్యంలో తిరుమలలో హోటళ్ళ అద్దెలు తగ్గించడం వల్ల భక్తులకు మరింత తక్కువ ధరకు ఆహారపదార్థాలు అందించే వీలుకలుగుతుందని టిటిడి పాలకమండలి, అధికారులు నిర్ణయం. దీనిపై ఇప్పటికే చర్చించిన అధికారులు ఆ దిశగా యోచన చేస్తున్నారు. తిరుమలలోని పెద్ద హోటళ్ళు, ఫాస్ట్‌పుడ్‌సెంటర్‌లన్నీ పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నడుస్తున్నాయి. ఇవేగాక జనతాక్యాంటీన్ల పేరుతో టిటిడినే అద్దెకిచ్చి హోటళ్ళయాజమాన్యంతో నడుపుతోంది. ఈ జనతాక్యాంటీన్లలోనూ ధరలు అంతంతమాత్రంగానే ఉండటంతో భక్తులు అనేక ఫిర్యాదులు చేశారు. ఏడుకొండలస్వామి దర్శనానికి తమ మొక్కులు తీర్చుకుందామని వస్తున్న భక్తులకు ఒకటి,రెండురోజులు తిరుమలలో బసచేస్తే దేశంనలుమూలల నుండి వస్తున్న వారికి హోటళ్ళు భోజనం భారంగా మారింది. దీనికి అద్దెధరలు, టెండర్లు అధిక ధరలకు ఉండటమేనని తెలిసింది. ఇప్పుడు హోటళ్ళ నిర్వహణలో కొత్త విధానం తీసుకువచ్చి ప్రైవేట్‌సంస్థలు నిర్వహించే హోటళ్ళ అద్దెలను తగ్గిస్తే భక్తులకు కూడా నాణ్యమైన, సరసమైన ధరలకు ఆహారపదార్థాలు వడ్డించే వీలుకలుగుతుందని టిటిడి భావన. కొత్తగా టెండర్లు పిలిచే హోటళ్ళ కాలపరిమితి కూడా మూడేళ్ళనుండి ఐదేళ్ళకు పెంచింది. తాజాగా ఐదు చిన్నహోటళ్ళు, ఐదు పెద్దహోటళ్ళకు టెండర్లుపిలిచింది. టెండర్‌దారులు తప్పనిసరిగా హిందువులుగా ఉండాలని, హోటళ్ళరంగంలో ఐదుసంవత్సరాలు అనుభవం ఉన్నవారు ఉండాలని ఈ పది హోటళ్ళు భక్తులకోసం నిరంతరాయంగా నడపాలని కూడా టెండర్‌షెడ్యూల్‌లో పేర్కొంది. జులై 19వతేదీతో ముగిసే టెండర్‌ప్రక్రియ కొత్తగా ధరలు ఖరారుచేశారు. ప్రస్తుతం తిరుమలలో సామాన్యభక్తులకు అందుబాటులో ఉన్న సప్తగిరి హోటళ్ళ అద్దెను నెలకు 12.99లక్షలు రూపాయలు నుండి 9.75లక్షలకు తగ్గించింది. కౌస్తుభం హోటల్ అద్దె 16.20లక్షల రూపాయలు నుండి 12.15లక్షలరూపాయలకు తగ్గించారు. క్యాంటీన్‌కు 3.80లక్షలు రూపాయలు, పిఏసి హోటల్‌ను 3.10లక్షలుకు, హెచ్‌విసి హోటల్‌ను 2.50లక్షలు రూపాయలకు .

పిఏసి ఉత్తరంవైపు హోటల్‌కు 3.35లక్షలు రూపాయలు, ఎస్‌ఎంసి క్యాంటీన్‌కు 2.95లక్షలు రూపాయల అద్దెగా నిర్ణయించారు. టెండర్లు ప్రక్రియ పూర్తయిన తరువాత కొత్త అద్దెలు అమలుకానున్నాయి .టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, పాలకమండలి, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అద్దెల నిర్ణయంపై కూడా కూలంకుషంగా చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



సభలో మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో ఎంపీ మిథున్ రెడ్డి , డాక్టర్ శైలజనాథ్ తదితర నేతలు

# కూటమి ప్రభుత్వం కుట్రలతో ముందుకెళ్తోంది

**సింగారయ్య మృతి సంఘటనలో జడ్జికి ఇచ్చిన నివేదికలో ఎంత దారుణం**

**వైయస్ జగన్, వైసీపీని లేకుండా చేయాలని బాబు కుట్ర**

**ఏడాదికాలంలో వైయస్ జగన్ నామస్మరణ తప్ప చేసింది ఏమీ లేదు**

**వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**

**అనంతపురం, జూన్ 26, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో తరచూ వైఎస్ జగన్ నామస్మరణ చేయడం మినహా జనాలకు చేసిందేమీ లేదని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి కార్యకర్తలు జనం లోకి తీసుకెళ్లాలని, మీరిచ్చిన హామీలు ఇప్పుడు అమలు చేస్తారని ఎమ్మెల్యేలను నిలదీసేందుకు సిద్ధం కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైయస్ జగన్ ను, వైసిపి పార్టీని లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, చంద్రబాబు ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడే ప్రశ్నేలేదని, రాబోవు రోజుల్లో జైల్ బరోకు పిలుపు ఇవ్వాల్సి వస్తుందేమోనని , ఇందుకు కార్యకర్తల సిద్ధం కావాలని , వైసీపీ కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన వెల్లడించారు. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో శుక్రవారం వైసీపీ పార్టీ కార్యాలయాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగనమల నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ,మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ అధ్యక్షతన జరిగిన సభలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు అవినీతి అక్రమాల గురించి ఎంతో దర్యాప్తు చేసి మూడు, నాలుగు ఏళ్ల తర్వాత అరెస్టు చేస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కేసులు పెట్టి అరెస్టు చేయాలని చూస్తోంది. కూటమి ప్రభుత్వం కుట్రలతో పాలన కొనసాగిస్తూ వైసిపి కార్యకర్తలు ,నాయకులను ఇక్కట్ల కు గురిచేసే విధంగా కేసులను తిరగదుడుతూ భయపెట్టాలని చూస్తోందని ఆయన వెల్లడించారు. వైసీపీ అధినేత ,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎక్కడికెళ్లినా కూటమి ప్రభుత్వం పోలీస్ భద్రతనే తగ్గిస్తూ వస్తున్నారని ,జెడ్ ప్లస్ బందోబస్తు ఉన్న పేరుకే తయారవుతోంది అని, వైసీపీ కార్యకర్తలే రోప్ పార్టీలుగా మారి రక్షణగా నిలబడాల్సి వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్ జగన్మోహన్ రెడ్డి సత్తనపల్లి ప్రాంతానికి వెళ్తే పోలీస్ అధికారులు ఎన్ని నిర్బంధాలు పెట్టినా వైసీపీ కార్యకర్తలు, అభిమానులు వేరువేరు దారుల్లో ఉప్పెనలా కదిలి వచ్చారని, జగన్ ఎక్కడికి వెళ్ళినా జనం నుంచి స్పందన కనిపిస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనం రావడంలేదని, ఇటీవల గుంటూరు జిల్లా పర్యటన ఇందుకు నిదర్శనం అని సజ్జన రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్త సింగారయ్య మృతి కేసులో కూటమి ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోంది. ఈ కేసులో జడ్జికి ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే సింగారయ్య కారు కింద చనిపోయారని, ఏ 2 నుంచి ఏ 6 వరకు ఉన్న వ్యక్తులు కారుని ఇంకా స్పీడ్ గా పొమ్మని చెప్పినట్లు నివేదిక ఇచ్చారని, ఆ కేసులో ఏ 6 గా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారని, అడ్డగోలుగా కూటమి ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. ఎప్పుడో పాత కేసులను తిరగబడి రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పై ఇటీవల కేసు నమోదు చేశారని, మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి లాంటి ఎందరో నేతలు పైన, కార్యకర్తల పైన కేసులు నమోదు చేస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు,

ఇతర హామీలను అమలు చేయడం లేదని, వైయస్ జగన్ పాలనలో అమలు చేసిన పథకాలను గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం వైపల్లాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి తన ప్రసంగంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఎన్నికలకు ముందు కేకే లాంటి పలు సర్వే సంస్థలు చెప్పాయని, ఆ సర్వే సంస్థలే ఇప్పుడు ఏం చెబుతున్నాయంటే ఇప్పుడు ఎన్నికలు జరిగితే రాయలసీమ జిల్లాల్లో తెలుగుదేశానికి ఒక్క సీటు రాదని , రాష్ట్రంలో 75 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గెలిచే అవకాశాలు లేవని తేల్చేశాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజు దేవుణ్ని అయినా తలుచుకుంటాడో లేదో గాని వైయస్ జగన్ పేరు చెప్పని రోజే లేదన్నారు.

# మధుసూదన్‌కు వైద్య పరీక్షలు చేయించండి

**విజయవాడ జైలు సూపరింటెండెంట్‌కు హైకోర్టు ఆదేశం**

**విజయవాడ,జూన్27,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రూప్-1 మూల్యాంకనం అక్రమాల కేసులో రెండో నిందితుడు,క్యామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూధన్‌కు ప్రభుత్వ వైద్యులతో వైద్యపరీక్షలు నిర్వహించి ఆ నివేదికను తమకు సమర్పించాలని విజయవాడ జిల్లా జైలు సూపరింటెండెంట్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు ఆదేశించారు. బెయిలు పిటీషన్‌పై విచారణను జులై 16కు వాయిదా వేశారు. అంతకుముందు పిటీషనర్ తరపున సీనియర్ న్యాయవది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ ఆరోపణలన్నీ మొదటి నిందితుడు పీఎస్సార్ ఆంజనేయులుపై ఉన్నాయన్నారు. అనారోగ్యం కారణంగా ఆయన మధ్యంతర బెయిలుపై బయట ఉన్నారన్నారు. మధుసూదన్ గత 50 రోజులుగా జైల్లో ఉన్నారని,గాల్ బ్లాడర్,మూత్రపిండాల వ్యాధితో భాధపడుతున్నారని తెలిపారు. ఆయన అనారోగ్యంపై హైదరాబాద్ లోని ఆస్పత్రి వైద్యులు నివేదికలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి...మధుసూదన్‌కు వైద్యపరీక్షలు నిర్వహించాలని జిల్లా జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

# గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 69వ వారోత్సవాలు దక్షిణ మధ్య రైల్వేలో జరిగేనా? కార్మికుల్లో అసంతృప్తి

**గుంతకల్లు రైల్వే, జూన్ 27,ప్రభాతవార్త** రైల్వేలో పనిచేసే ప్రతిఒక్కరికి తమ డిఆర్ఎం చేతుల మీదుగా రైల్వే వీక్ అవార్డును అందుకోవాలనే అభిలాష,కోరిక ప్రతిఒక్కరిలో ఉంటుంది. రైల్వే వీక్ అవార్డులను డిఆర్ఎం ప్రతి ఏటా ఏప్రిల్ రెండో వారంలో ఘనంగా నిర్వహించే రైల్వే వారోత్సవ వేడుకల్లో రైల్వే శాఖ అంకిత భావంతో పనిచేస్తూ, రైల్వే డివిజన్ అభివృద్ధికి కృషి చేసిన తన సిబ్బందికి ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును డిఆర్ఎం అర్హులైన వారికి ఈ అవార్డును ప్రధానం చేయడం గత ఆరు దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు సంబంధించి 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 69వ వారోత్సవ వేడుకలు దక్షిణ మధ్య రైల్వేలో గుంతకల్లు డివిజన్ ఉండగానే జరుగుతాయా..?లేదా అనే సందేహాలను సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. భారతీయ రైల్వే ప్రతి ఏటా ఏప్రిల్ రెండో వారంలో డివిజనల్,జోనరల్,జాతీయ స్థాయిలో రైల్వే వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేది. ప్రతి ఏటా రైల్వే సిబ్బంది రైల్వేలో తమ తమ వృత్తి నైపుణ్యాన్ని, ప్రతిభా సామర్థ్యాలను కనబరిచి,ప్రదర్శించి రైల్వే అభివృద్ధికి కృషి చేసిన వారికి జాతీయ స్థాయిలో రైల్వే బోర్డు అవార్డులను రైల్వే మంత్రి,జోనల్ స్థాయిలో ఆయా జోన్‌లకు చెందిన జనరల్ మేనేజర్లు, డివిజన్ స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో డిఆర్ఎంలు అవార్డులను రైల్వే వారోత్సవాల సందర్భంగా ఘనంగా నిర్వహించి కార్మికులను అవార్డులతో సత్కరించేవారు. అల్పసంతోషులైన రైల్వే సిబ్బందికి జీవితంలో మరువలేని అదో తీపి మధురానుభూతి, ప్రాణాంతక కోవిడ్-19 అనంతరం కూడా 2022-23వరకు రైల్వే వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కానీ 2023-24కి గాను రైలే బోర్డు 69వ రైల్వే వారోత్సవ వేడుకలను గత ఏడాది డిసెంబరు 21న, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో జీఎం అవార్డులను గత ఏడాది డిసెంబరు 30న నిర్వహించినప్పటికీ, గుంతకల్లు డివిజన్‌కు సంబంధించి 2023-24కి గాను ఇంతవరకు 69వ రైల్వే వారోత్సవ వేడుకలు నిర్వహించలేదు. దీంతో కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇదిలా ఉండగా, కేంద్రప్రభుత్వం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై ఇప్పటికే జనరల్ మేనేజర్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఏ క్షణంలోనైనా గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల అయ్యే అవకాశం కూడా ఉండడంతో గుంతకల్లు రైల్వే డివిజన్, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఉన్నప్పుడే 69వ వారోత్సవ వేడుకలు నిర్వహిస్తుందా..?లేక దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పడ్డాక 2023-24, 2024-25సంవత్సరాలను కలిపి ఒకేసారి రైల్వే వారోత్సవ వేడుకలు నిర్వహిందా..అని కార్మిక లోకం చర్చించుకుంటుంది.

# నకిలీ ఇ స్టాంపులు కుంభకోణం కేసు కళ్యాణదుర్గానికి బదలీ

## పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

**కళ్యాణదుర్గం, జూన్ 27, ప్రభాతవార్త** కళ్యాణదుర్గంలో వెలుగుచూసిన నకిలీ ఈ స్టాంపుల వ్యవహారంపై తీగ లాగితే డొంక కదులుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ స్టాంపులు కుంభకోణం రాజకీయ దుమారం లేపటంతో పాటు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసును నమోదు చేసుకున్న అనంతపురం 2 టౌన్ పోలీసులు విచారిస్తున్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుటుంబానికి చెందిన ఎస్ఆర్సీ కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీసేవ నిర్వాహకుడు ఎర్రప్ప అలియాస్ బాబుతోపాటు అతని భార్య భార్గవి, మోహన్ అనంతపురం 2వ పట్టణ పోలీస్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని తొలుత అనంతపురం డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. గురువారం కేసును కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్ బదిలీ చేసి నిందితులను అక్కడికి తరలించారు. ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గం పోలీసులు ఆధ్వర్యంలో విచారణ వేగవంతం చేశారు.ఎర్రప్ప 2020 నుంచి ఇప్పటివరకు 13 వేలకు పైగా ఈ స్టాంప్లు జారీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎర్రప్ప, అతని భార్య భార్గవి, మోహన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. బ్యాంకు, ఇతర ఆర్థిక లావాదేవీలపై లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. గతంలో మీసేవలో పనిచేసిన వ్యక్తుల వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. కంబదూరు మండలానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి పోలీసులు విచారిస్తున్నారు. ఎర్రప్ప చేస్తున్న నకిలీ ఈస్టాంపుల వ్యవహారాన్ని తొలుత స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఎర్రప్ప జారీ చేసిన ఈస్టాంపులు, ప్రభుత్వానికి జమైన నగదును పోల్చి చూడగా తేడాలు ఉన్నట్లు తేలడంతో విచారణ చేపట్టారు. నకిలీ ఈ స్టాంప్ కుంభకోణం పై రాష్ట్ర రెవిన్యూ , రిజిస్ట్రేషన్ స్టాంపుల మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పందించారు. పోలీసుల అదుపులో ఉన్న ఈ స్టాంపుల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున ఎర్రెప్ప అలియాస్ మీసేవబాబును శని,ఆదివారాలలో పోలీసులు అధికారికంగా అరెస్టు చూపించి కేసువివరాలను వెల్లడించే అవకాశం ఉంది.స్టాంప్ ల టాంపరింగ్ కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు హెచ్చరించారు. కళ్యాణదుర్గం నకిలీ ఈ స్టాంపుల అవినీతిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులను శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది

# గండికోట చెరువులో పడి ముగ్గురు గిరిజన యువకులు మృతి

**జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:** బుట్టాయిగూడెం మండలం చింతల గూడెం పంచాయతీ పరిధిలోని గండికోట చెరువులో శుక్రవారం ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు.గల్లంతైన వారి మృతదేహాలను స్థానికులు వెలికి తీశారు.మృతులు అచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన మడి దేవేంద్ర కుమార్ (18), తెల్లం సీతారాములు (30), తెల్లం కిషోర్ (20) గా గుర్తించారు. అచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మడి సోమరాజు కుమారుడు దేవేంద్ర కుమార్ కూడా మృతుల్లో ఉన్నారు. దేవేంద్ర కుమార్ తో పాటు అతని స్నేహితులు ఇరువురు స్నానానికి దిగి మరణించినట్లుగా తెలిసింది. బుట్టాయిగూడెం ఎస్సై దుర్గ మహేశ్వర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.మృతుల కుటుంబాలను పోలవరం నియోజకవర్గ టిడిపి ఋూఇన్ఛార్జి రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరామర్శించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఆయన వెంట బుట్టాయిగూడెం మండల టిడిపి అధ్యక్షులు మెగపర్తి సోంబాబు తదితరులున్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ లో బి ఎఫ్3 పునఃప్రారంభం ఆనందంలో ఉక్కు యాజమాన్యం

**గాజువాక,జూన్ 27,ప్రభాతవార్త** గత 10 నెలలుగా మూతపడివున్న బ్లాస్ట్ ఫర్నేస్3 అన్నపూర్ణ పునః ప్రారంభం అయ్యింది. శుక్రవారం స్టీల్ జాయింట్ సెక్రెటరీ దయానిధాన్ పాండే,ఇంచార్జ్ సి ఎండి సక్సేనా లు పునఃప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్లు పాండే,సలీం,ప్రసాద్,ఉక్కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(వర్క్స్) మహంతి, బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాధిపతి,ఇతర ఉక్కు ఉన్నతాధికారులు,అధికారులు,యూనియన్ నాయకులు,విభాగం కార్మికులు పాల్గొన్నారు. ఒకవైపు ప్రయివేటీకరణ భయం...మరో వైపు ఆర్థిక సమస్యలతో ఉద్యోగులకు జీతాలు కూడా సమయానికి ఇవ్వలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రస్తుత పరిస్థితుల తట్టి చుస్తే భవిష్యత్తు ఆశాజనకంగా ఉండేలా కనిపిస్తోంది. బి ఎఫ్ 3 పునఃప్రారంభం వలన ఉత్పత్తి పెరిగే అవకాశం..ఇంతవరకూ ఉక్కులో బి ఎఫ్1, బి ఎఫ్2 ల ద్వారా మాత్రమే హాట్ మెటల్ ఉత్పత్తి అవుతోంది. అయినప్పటికీ కార్మిక నాయకుల సమాచారం మేరకు ఈ 2025 మార్చి నెలలో 18 కోట్లు,ఏప్రిల్ నెలలో 71 కోట్లు, మే నెలలో 50 కోట్ల మేర క్యాష్ ప్రాఫిట్ వచ్చిందని తెలుస్తోంది.బ్లాస్ట్ ఫర్నేస్3 అన్నపూర్ణ సంవత్సరానికి 2.3 మిలియన్ టన్నుల కెపాసిటీతో ఉత్పత్తి చేస్తుంది. అంటే రోజుకు సుమారు 7 నుంచి 8 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి అవుతుంది. కేవలం 2 బ్లాస్ట్ ఫర్నేస్ లతోనే గత 3 నెలలుగా లాభాల బాటలో పట్టిన విశాఖ ఉక్కు,ఇప్పుడు బ్లాస్ట్ ఫర్నేస్3 కూడా పునఃప్రారంభం కావడంతో 3 బ్లాస్ ఫర్నేస్ లు కలిపి రోజుకు సుమారు 21 నుంచి 24 వేల టన్నుల హాట్ మెటల్ ను ఉత్పత్తి చేయడం వలన ఎస్ ఎమ్ ఎస్ లో కూడా ఉక్కు ఉత్పత్తి పెరగడం,తద్వారా రోలింగ్ మిల్స్ కు అంతరాయం లేకుండా బ్లూమ్స్ అందించడం వలన ఫైనల్ ప్రోడక్ట్స్ కస్టమర్లకు నిరంతరాయంగా అందిచవచ్చని యాజమాన్యం భావిస్తోంది. తద్వారా ఉక్కు లాభాల బాట పట్టి గత వైభవాన్ని సంతరించుకుంటుందని అంటున్నారు.ఉద్యోగుల ఆశలు.....మరోవైపు నెలవారీ జీతాలు కూడా పూర్తిగా అందక అనేక అవస్థలు పడుతున్న ఉక్కు ఉద్యోగులు కూడా,ఇప్పుడు బిఎఫ్3 పునఃప్రారంభం వలన ఉక్కు లాభాల బాటలోకి వస్తే, జీతాల సమస్యలు తీరి...ఇంతవరకూ కోల్పోయిన ఆర్థిక ప్రయోజనాలను కూడా తిరిగి పొందవచ్చునని ఉక్కు ఉద్యోగులు ఆశతో వున్నారు.

## ఫ్యాక్టరీల్లో మొదటిసారి నిబంధనల ఉల్లంఘనకు జరిమానా

**విజయవాడ, జూన్ 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఫ్యాక్టరీల యాజమాన్యాలు మొదటిసారి చేసే చిన్న చిన్న ఉల్లంఘనలను జరిమానాతో పరిష్కరించేందుకు అనుమతిస్తూ కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. మొదటిసారి ఉల్లంఘనకే జరిమానా వర్తిస్తుంది. రెండో సారి ఉల ్లంఘనలకు పాల్పడితే న్యాయస్థానం లోనే పరిష్కరించుకోవాలి. ప్లానింగ్ అనుమతులు లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం, యంత్రాలు, పరికరాల బిగింపు,అనుమతులు లేకుండా ఫ్యాక్టరీని విస్తరించడం,అదనంగా యంత్రాలు,పరికరాల బిగింపు, అనుమతులు లేకుండా ఫ్యాక్టరీని విస్తరించడం,అదనంగా యంత్రాలు,పరికరాల బిగింపు,లైసెన్సు ను పునరుద్ధరించుకోక పోవడం, భద్రతా అధికారిని నియమించక పోవడం లాంటి 20 అంశాల్లో యాజమాన్యాలు మొదటిసారి పాల్పడే

ఉల్లంఘనలను జరిమానాతో పరిష్కరించు కోవచ్చు ప్రస్తుతం ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఉల్లంఘనలకు పాల్పడితే న్యాయస్థానంలో పరిష్కరించు కోవాల్సి వస్తోంది. దీంతో ఎక్కువ సమయం పట్టడం,మానవవనరుల ఖర్చు తదితర అంశాల దృష్ట్యా మొదటి సారి ఉల్లంఘనకు జరిమానా విధిస్తారు.

# ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో 60 సైకిళ్ల పంపిణీ

**విజయవాడ, జూన్ 27:** ఆధునిక యుగంలో మహిళల భద్రత కీలకంగా మారిందని, ఆన్‌లైన్ స్నేహాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ హెచ్చరించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో నగరంలో ఎన్ ఎసి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ సేవాభావం, మానవతా విలువలతో ముందుకు సాగుతున్న క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ పి. రేవతి , కార్యదర్శి డాక్టర్ డి. అరుణ అభినందనీయులన్నారు. వీరి నాయకత్వంలో విభిన్న ప్రజాపయోగ కార్యక్రమాలు నిర్వహించటం మదావహమన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైతే మహిళా కమిషన్ సాయాన్ని తీసుకోవటంలో వెనకడుగు వద్దని వివరించారు. సమాజిక మాధ్యమ వేదికల పరంగా చైతన్యంతో పాటు అప్రమత్తత కూడా అవసరమని సూచించారు. మహిళలు స్వయం సాధికారత సాధనతో పాటు విద్యలో అగ్రగామిగా ఉండేందుకు ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ సంక్షేమం కోసం చేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తి దాయకమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ రేవతి మాట్లాడుతూ వరద బాధితులకు బట్టలు, వస్తువులు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు,అనాథలకు అన్నదానం,ఉపాధికి కుట్టు యంత్రాలు, ల్యాప్ టాఫ్ లు, ఉపకార వేతనాలు, పర్యావరణానికి మొక్కలు ఇలా గత ఒక సంవత్సరం కాలంలో సేవా కార్యక్రమాల కోసం సుమారు ఒక కోటి రూపాయలు వ్యయం చేసామన్నారు. ఇది క్లబ్ యొక్క నిస్వార్థమైన అంకితభావానికి ప్రతీకగా అభివర్ణించారు. సభ్యుల సహకారం వల్లే ఈ స్థాయిలో సేవలందించగలిగామని, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మందికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఛైర్ పర్సన్ రంజన, లీల, ఇన్నర్ వీల్ సభ్యులు లక్ష్మి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# దుర్గమ్మకు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆషాఢసారె

**ఇంద్రకీలాద్రి, జూన్ 27, పభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆషాడమాసం రెండవరోజు శుక్రవారం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో వి సుబ్బారావు దంపతులు తొలి సారె అందించారు. వీరిని వేదమంత్రాల నడుమ ఆలయ ఈవో వికె శీనా నాయక్ స్వాగతించారు. సారె సమర్పణ అనంతరం వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందించారు. కనకదుర్గమ్మకు సారె సమర్పించే భక్త బృందాలవారు 1800425 9099 నెంబర్ ద్వారా ముందస్తుగా తమ వివరాలు తెలిపి నమోదు చేసుకోవాలని వివరించారు.

– ఇంద్రకీలాద్రిపై కెనరాబ్యాంక్ మొబైల్ ఏటిఎం సేవలు :

ఇకపై ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కెనరా బ్యాంక్ మొబైల్ ఎ ట ి ఎ ఎ ౦ సేవలందించనున్నది. శుక్రవారం ఆలయ ఈవో వికె శీనా నాయక్ ఈ మొబైల్ ఏటిఎమ్‌ను ప్రారంభించారు.

– మౌలిక వసతుల పరిశీలన :



సారె సమర్పణకు వచ్చిన అన్నవరం ఈవో దంపతులను స్వాగతిస్తున్న దృశ్యం



ఆషాడం సారె అందుకుంటున్న అమ్మవారు, భక్తులు, సారె

ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న వసతులు పారిశుధ్యం తాగునీరు ప్రసాదం తయారీ అన్నదాన కేంద్రం తీరుతెన్నులు దేవదాయ శాఖ అదనపు కమీషనర్ మౌలిక వసతుల నోడల్ అధికారి టి.చంద్రకుమార్ పరిశీలన చేశారు. దర్శనానంతరం భక్తులు సేదతీరే రాజగోపురం ముంగిట్లో పారిశుధ్యం ఏర్పాట్లను, నూతనపూజ మండపాలు యాగశాల ప్రాంగణాలు ఆలయ ఈవోతో కలిసి పరిశీలించారు. ఆ క్రమంలోనే భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న ఉచిత రవాణా వ్యవస్థ నూరుశాతం భక్తులకు వినియోగింపబడాలని, దేవస్థానం బస్సులు, వృద్దుల వికలాంగుల వాహనాల వద్ద తీవ్ర రద్దీని పరిశీలించి, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. వృద్దుల కోసం యేర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలు, వ్యాన్‌లు రాకపోకల గురించి సూచనలు చేశారు. అనంతరం దుర్గాఘాట్‌లో పారిశుధ్య పరిస్థితులు గమనించి తగు ఆదేశాలు జారీ చేశారు.

– దుర్గా ఘాట్‌లో హాకర్ల నియంత్రణ :

దుర్గాఘాట్‌లో భక్తులకు అసౌకర్యంగా హాకర్స్ ఆక్రమణతో అస్తవ్యస్తంగా ఉండడంతో పలుమార్లు గమనించిన ఈవో వికె శీనా నాయక్ ఆదేశాల మేరకు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ రంగారావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు, లీజుల అధికారులు ఘాట్‌లో ఎంతమందికి పర్మిషన్ ఉన్నది, విరుద్దంగా చేతులు మారిన పర్మిషన్స్ విచారణ చేశారు. విస్తీర్ణంతో సంబంధం లేకుండా అంగబలం అర్థబలం కలిగిన వారు ఎక్కువ ప్రదేశం ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఎక్కువ మొత్తంలో అద్దె బకాయి ఉన్నవారికి ఈ నెల 30లోపు అద్దె బకాయిలు చెల్లించాలని జులై 1 నుండి ప్రతి షాప్‌ను నిర్దిష్టమైన కొలతలతో నెంబర్ కేటాయించాలని బకాయిలు చెల్లించని షాపులు వేరొకరికి కేటాయించబడతాయని తెలిపారు.

# విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు మూడు సంస్థలతో ఆర్జీయూకేటీ ఒప్పందం

**విజయవాడ,జూన్ 27,ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమలు,అకడమిక్ భాగస్వామ్యం,విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం,సాంకేతిక విద్యలో అమ్మాయిల ప్రాధాన్యం మరింత పెంచేందుకు రాజీవ్‌గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)గురువారం మూడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆర్జీయూకేటీ కులపతి మధుమూర్తి అధ్వర్యంలో ఆయా సంస్థలతో ఈ ఒప్పందాలు జరిగాయి. కృత్రిమ మేథలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు 'సెరిమోర్ఫిక్' సంస్థతో ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా పరిశ్రమలు,అకడమిక్ భాగస్వామ్యం,పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం చేస్తారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు 'వాద్వాని ఫౌండేషన్'తో ఒప్పందం కుదిరింది. ఇందులో విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేసేందుకు అధ్యాపకలులకు శిక్షణ ఇస్తారు. ఉన్నతవిద్యలో బాలికలకు ప్రాధాన్యం మరింత పెంచేందుకు గేట్ శిక్షణ ఇచ్చేందుకు 'సదిశా ఫౌండేషన్'తో ఒప్పందం కుదిరింది.

# గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ సేవలు అందించడం అదృష్టం..ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్



**శంఖవరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవా రంగ సంస్థలైన బ్యాంకు సేవలు అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పండు ప్రతాప్ అన్నారు. మండల కేంద్రం శంఖవరంలో గల భారతీయ స్టేట్ బ్యాంక్ లో మూడేళ్లుగా ప్రజలకు విస్తృత సేవలు అందించిన అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ బదిలీ కావడంతో బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు శుక్రవారం సాయంత్రం ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా సింధు ఇండేన్ గ్యాస్ అధినేత కాపారపు రాజబాబు హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకులలో సేవలందించడం అనేది కత్తి మీద సాము లాంటిదని, నిరక్షరాస్యులు అధికంగా ఉండే ప్రాంతాలకు ఉండడంతో బ్యాంకు సిబ్బంది సేవా స్ఫూర్తి అలవర్చుకుని, సహనం, ఓర్పుతో సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఇటువంటి లక్షణాలను కలిగిన వ్యక్తి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పండు ప్రతాప్ అని, అందువల్లే ప్రతాప్ బదిలీ సిబ్బందిని, ఖాతాదారులను కలచి వేస్తుందన్నారు. సిబ్బంది వ్యవహార శైలిని బట్టే ఖాతాదారులు సంతృప్తి చెంది, బ్యాంకులు ఆర్థిక ప్రగతి సాధిస్తాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ ప్రసంగించారు అనంతరం బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, గ్రామస్తులు ప్రతాప్ కు దుస్సాలువాలు కప్పి, ఘనంగా సత్కరించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్యాషియర్లు సుర్ల గౌతమ్, కచ్చాల కొండబాబు, అకౌంటెంట్ కుమార్, గోల్డ్ అప్రైజర్ కాశీ భాస్కరరావు, సిబ్బంది వెంకటలక్ష్మి, జిలానీ, బిసి పాయింట్లు ఇన్చార్జ్ లు తిమ్మిశెట్టి గంగాధర్, బొర్రా నాగేంద్ర, గ్రామస్తులు నాని, షేక్ నూకరాజు, పర్వత రామకృష్ణ, రేలంగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన ట్రస్ట్ కు విరాళం




**ఆత్రేయపురం , జూన్ 27 , ( ప్రభాతవార్త )**

బదిలీల స్వామిగా ప్రసిద్ధి చెందిన స్వయంభు క్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి ఆలయానికి భక్తులు పోటే త్తారు. వివిధ జిల్లాలనుండి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్ని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ర్యాలి గ్రామానికి చెందిన విస్సాప్రగడ విశ్వేశ్వరావు సీతామహాలక్ష్మి దంపతులు శ్రీ స్వామి వారి అన్నదాన పథకానికి రూ. 5,116వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి శ్రీ స్వామి వారి చిత్రపటం,ప్రసాదాలు అందజేశారు.

# ఉద్యోగులు కష్టపడి పనిచేసి లక్ష్యాలు సాధించాలి

**మామిడికుదురు , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**



ఉద్యోగులు కస్టపడి పనిచేసి తమకు ఇచ్చిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసి మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఎంపీడివో జి.భవాని సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.గ్రామాల వారీగా పలు శాఖల పనితీరుపై పరిశీలన చేశారు.విధి నిర్వహణలో ప్రతీ ఉద్యోగి అలసత్వం వహించకుండా పనిచేసి ప్రతీ అంశంలో ముందుకు వెళ్ళాలన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ ద్రుష్టికి తీసుకు రావాలని వాటిని పరిష్కరిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.ఈ సమావేశంలో తహాశీల్దార్ పి.సునీల్ కుమార్,వ్యవసాయాధికారి ఎన్ వి వి సత్యనారాయణ,ఈవోపి ఆర్డి అడబాల శ్రీనివాసరావు,మండల పరిపాలన అధికారి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను గెయిల్ అమలు చేయాలి



**మామిడికుదురు , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**

నగరం గ్రామంలో విస్పోటనం జరిగి 22 మంది ప్రాణాలు కోల్పోయిన సందర్బంగా ఆసమయంలో గెయిల్ ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని లేని పక్షంలో అవసరమైతే పోరాటం చేసేందుకు సైతం సిద్ధమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు.నగరం గ్రామంలో ఈసంఘటన జరిగి 11 సంవత్సరాలు అయిన సందర్బంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పైప్లైన్ పేలుడులో మృతి చెందిన 22మంది పేరిట ఏర్పాటు చేసిన పైలాన్ ను ఆవిష్కరించారు. మృతుల చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆనాడు గెయిల్ ఇచ్చిన హామీల్లో 11హామీలు అమలుకు నోచుకోలేదని వాటిని సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అప్పటికీ న్యాయం జరగని పక్షంలో బాదితుల తరపున పోరాటం చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా,బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ,సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, జనసేన, టీడీపీ, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు జాలెం శ్రీనివాస రాజు,బోనం బాబు,బైరిశెట్టి రామకృష్ణ,జాలెం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన బత్తుల

**సీతానగరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**



మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శుక్రవారం అందజేశారు. మండలంలోని బొబ్బిల్లంక గ్రామానికి చెందిన ఏలేటి సాంబశివరావుకు రూ. 15,000. మునికూడలి గ్రామానికి చెందిన పట్టుచీర్ల అరుణ కుమారికి రూ. 26,218. ముగ్గళ్ల గ్రామానికి చెందిన రేలంగి మంగతాయారుకు రూ. 18,000. అదే గ్రామానికి చెందిన నిడదవోలు సుబ్బారావుకు రూ. 60,600. సీతానగరం గ్రామానికి చెందిన ఎన్.మానసకు రూ. 47,480. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యనమందల వినాయక కృష్ణకు రూ. 30,000. విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బత్తుల వెంకటలక్ష్మి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారిచర్ల విజయ శంకర్, మట్ట వెంకటేశ్వరరావు, గెద్దాడ త్రిమూర్తులు, దాసరి రమేష్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకన్న స్వామి మొక్కుబడి కళ్యాణం



**అంబాజీపేట , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**

అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మొక్కుబడి కళ్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కొర్లపాటివారిపాలెంనకు చెందిన మేడిది సూర్య ప్రకాశరావు-సువర్ణ సుందరి దంపతుల అల్లుడు మోపూరి శ్రీనివాస్- ఉమామహేశ్వరి దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు.బాజా భజంత్రీలు,మంగళ వాయిద్యాలు నడుమ స్వామి దేవేరుల ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి,స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. స్వామి వారి మొక్కుబడి కళ్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులకు తాంబూలాలు అందజేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు మాట్లాడుతూ స్వామివారి మొక్కుబడి కళ్యాణాన్ని నిర్వహించుకునే శ్రీవారి భక్తులు ముందుగా ఆలయ కమిటీ, ఆలయ అర్చకులను సంప్రదించాలన్నారు. శ్రీవారి కల్యాణ మహోత్సవంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావు తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో , జూన్ 27 , ( ప్రభాతవార్త )**



షెడ్యూల్ కులాలు, తెగల వారిపై అన్యాయంగా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు 2025 లో రెండో త్రైమా సానికి సంబంధించి కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి పౌర హక్కుల రక్షణ ఎస్సీ ఎస్టీ దురాగ తాల నివారణ చట్టం అమలుపై ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు,తెగల అట్రాసిటీ కింద నమోదైన కేసులు సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయా లన్నారు. కేసుల సత్వర విచారణకు అవస రమైన ధ్రువ పత్రాలు ఎప్పటిక ప్పుడు జారీ చేయాలన్నా రు. నిజమైన బాధితుల కు న్యాయం జరిగిన ప్పుడే చట్టం యొక్క ఉద్దేశం నెరవేరుతుంద న్నారు. ఎస్సి, ఎస్టి వర్గాల హక్కులు, రక్షణ కొరకు ఏర్పాటైన చట్టాల పటిష్ట అమలుకు పోలీస్, న్యా య, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచే యాలని కోరారు.గత సమావేశపు తీర్మానాలపై తీసుకున్న చర్యలను సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి వివరిం చారు ఈ త్రైమాస కాలంలో ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసుల విచారణ, బాధితులకు పరిహారాల పంపిణీ పురోగతిని సమీక్షించి పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా ఏర్పాటు కాబడిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక చట్టాల ను అధికారులు పటిష్టం గా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు బాధితులకు పరిహారం ఉపాధి కల్పన విషయం లో జాప్యం జరగకుండా పటిష్టంగా అమలు చే యాలన్నారు. శాంతియు తమైన సామరస్యమైన పౌరజీవనాన్ని పెంపొందిం చేందుకు ఈ చట్టాల గురించి అన్ని వర్గాల ప్రజలకు సమగ్రమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి ఆర్థిక సామాజిక రంగాలలో సమాన అవకాశాలను పొందేందుకు సామాజిక న్యాయం అందించేందుకు అగ్రవర్ణాల అత్యాచారా ల నుండి రక్షణ పొందేం దుకు ఈ చట్టం రూపొం దించబడిందన్నారు .షెడ్యూల్డ్ కులాలు తెగల అట్రాసిటీ కింద నమోదైన కేసులు సత్వరమే పరి ష్కరించి తగు న్యాయం చేకూర్చే దిశగా రెవెన్యూ పోలీస్ న్యాయవ్యవస్థ లు కృషి చేయాలన్నారు. అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయా లపై రాజ్యాంగ విలువల ను కాపాడేందుకు కమిటీ సభ్యులు అంకిత భావంతో పనిచేయాల న్నారు అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటుచేసు కోకుండా సామాజిక రుగ్మతలను అరికట్టాల న్నారు జిల్లావ్యాప్తంగా మొత్తం 66 కేసులు నమోదు కాగా, వీటిలో 47 కేసులు ప్రాథమిక విచారణ దశలో, 20 కేసులుచార్జి సీటుదశలో ఉన్నాయన్నారు బాధితులకు రూ 41 లక్షల 25 వేలు పరిహారాలుగా చెల్లించాల్సిందని ప్రభుత్వం నుండి మంజూరు వచ్చిన వెంటనే అందించడం జరుగుతుందన్నారు పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా ఏర్పాటు కాబడిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎస్సి, ఎస్టి అట్రా సిటి కేసుల విచారణ వేగ వంతం చేసి బాధితులకు సత్వర న్యాయం, పరిహారాలను అందించాలన్నా రు. దోషులకు తప్పనిసరి గా శిక్ష పడాలని, అలాగే ప్రేరేపిత కేసులతో చట్టం దురుపయోగం కాకుండా చూడాలన్నారు. లక్షిత వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, అదే స్ఫూర్తి తో విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ప్రయోజన కరమైన, నిర్మాణాత్మకమైన సూచనలు, సమీక్షలతో ఎస్సి, ఎస్టి వర్గాల రక్షణ, హక్కుల పరిరక్షణ కొరకు పనిచేయాలన్నారు. ఎస్సి, ఎస్టి కేసుల ఇన్వెస్టిగేషన్ ప్రగతి, విచారణ, కోర్టు కేసులలో కన్విక్షన్, బాధితులకు పరిహారం అంశాలపై పోలీస్, రెవెన్యూఅధికా రులతో చర్చించారు ఎస్సీ ఎస్టీ వర్గాల సంక్షేమ%శీ% జీవనోపాదులు మెరు గుదలకు అంకితభావంతో దామాషా ప్రకారం నిధు లు కేటాయిస్తూ అభ్యున్న తికి కృషి చేయాలని డి ఆర్ డి ఏ ఉన్నతి ద్వారా యూనిట్లు గ్రౌండ్ చేయా లని ఆర్డబ్ల్యూఎస్ ఆరో ప్లాంట్లు నిర్వహణ జేజే యం ద్వారా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని పంచాయతీరాజ్ ఎస్సీ ఎస్టీ కాలనీలలో అంత ర్గత, రోడ్లు గృహ నిర్మాణ సంస్థ గృహాలు మంజూ రు, ఉపాధి హామీ ద్వారా వేతన జీవులకు పనుల కల్పించాలని జీవనజ్యోతి ద్వారా ఎస్సీ ఎస్టీలకు విద్యుత్ రాయితీలను అందించాలని పరిశ్రమల కేంద్రం ద్వారా రాయితీ లతో యూనిట్లు మం జూరు చేయాలని ఆదేశించారు. లక్షిత వర్గాల సంక్షేమానికై వసతి గృహాలలో గెయిల్ సిఎస్ఆర్ నిధులతో కిచెన్ ఎక్విప్మెంట్ ఏర్పా టు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, డిఆర్ఓ రాజకుమారి, ఆర్డీవోలు కే మాధవి, పి శ్రీకర్, డి అఖిల అడిషనల్ ఎస్పీ ప్రసాద్ డిఎస్పీలు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


## రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ను కలిసిన టిడిపి, జనసేన నాయకులు



**అంబాజీపేట, జూన్ 27 , ( ప్రభాతవార్త )**

తెలుగుదేశం పార్టీ నాయకులు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ను అంబాజీపేటకు చెందిన టిడిపి,జనసేన నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు చేపట్టి స్వగ్రామం కాకినాడ విచ్చేసిన ఆయనను ఆయన స్వగృహంలో జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, తదితరులు కలిశారు.

## సత్యవాడలో పశువుల దాన పంపిణీ



**కె.గంగవరం జూన్ 27 , ( ప్రభాతవార్త )**

మండలంలోని సత్యవాడ గ్రామ సచివాలయం లో పామర్రు పశువుల వైద్యురాలు శ్రావణి ఆధ్వర్యంలో పశువుల దాన పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది రమేష్,తాడాల మాచరావు, తాడాల పెద్ద సత్యవాడ పశువుల వైద్యులు సింధు బాబు కూటమి నాయకులు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.


# జూలై 4న జెఎన్టీయుకె 11వ స్నాతకోత్సవం

**కాకినాడ టౌన్ , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**

జేఎన్టీయూకె విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవం జూలై 4న శుక్రవారం అలూమ్ని ఆడిటోరియం నందు నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్కె ప్రసాద్ తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా 2023-2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా బీటెక్, బీ-ఫార్మశీ, ఎంటెక్, ఎంబిఏ, ఎంసిఏ, ఎం. ఫార్మశీ, బిబిఏ, ఫార్మా-డి మరియు బీ-ఆర్క్ విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రధానం చేస్తారని ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 99మంది రీసెర్చ్ స్కాలర్స్ పిహెచ్ డిగ్రీలు అందుకోనున్నారన్నారు. అలాగే ఛాన్సలర్ మరియు ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన 40మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, బంగారు పతకాలు అందజేస్తారన్నారు. ఈ స్నాతకోత్సవానికి కులపతి మరియు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారని, అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) ముఖ్యఅతిథిగా విచ్చేస్తుండగా ఆయనకు గౌరవ డాక్టరేట్ (హానరిస్ కాసా) ను ప్రధానం చేస్తారన్నారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాల్గొంటారన్నారు.

# రేషన్ దుకాణాలకు నిత్యవసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి : ఆర్డీవో శ్రీకర్

**అంబాజీపేట , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**



రేషన్ దుకాణాలకు సరఫరా చేసే నిత్యవసర సరుకుల తూకాల్లో తేడా లేకుండా పంపిణీ చేయాలని కొత్తపేట ఆర్డిఓ పి.శ్రీకర్ ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వాహకులకు సూచించారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఉన్న మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింటును ఆర్డీవో శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్థానిక స్టాక్ పాయింట్ నుండి అమలాపురం ,అంబాజీపేట, అల్లవరం, అయినవిల్లి, ఉప్పల గుప్తం మండలాలకు బియ్యం, పంచదార, ఆయిల్, కంది పప్పు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బియ్యంను పంపిణీ చేస్తున్నామన్నారు. సింగిల్ కార్డు కలిగి ఉన్నవారికి ఇంటి వద్దకే ఆయా రేషన్ షాపుల ద్వారా రైస్ ను పంపిణీ చేస్తున్నామన్నారు. స్టాక్ పాయింట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఎంఎల్ఎస్ పాయింట్లో ఉన్న సరుకుల వివరాలను తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట ఇన్చార్జి తహసీల్దార్ బి.చిన బాబు,ఆర్ఐ కె.ఏడుకొండలు, స్టాక్ పాయింట్ ఇంచార్జ్ ఎస్. సత్యనారాయణ,వీఆర్వోలు రమేష్, జీవీ రమణ ఉన్నారు.

# తలంపులమ్మ తల్లికి చీర - సారె సమర్పించిన తుని రాజా కుటుంబీకులు

**తుని ( రౌతులపూడి), జూన్ 27 , ( ప్రభాతవార్త ) :**



తుని మండలం, లోవ లో వెలసిన శ్రీతలంపులమ్మ అమ్మవారిదేవస్థానమునకు ఆషాడమాసము మహొత్సవములలో భాగంగా తొలి శుక్రవారమున శ్రీ తలంపులమ్మ అమ్మవారిని పూర్వమునుండి కొలుచుచున్న తుని రాజావారి కుటుంబ సభ్యులు అయిన ఎస్. ఆర్.వి.వి.శ్రీనివాస రాజు , పృధ్వి రాజు , రమేష్ రాజు కుటుంబ సమేతముగా విచ్చేసి శ్రీ అమ్మావారికి చీర-సారే సమర్పించి ప్రత్యేక పూజకార్యక్రమములు నిర్వహించారు. వీరితో పాటుగా భక్తులు, శ్రీవారి సేవకులు శ్రీ అమ్మవారికి నిర్వహించిన విశేష కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భముగా కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాధ రాజు మాట్లడుతూ ఇచ్చట శ్రీతలంపులమ్మ వారిని తుని రాజావారు కుటుంబ సభ్యులు పూర్వమునుండి కొలుచుట జరుగుచున్నదని, ఆషాడమాసోత్సవములలో తొలి శుక్రవారం రాజావారి కుటుంబ వారసులు ఈ విధముగా శ్రీ అమ్మవారికి చీర-సారే సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమములు నిర్వహించు ఆనవాయితిని కొనసాగించుచున్నందున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి ప్రతి సంవత్సరము తమ కుటుంబం నుండి ఈ ఆనవాయితిని కొనసాగించవలసిందిగా కోరియున్నారు. వీరు ప్రత్యేక పూజకార్యక్రమములు నిర్వహించిన అనతరం పూజకార్యక్రమములో పాల్గొన్న రాజావారి కుటుంబ సభ్యులను కార్యనిర్వ హణాధికారి వారు శ్రీ అమ్మవారి శేషవస్త్రములతో సత్కరించి శ్రీ అమ్మవారి ప్రసాదములను అందజేశారు. ఆలయ వేదపండితులు, అర్చకులు వీరికి వేద ఆశీర్వచనములు అందజేసియున్నారు. ఈ కార్యక్రమము నందు భక్తులు, శ్రీవారి సేవకులు ,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. పూజ అనంతరము తీర్ధ ప్రసాదములు అందజేశారు . ఇకపై ప్రతి ఆషాడమసోత్సవములలో తొలి శుక్రవారముతో శ్రీ అమ్మవారికి శ్రీ రాజావారి కుటుంబ సభ్యులు అందజేసిన తొలి చీర-సారేతో ఈ ఆనవాయితీ కొనసాగుతుందన్నారు.

# వెలుగు ఉద్యోగి భార్యకు ఆర్థిక సహాయం

**అంబాజీపేట , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** గత నెల గుంటూరులో జరిగిన అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలతో వెళ్లి తిరిగివస్తుండగా ఏలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెలుగు ఉద్యోగి కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ నాగరాజు దుర్మరణం చెందిన విషయం తెల్సిందే.నాగరాజు కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి ఉద్యోగులు మహిళా సంఘాలు దాతృత్వాని చాటారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచారు.జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, వివోఏలు, గ్రామ సంఘాలు సమకూర్చిన రూ.11 లక్షలు (పదకొండు లక్షలు) రూపాయలు మృతిని ఇద్దరు పిల్లలకు చెరో ఐదు లక్షల యాభై వేలు రూపాయలు చొప్పున పోస్టల్ శాఖ ద్వారా ఫిక్సడ్ డిపాజిట్ చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబెడ్కర్ కోనసీమ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సాయినాథ్ జయచంద్ర గాంధి చేతులు మీదుగా మండలంలోని పుల్లేటికుర్రో వారి స్వగృహం వద్ద మృతిని భార్య భారతికి డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ వెలుగు ఉద్యోగి మృతి చెందడం చాలా బాధాకమన్నారు. సెర్ప్ సంస్థ నుండి రావలసిన పారితోషకం,ఇన్సూరెన్స్ సకాలంలో వచ్చేలా చూస్తామ న్నారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో ఏపిడి నాగేశ్వరరావు,సెర్ప్ ఉద్యోగుల జిల్లా యూనియన్ అధ్యక్షులు దేవ వరాలబాబు,కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారి భూపతి వర్మ, డి.పి.ఎం లు విజయ్ కుమార్, ఏపిఎం విజయలక్ష్మి, రమాకాంత్ అర్జున్, విజయ్ వెంకట రమణ, రమేష్, శ్రీను,సత్యవతి, అడ్మిన్ అసిస్టెంట్లు,ఆఫీస్ అసిస్టెంట్లు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే తూర్పు గోదావరి జిల్లాలో మిషన్ వాత్సల్య - పిఎంకేర్ మొదటి చెక్కు అందజేత : ఎంపీ పురంధేశ్వరి,జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** భారతదేశం లోనే మొట్టమొదటి మిషన్ వాత్సల్య – పీఎం కేర్ చెక్కును తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సుమా మణికి అంద జేస్తున్నట్లు రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలియజేశారు. శుక్రవారం ఉదయం స్థానిక పోలీసు కల్యాణ మండపంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసన పరిషత్ సభ్యులు సోము వీర్రాజు, రాజమండ్రి పట్టణ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి గ్రామీణ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిలతో కలిసి కొవ్వూరు మండలం దొమ్మేరు కు చెందిన సుమ మణికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ...'మానవ సేవే మాధవ సేవ" అనే సూక్తికి ఈ కార్యక్రమమే ఉదాహరణ అని చెప్పారు. దేహం దేవాలయం అయితే, అందులోని జీవుడే నారాయణుడని స్కాంద పురాణం పేర్కొంటోందని అన్నారు. దేశంలో కోవిడ్ కారణంగా 15 కోట్ల మంది మృతి చెందుతారని, దీనికి కారణం పరిశుభ్రతపై భారతీయులు శ్రద్ధ వహించక పోవడమేనని ఒక అంతర్జాతీయ సంస్థ నివేదిక ఇచ్చినట్లు చెప్పారు.కానీ నరేంద్ర మోది చేపట్టిన స్వచ్ఛభారత్, ఇతర పటిష్ట విధానాల వల్ల కోవిడ్ మరణాలను గణనీయంగా తగ్గించగలిగామని చెప్పారు. దేశంలో వ్యాక్సిన్ల తయారీకి కూడా భారత ప్రభుత్వం మద్దతు ఇచ్చిందని చెప్పారు.



కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలను వారి బంధువులు సైతం ఆదరించ లేదన్నారు. ఆ సమయంలో ప్రధాని అండగా నిలిచారని, వారి కోసం పీఎం కేర్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రధాని చైర్ పర్సన్ గా, కేంద్ర ఆర్థిక, రక్షణ, హోమ్ శాఖ మంత్రులతో పాటు పారిశ్రామికవేత్తలు సభ్యులుగా ఉండే పిఎం కేర్ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసిందని చెప్పారు. 10 లక్షల రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేసి లబ్ధిదారుకు 23 సంవత్సరాలు నిండిన తర్వాత అందజేయటం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అందులో భాగంగా దేశంలో మొదటి చెక్కును ప్రత్తిపాటి సునియా సుమ మణికి అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థిక సహాయాన్ని తన కుమార్తె భవిష్యత్తుకు వినియోగిస్తానన్న సుమమణిని, ఆమె భర్తను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూపి ఎం కేర్ పథకం చాలా గొప్ప పథకం అని, ఈ పథకం ప్రవేశ పెట్టిన సందర్భంలో ఆనాడు తెలియకపోవచ్చని, కానీ నేడు అది లబ్ధిదారుకు ఎంతగా ఉపయోగ పడుతుందో అన్న విషయం నేడు అర్థమవుతోందని చెప్పారు. ఇది ప్రధాని దూర దృష్టికి సంకేతమని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోది ఆలోచన వలన సుమ మణి వంటి ఎందరో వ్యక్తులకి న్యాయం జరిగినట్లు చెప్పారు. కోవిడ్ క్లిష్ట సమయంలో కూడా ఏఎన్ఎంలు సేవలందించారని ప్రశంసించారు. గత ప్రభుత్వం కోవిడ్ మరణాలపై సరైన లెక్కలు చెప్పలేదని విమర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూపిఎం కేర్ ద్వారా దేశంలోనే మొదటి చెక్కును అంద జేయటం అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాల వల్ల ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ ఇంగ్లాండ్ ను అధిగమించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కోవిడ్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వంతో పాటు ప్రజల బాధ్యతతో వ్యవహరించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం 3500 ల అంగన్వాడి కేంద్రాలను అప్ గ్రేడ్ చేసిందని, ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్నం భోజనం అమలు చేస్తోందని చెప్పారు.

# కాపు కార్పొరేషన్ కి నిధులు మంజూరు చేయాలి

## : ఎంపీ సానా సతీష్ బాబుకు కాపు జేఏసీ ఘన సత్కారం



**కాకినాడ రూరల్,జూన్ 27 , ( ప్రభాతవార్త )** కాపు కార్పొరేషన్ కు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఎంపీ సానా సతీష్ బాబుని కోరారు. శుక్రవారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో కాపు జేఏసీ సభ్యులు, ఆంధ్ర కాపు సద్భావన సంఘం సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. కాపు జేఏసీ చైర్మన్ వాసిరెడ్డి ఏసుదాసు సానా సతీష్ బాబుని దుస్సాలువాతో ఘనంగా సత్కరించి అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాపుల ప్రధాన సమస్యలైన ఐదు శాతం రిజర్వేషన్, కాపు కార్పొరేషన్ కి కావలసిన నిధులు ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు కాపులు కీలకంగా వ్యవహరించారని వాసిరెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు సలాది రామకృష్ణ, యాళ్ల దొరబాబు, మాధవరపు పట్టాభి రామయ్య, గొల్లపల్లి లక్ష్మణరావు, దొడ్డిపట్ల అప్పారావు, అడపా ప్రకాష్ నాయుడు, తోట నవీన్, మాధవరపు తిరుమలరావు,వినాయక మాధవరావు, గంధం పల్లంరాజు, బిందన సురేష్ , కాపు సద్భావన సంఘ సభ్యులు పాల్గొన్నారు .

## మోడీ పాలనకు 11ఏళ్ళు.. మొక్కలు నాటిన బీజేపీ సీనియర్ నాయకులు, శిష్టా



**ఆత్రేయపురం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** నరేంద్ర మోడీ 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భం గా రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణకై బీజేపీ సీనియర్ నాయకుడు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ శిష్టా సూర్య కుటుంబరావు శుక్రవారం మండల కేంద్రమైన ఆత్రేయపురం గ్రామంలో గ్రామస్తులతో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ సేవ, సుపరిపాలన ,పేదల సంక్షేమం వంటి అనేక కార్యక్రమాలతో అవినీతి రహిత పాలనతో 11 ఏళ్ళు పూర్తి ఐన సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి నట్టు తెలిపారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న ఎపి టిడ్ కో చైర్మెన్ అజయ్



**అన్నవరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని ఏపి టిడ్ కో చైర్మెన్ వేములపతి.అజయ్ కుటుంబ సమేతముగా దర్శించుకున్నారు.వీరికి దేవస్థానం పిఆర్వో దామెర.కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా పిఆర్వో కృష్ణారావు శ్రీ స్వామివారి శేష వస్త్రమును,శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ విభాగం అధికారి గణపతి,పిఆర్వో విభాగం అధికారి శొంఠి.మూర్తి తదితరులు పాల్గొన్నారు

# వనదుర్గమ్మ ఆలయంలో ఘనంగా ఛండీ హెూమం

**అన్నవరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు.ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యహా వచనం,అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు మరియు వేదపండితులు,అర్చకులు



తదితరులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్పీఎస్, 31వ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రతి గ్రామంలో జెండా ఎగరాలి : జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవమాదిగ

**ఆత్రేయపురం, జూన్ 27 , ( ప్రభాతవార్త )** జూలై 7న జరగనున్న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో జెండా దిమ్మెలు నిర్మించి ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఆవిష్కరించాలని ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ పిలుపు నిచ్చారు. ఆత్రేయపురం మండల పరిధిలో ఉచ్చిలి గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.అన్ని విభాగాల నూతన కమిటీల ఏర్పాటు చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ నాయకులు. ముందుండి నడిపించాలని గ్రామ నాయకులను కోరారు.ఈ కార్యక్ర



మానికి .ఎం. ఎస్. పి. జిల్లా అధికార ప్రతినిధి, గంధం యాకోబు మాదిగ,.ఎం. ఎస్. పి.మండల అధ్యక్షులు ముప్పిడి పండు మాదిగ, ఎమ్మార్పీఎస్ యువ నాయకులు లంక ప్రేమ్ మాదిగ, మరియు ఉచ్చిలి గ్రామ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలు నాటికి పర్యాటకులకు అందుబాటులో హెూమ్ స్టే : కలెక్టర్ పి ప్రశాంతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** తూర్పు గోదావరి జిల్లాలో పర్యటన ప్రాంతం అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణ , ఇకో టూరిజం తో కూడిన ప్రణాళిక సిద్ధం చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో శుక్రవారం సాయంత్రం పర్యాటక, దేవాదాయ, ఆర్ ఎమ్ సి, కన్సల్టెంట్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, గోదావరి పుష్కర్ ప్రాజెక్ట్ నేపథ్యంలో సమగ్ర అభివృద్ధి కోసం పర్యాటక రంగంలో చేపట్టనున్న పనులకి సంబంధించి ప్రతిపాదించిన పనులు పై సమగ్ర నివేదిక అంద చెయ్యాలని ఆదేశించారు. అదే నేపథ్యంలో గోదావరి నది పరివాహక ప్రాంతాలలో టెంపుల్, ఇకో, ఇతర అనుబంధ ప్రాంతాల్లో పర్యాటక ప్రదేశాల యొక్క వివరాలతో నివేదిక అందచేయాలని ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రి గోదావరి ఘాట్ లు, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, ఇతర ఘాట్ లు , సినిమా చెట్టు, నిడదవోలు కెనాల్ , వాడపల్లి కెనాల్ రహదారి , కడియపు లంక ప్రాంతంలో , గోదావరి ఐ ల్యాండ్, హెూమ్ స్టే తదితర విషయాలు దృష్టిలో ఉంచుకొని నివేదిక అందచేయాలన్నారు. అదే విధంగా పురుషోత్తమ పట్నం లో ఏనుగుకొండ ప్రాంతంలోని 7 ఎకరాల ప్రాంతంలో ఇకో రిసార్ట్స్ కు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. రానున్న పుష్కరాలు తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మండువా లోగిళ్ళు, పురాతన కాలం నాటి భవనాలు, పెంకుటి ఇళ్ళు హెూమ్ స్టే కోసం గుర్తించి, వాటిని పర్యాటకులకు అందుబాటులో ఉండేలా తగిన సమగ్ర నివేదిక అంద చెయ్యాలని సూచించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలలో బోటింగ్ విహారానికి అనుకూలమైన వ్యవస్థను ఏర్పాటు చెయ్యాల్సి ఉంటుందన్నారు. ప్రజలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయంలో ఇక్కడ గడిపేలా పర్యటక అభివృద్ధి పనులు చేపట్టడం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. పర్యాటక రంగంలో అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలు కార్యరూపం అయ్యేలా ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎంసి అధికారులు ఎస్ ఈ ఎమ్ సిహెచ్ కోటేశ్వర రావు, ఈ ఈ మదర్సా అలీ, జిల్లా టూరిజం అధికారి పి వెంకటాచలం, ఎండోమెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువల వెంబడి ఉన్న ఆక్రమణలని గుర్తించి, తొలగింపుకు చర్యలు తీసుకోండి : జాయింట్ కలెక్టర్ నిశాంతి



**కోనసీమ బ్యూరో , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** జిల్లాలో పంట కాలువలు వెంబడి ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగింపుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, జల వనరుల శాఖ ఇంజనీర్లను ఆదే శించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, జలవనల శాఖ ఇంజనీర్లు మూడు రెవెన్యూ డివిజన్ల రెవెన్యూ డివిజన్ అధికా రులతో సమావేశం నిర్వ హించి జిల్లాలో జల వనరుల శాఖ పరిధిలో ఉన్న ఆక్రమణలను గు ర్తించి వాటి తొలగింపుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆమె ఆదేశించారు.

ఆక్రమణల మూలంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టి లో ఉంచుకొని తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్డీవోలు జలవనరుల శాఖ ఇంజనీర్ల సమన్వ యంతో ఆక్రమణలు తొలగింపుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజకుమారి, కే మాధవి, పి శ్రీకర్ బి అఖిల జల వనరుల శాఖ ఇంజనీర్లు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి అన్నదానానికి మూడు టన్నుల కూరగాయల విరాళం



**సీతానగరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి అన్నదాన కార్యక్రమానికి సీతానగరం మండల ప్రజలు సమిష్టిగా మూడు టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. ఈ పవిత్ర కార్యక్రమానికి వాకపల్లి సూరిబాబు, సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు, కోసూరి త్రిమూర్తుల రాజు, సింగవరం గ్రామ సర్పంచ్ సంగం పోశయ్య, పోల్నాటి నరసింహమూర్తి, ఎస్. చక్రం, రెడ్డి, వీరాస్వామి సహా పలువురు హాజరై తమ వంతు సహకారాన్ని అందించారు.

ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని హాజరైన గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కూరగాయల విరాళం భక్తుల భక్తిశ్రద్ధలకు నిదర్శనంగా నిలిచింది.

# తల్లికి వందనం అందని అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** తల్లికి వందనం పథకానికి నమోదు చేసుకొని, ఖాతా లలో నగదు జమ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ గ్రామ, వార్డు సచివాలయంలో అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, ఆమేరకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలియ జేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో "తల్లికి వందనం" పథకం పై డివిజనల్ అభివృద్ధి అధికారి (డి ఎల్ డి వో) పి. వీణా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి కె . వాసుదేవ రావు, సాంకేతిక సిబ్బంది నాగేశ్వర రావు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ.... తల్లికి వందనం కింద జిల్లాలో ఇప్పటివరకు అందిన ఫిర్యాదులలో 9,361 పరిష్కరించామన్నారు. వీటిలో 2,865 మందికి ఇప్పటికే చెల్లింపులు చేశామని, మరో 6,496 మందికి త్వరలోనే చెల్లింపులు జరుగుతాయని తెలియజేశారు. 6,431 ఫిర్యాదులు నవశకం పోర్టల్ మార్గదర్శకాలను అనుసరించి పరిశీలన దశలో ఉన్నాయని చెప్పారు. సరైన ఆధార్ నంబర్ ఇవ్వక పోవడం, తల్లికి, బిడ్డకి ఒకే ఆధార్ ఉండడం, ఆధార్ నెంబర్ ఇచ్చిన పేరెంట్



మరణించడం, తదితర కారణాల రీత్యా కొంత మందికి చెల్లింపులు జరగలేదని చెప్పారు. నెలవారి సగటు విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించిన వారు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, నాలుగు చక్రాల వాహనాల యజమానులు, పట్టణాలలో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థలం కలిగిన వారు, గ్రామాలలో మూడు ఎకరాల కంటే ఎక్కువ మాగాణి (వెట్), పది ఎకరాల కంటే ఎక్కువ మెట్ట భూమి కలవారు ఈ పథకానికి అనర్హులని తెలియ చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి తప్పకుండా పథకం వర్తింపు చెయ్యడం జరుగుతుందని వెల్లడించారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్న గ్రామ, వార్డు సచివాలయంలో నమోదు చేయవచ్చని, వాటికి సంబంధించి సరైన ధృవ పత్రాలను సమర్పించాలని , ప్రభుత్వ వెబ్ పోర్టల్ కూడా సరి చెయ్యడం జరుగుతుందని వెల్లడించారు.

# అచ్చంపేటలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ మీటింగ్

**సామర్లకోట , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని అచ్చంపేటలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ మీటింగ్ నాయకులతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప మరియు పెద్దాపురం అబ్జర్వర్ బొల్లా వెంకటరమణ , క్లస్టర్ ఇంచార్జిలు, మండల ప్రెసిడెంట్లు టౌన్ ప్రెసిడెంట్లు ఇతర నియోజవర్గం నుంచి వచ్చిన మండల, పట్నం



అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలి అడుగు కార్యక్రమం కోసం చర్చించారు అదేవిధంగా అనుబంధ కమిటీలు గురించి చర్చించారు.

# విజయవాడ కనకదుర్గమ్మకు ఆషాడ మాసం సారె సమర్పణ



**అన్నవరం , జూన్ 27 , ( ప్రభాతవార్త ) :** ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తరపున విజయవాడ కనకదుర్గమ్మ వారికి ప్రతీ ఏడాది ఆషాడమాసం సందర్భంగా సారె సమర్పణ ఆనవాయితీ. అదేవిధంగా శుక్రవారం దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు దంపతులు దుర్గమ్మకు చీర,రవిక, గాజులు, పండ్లు,పూలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం,ఈవో సిసి బిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# 'పవర్‌ఫుల్ లేడీ' గా ప్రశంసలు ..



పర్యావరణానికీ, ఆరోగ్యానికీ హానికారకమైన శానిటరీ నాప్కిన్ల ఉపయోగాన్ని నిర్మూలించాలనుకున్నారీమె. హాయిగా కూర్చోక... ఎండనకా, వాననక తిరగడం అవసరమా అన్నారంతా. అవేమీ లెక్కచేయకుండా... పనిచేయడం మొదలుపెట్టారు దార అరుణ. "అప్నా గ్రీన్ ప్రొడక్ట్స్" అంకురంతో ఏడేళ్లుగా సేవలందిస్తూ గుర్తింపు సంపాదించుకున్నారు.

మాది విజయవాడ పుట్టి పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే, ఎంబీఏ ఫైనాన్స్ చదివి, కొన్నాళ్లు ఉద్యోగమూ చేశాను. పెళ్లయ్యాక మానేశా మావారు దార నాగరాజు, ఐటీ ఉద్యోగి, ఇల్లూ, పిల్లల బాధ్యతలతో పదిహేనేళ్లు గడిచిపోయాయి వాళ్ళు పెరిగి స్కూళ్లకు వెళ్లే వయసొచ్చాక మళ్లీ కెరియర్‌పై దృష్టి పెట్టాను. ఈ రంగంవైపు ఎలా? మా పిల్లలు చదివే స్కూల్లోనే టీచరుగా పనిచేసేదాన్ని. ఓసారి మా స్నేహితురాలు ఒకరు... మెన్‌స్ట్రువల్ హైజీన్ కోసం ఒక స్పీచ్ రాసివ్వాల్సిందిగా కోరారు. నేను రాసి ఇచ్చింది ఆమెకు చాలా నచ్చింది. తనతో కలిసి అవగాహన కార్యక్రమాల్లో పనిచేయమని అడిగింది. సామాజిక సేవ కోసం నావంతుగా భావించి నేనూ ముందడుగేశా.

**ఎదురైన ఇబ్బందులు...**

నెలసరుల్లో పరిశుభ్రత, ప్యాడ్స్ వాడకం గురించి చెప్పేటప్పుడు వినడానికే చికాకుపడేవారు. సింథటిక్ ప్యాడ్స్ వద్దు.. ప్రత్యామ్నాయాలు ఉన్నాయని చెబితే 'మాటలేనా... ప్రొడక్ట్స్ ఎక్కడా... అని అడిగేవారు. దాంతో కొద్దికొద్దిగా డబ్బు జమ చేసుకుని నా స్నేహితురాలితో కలిసి సంస్థను ప్రాలింభించా. విజయాన్ని ఊహించారా? కోవిడ్ వల్ల నా ఫ్రెండ్ వెనకడుగు వేసింది. అది మొదలు నేనొక్కదాన్నే కానీ చేసే పని ఆగిపోకూడదన్న పట్టుదల మాత్రం ఉంది. అదే నన్ను నడిపింది. ఇప్పుడు హైదరాబాద్‌లోనే కాదు దేశవ్యాప్తంగా మా సేవలు అందుతున్నాయి. ఝార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలతో కలిసి గ్రామీణ మహిళలకు వీటి తయారీ గురించి చెప్పాను. 'పవర్ విమెన్' అన్న ప్రశంసలూ అందుకున్నా. ఇన్‌సినరేటర్ కోసం చెప్పండి?

**ప్యాడ్స్ వాడకం తర్వాత...** అవన్నీ ఒకేచోట పోగవకుండా సహాయం యంత్రం ఇది. దీని ధర రూ.10 వేల నుంచే జరిగింది. సేకరించిన వ్యర్థాలన్నీ ఇందులో వేసి కాల్చేయొచ్చు. కలప, అరటి, గులాబీ, గుజ్జులతోనే ప్యాన్ని తయారుచేస్తాం కాబట్టి మండేటప్పుడు కాలుష్యం ఏర్పడుతుందని భయపడక్కర్లేదు. స్కూళ్లు, కాలేజీల్లో మా ప్యాడ్స్ పిల్లలకు అందుబాటులో ఉంటున్నట్లే.. ఇన్‌సినరేటర్ కూడా ఉండాలన్నదే నా లక్ష్యం. ఏర్పడుతుందని భయపడలేదు. స్కూళ్లు, కాలేజీల్లో మా ప్యాడ్స్ పిల్లలకు అక్కడ ఉంటున్నట్లే.. ఇన్సి రెటర్ కూడా ఉండాలన్నదే నా లక్ష్యం. □

# వాడిన పూలతో మహిళలకు ఉపాధి

**ఇళ్లలో పూజ కోసం ఉపయోగించిన పూలను మరుసటి రోజు వృథాగా పడేయడం అలవాటే అదే పెద్ద పెద్ద దేవాలయాల్లో అయితే ప్రతిరోజూ కిలోల కొద్దీ పూవ్వులు, పూల మాలలు వృథా అవడం చూస్తాం. వీటిని నదుల్లో పడేయడం వల్ల ఆ నీళ్ల కలుషితమవుతుంది.** అదే నేలపై పడేస్తే కొన్ని టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతుంది. పర్యావరణానికి హాని కలిగించేవే! అందుకే ఈ వృథాను అరికట్టేందుకు తన వంతుగా కృషి చేస్తున్న జమ్మూ కశ్మీర్‌కు చెందిన పాయల్ శర్మ. దేవాలయాల్లో వృథాగా పడేసే పూలను సేకరించి.. వాటితో వివిధ సుగంధ తయారుచేస్తోంది. అటు పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ఇటు మహిళలకు ఉపాధి కూడా చూపుతోంది. ఇలా తనవ్యాపారంతో ఎంతోమంది స్ఫూర్తినిస్తోన్న పాయల్ గూర్చి తెలుసుకుందాం.



వాడిన వాటిని తిరిగి ఉపయోగించుకునేలా.. చిన్న పనులే పెద్ద మార్పు తీసుకొస్తాయి అనే మాటల్ని నమ్ముతుంది పాయల్, జమ్మూలోని రెహరి అనే ప్రాంతం ఆమెది. ఆమెకు దైవభక్తి ఎక్కువ. తరచూ అక్కడి దేవాలయాల్ని సందర్శించే పాయల్ దేవుని కోసం ఆలయాల అలంకరణ కోసం వాడిన పూలను నదులు, బహిరంగ ప్రదేశాలోపడేస్తున్నాట్లు తెలుసుకుంది. సాధారణ మనం పూజ కోసం వాడిన పూలను ఎంతో పవిత్రంగా భావిస్తాం. ఆలయాల్లోనూ అంతే! అయితే ఈ వాడిన పూలను నదుల్లో, భూమిపై పడేయడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుంది. ఈ సమస్యను గుర్తించాక దీనికి ఏదైనా పరిష్కార మార్గం చూపాలనిపించింది. దేవుడి సేవకు వినియోగించిన ఈ పూలను వృథాగా పడేయకుండా.. వీటితో తిరిగి పూజ కోసం ఉపయోగించే ఉత్పత్తులనే తయారు చేస్తే బాగుంటుందనిపించింది. ఈ ఆలోచనలో నుంచి పుట్టిందే 'జెకె అరోమాటిక్స్. 2019లో ఈ సంస్థను ప్రారంభించా..'అంటూ తన బిజినెస్ జర్నీ గురించి చెబుతోంది పాయల్.

పూజ కోసం వాడిన పూలను రీసైక్లింగ్ చేసి..దానితో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయడం ఈ సంస్థ ముఖ్యోద్దేశం. కొంతమంది వలంటీర్ల సహాయంతో స్థానికంగా ఉన్న దేవాలయాల నుంచి పూజకు ఉపయోగించిన పూలను, పూలమాలల్ని సేకరించారు. పాయల్ పూజ కోసం వాడిన పూలను వృథాగా పడేయకుండా మరో రకంగా ఉపయోగించేలా చేయాలన్నది నా ఆలోచన. ఇందులో భాగంగానే వాడిన పూలను సేకరించి వాటిని పూర్తిగా ఎండబెట్టి పొడి చేస్తాం. దీనికి సహజ సిద్ధమైన గేమ్స్, రెజిన్స్, గుగ్గిలం, అత్యవసర నూనెలు.. వంటి పదార్థాలు కలిసి వివిధ ఫ్లేవర్లలో అగర్బత్తీలు, హెర్బల్ ఆయిల్స్, సాంబ్రాణి ధూపపు ఉత్పత్తులను తయారు చేస్తున్నాం.. ప్రస్తుతం మా వద్ద లావెండర్, చందనం, మల్లె, గులాబీ, వంటి ఫ్లేవర్లతో కూడిన అగర్బత్తీలు, ధూపాలు లభ్యమవుతున్నాయి.

**.మహిళలకు ఉపాధి కల్పిస్తూ..!**

ఇలా సహజసిద్ధమైన ఉత్పత్తుల తయారీతో అటు పర్యావరణాన్ని కాపాడుతూనే.. ఇందులో స్థానిక మహిళల్ని భాగం చేస్తూ వారికి ఉపాధి మార్గాలూ చూపుతోంది పాయల్. జమ్మును ఆలయాల నగరంగా పలుస్తారు. పండగలు ప్రత్యేక సందర్భాల్లో పూజలు ఎక్కువగా నిర్వహిస్తారు. దీంతో పూల వాడకమూ పెరుగుతుంది. అయితే మొదట్లో దేవాలయాల్లో ఉపయోగించిన పూలను సేకరించడం సవాలుగా అనిపించేది. ఎందుకంటే వీటిని మాకిచ్చే వారు కాదు కానీ మా ఆశయం గురించి వివరించాక ఒప్పుకొన్నారు. ఇదనే కాదు.. పెట్టుబడి పరంగానూ పలు సవాళ్లు ఎందుర్కొన్నా ఈ క్రమంలో స్థానికంగా నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటూ.. వ్యాపార నిర్వహణ గురించి ప్రాథమిక మెలకువలు నేర్చుకున్నా. ఇక నా సంస్థ ద్వారా మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక అవగాహన కార్యనరకమాలు, వర్క్‌షాప్స్ వంటివి నిర్వహిసునతన్నా. వీటి ద్వారా అటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూనే.. ఇటు పూల వ్యర్థాలతో ఆయ వస్తువుల తయారీ గురించి నేర్చుకున్నా. ప్రస్తుతం మా వద్ద 30 మంది మహిళలు పనిచేస్తున్నారు. అంటోన్నపాయల్ తన సంస్థ ద్వారా 'స్వచ్ఛభారత్ అభియాన్', మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలకు ప్రత్యక్షం తన మద్దతు తెలుపుతోంది. ఇలా పాయల్ ఎకోఫ్రెండ్లీ వ్యాపారాన్ని స్ఫూర్తిగా తీసుకున్న పలువురు. వివిధ ప్రాంతాలలో ఈ తరహా వ్యాపారాలను ప్రారంభించడం గమనార్హం. □

# అసనాలు వేసేలా.. క్యాజువల్ వేర్‌కు స్టైల్‌గా..







యోగా.. ఇది ఈనాటిదా? అయిదు వేల ఏళ్ల క్రితం నుంచే మనదేశ సంస్కృతిలో అంతర్భాగం. శారీరకంగానే కాదు మానసికంగానూ దృఢంగా ఉంచే సాధనమిది. అందుకే మోడరన్ అమ్మాయిలూ దీనివైపు మొగ్గు చూపుతున్నారు. దినచర్యలో వ్యాయామాన్ని అంతర్భాగం చేసుకోవాలనుకునే వారి ప్రధాన ఎంపికా యోగానే అవుతోంది. సంప్రదాయ వ్యాయామ పద్ధతి కదా అని ఏవో ఒక దుస్తుల్లో చేసేద్దామంటే ఊరుకుంటారా ఏంటీ ఈ తరం అమ్మాయిలు. సౌకర్యానికి ప్రాధాన్యమిస్తూనే స్టైల్‌గానూ ఉండాలనుకుంటున్నారు. పైగా వాటిని వ్యాయామానికే పరిమితం చేయొద్దు.. క్యాజువల్ వేర్‌గానూ ఉపయోగించుకోవాలి అనుకుంటూన్నరు. అందుకు తగ్గట్టే ఆధునిక వస్త్రాలూ సిద్ధమవుతున్నాయి. అంగారకా, ధోతి, హారెమ్, ఫ్లో, బోహో ప్యాంట్లకు షార్ట్, మిడ్ లెంత్ టాప్‌లు జత చేసుకొని అమ్మాయిల మనసు దోచేస్తున్నాయి. కో ఆర్డ్ సెట్‌లను తలపించే జంప్‌సూట్‌లు, సైడ్ స్లిట్ డ్రెస్‌లు, లేయర్‌న ప్యాంట్ సెట్ల సంగతికి చెప్పనక్కర్లేదు. చూపరులను కళ్ల తిప్పుకోనివ్వకుండా చేస్తాయంటే నమ్మండి. ఖాదీ, ఆర్గానిక్ కాటన్ రేయాన్, సిల్క్ వంటి భిన్న వస్త్రరకాల్లోనూ దొరుకుతున్నాయి. మీ స్టైల్‌కు తగ్గదేదో ఎంచుకోవడమే తరువాయి. ఆసనాలు వేయడానికి అనువుగామీ ప్రత్యేకతను తెలియజేసేలా ఉండే వస్త్రశ్రేణి వీటిల్లో ఏది మరి?







# చిలకడ దుంప కట్లెట్



**కావలసినవి :** చిలకడదుంపలు-3, ఉప్పు-పావు చెంచా, కొత్తిమీర తరుగు-చారెడు, మొక్కజొన్న పిండి-3 చెంచాలు, పచ్చిమిర్చి-2, నిమ్మరసం, కారం, అల్లం తరుగు-చెంచా చొప్పున, జీలకర్ర పొడి, గరం మసాలా, ఛాట్ మసాలా-అర చెంచా చొప్పున, నూనె-2 చెంచాలు.

**తయారీ :** చిలకడదుంపలు ఉడికించి, పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో మొక్కజొన్న పిండి, పచ్చిమిర్చి ముక్కలు, నిమ్మరసం, ఉప్పు, అల్లం తరుగు, జీలకర్ర పొడి,గరం మసాలా, ఛాట్ మసాలా, కారం.. అన్నీ వేసి బాగా కలపాల. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా తీసుకుని చేత్తో చిన్నగా ఒత్తుకోవాలి. కడాయిలో కాస్తనూనెవేసి.. బంగారు రంగు వచ్చే దాకాన వేయించుకోవాలి. అంతే ఘుమఘుమలాడే చిలకడదుంప కట్లుట్లు సిద్ధం. □

ఆరోగ్య భాగ్యం

# టి.బిని పూర్తిగా నిరోధించలేమా? -2



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

క్షయ మందులవల్ల ఊపిరితిత్తుల పనితీరు తగ్గిన వారిలో 27.9% చికిత్స ఆపివేసిన 3 సంవత్సరాల తర్వాత కూడా వ్యాధి లక్షణాలు కన్పించవచ్చు.

**రిస్క్ ఫ్యాక్టర్స్:** రద్దీగా ఉండే ప్రాంతాల్లో నివసించే వ్యక్తులు, బైళ్ళు ఆసుపత్రుల్లోని లాబ్ టెక్నీషియన్స్, హెల్త్ వర్కర్స్ డ్రగ్ రెసిస్టెంట్ టి.బి. ఉన్నట్లు తెలిసినవారితో గడపడం, తరచూ టి.బి. ఉన్న ఎండమిక్ ప్రాంతాల్లో నివశించడం, ప్రయాణాలు చేయడం, బైళ్ళు, వలసలు, శరణార్థుల్లో, హెచ్‌ఐవి/ఎయిడ్స్ కీమోథిరపీ, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో రిస్క్ ఎక్కువ.

**రకాలు :** ఇది మందుల నిరోధకతని బట్టి 3 రకాలుగా కన్పిస్తుంది.

1. ఐసోనియాజిడ్ నిరోదక టి.బి. ఐసోనియాజిడ్‌కు ప్రతి ఘటన చూపే ఐసోలేట్ వల్ల ఏర్పడుతుంది. 2. రిఫాంపిసిన్ రెసిస్టెంట్ టి.బి. రిఫాంపిసిన్‌కు నిరోధకతను చూపే ఐసోలేట్ వల్ల ఏర్పడుతుంది.
3. పాలీ రెసిస్టెంట్ టి.బి. ఒకటి కంటే ఎక్కువ టి.బి. వ్యతిరేక ఔషధలకు నిరోధకతను కల్గి ఉండే ఒక ఐసోలేట్స్ వల్ల కలిగే టి.బి. 2. విస్తృత ఔషధ నిరోధక టి.బి. ఇది అరుదైనది. ప్రమాదకరమైనది. ఇది 9% కేసుల్లో ఉంటుంది.

భారత్‌లో 130,000 డిఆర్ టిబి కేసులు నమోదు అయ్యాయి. అందుల 35.8% చికిత్స పొందితే, 2,8% కొత్తకేసులు ప్రతి సంవత్సరం నమోదు అవుతున్నాయి. ఢిల్లీ కర్నాటక, ఆంధ్ర, రాజస్థాన్, తమిళనాడు, గుజరాత్ మధ్యప్రదేశ్, తెలంగాణాలో ఎక్కువగా ఎండిఆర్ టిబి కేసులు నమోదు కావడం విశేషం.

**వ్యాధి నిర్ధారణ :** ఫినోటైనింగ్ డ్రగ్ ససెప్టంకిలిటీ టైస్టింగ్ డిఎస్‌టి జీన్ ఎక్స్‌పర్ట్, ట్రూనాట్ పరీక్ష, కఫం పరీక్ష, రక్త పరీక్షలు చర్మ పరీక్ష పార్వర్డ్ మాలిక్యులర్ డయాగ్నోస్టిక్స్, ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలలో పాటు హైరిస్క్ స్కానింగ్ టెస్ట్స్, వైరల్‌లోడ్ (హెచ్‌ఐవి/ఎడ్స్) మూత్ర పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

**చికిత్స :** క్షయవ్యాధి చికిత్సకుపయోగించే ఆంటి ట్యూబర్క్యులార్ మందులు టిబి క్రిముల్ని చంపలేవు. కాబట్టి ప్రత్యేక మందులతో చికిత్స చేయాలి. ఇది సంక్లిష్టమైన చికిత్స అని చెప్పవచ్చు. క్షయ మందుల్ని ఎంత మోతాదులో నోటిద్వారా/ఇంజెక్షన్ రూపంలో ఎంత తరుచుగా, ఎంత కాలం తీసుకోవాలనేది రోగి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. హెచ్‌డిఆర్, టిబి ఉంటే టి.బి.క్రిముల్ని చంపేంత బలమైన నాణ్యమైన, ప్రత్యేకమైన మందులతో చికిత్స వైద్య పర్యవేక్షణలో చేయాలి. వ్యాధి లక్షణాల్ని బట్టి, మందుల సైడ్ ఎఫెక్ట్‌ని బట్టి చికిత్సని మధ్యలో ఆపకూడదు. ఎండిఆర్-టిబి సోకిన వ్యక్తి నుండి వ్యాధి సోకిన వ్యక్తికి నేరుగా వ్యాపిస్తుంది. గతంలో చికిత్స చేయనివ్యక్తి కూడా ఎండిఆర్ టిబి క్రొత్తకేసుని అభివృద్ధి చేయడాన్ని ప్రెమరీ ఎండిఆర్ టిబి అని అంటారు. ఇది 75% కేసుల్లో కన్పిస్తుంది. టి.బి. యొక్క నాన్ రెసిస్టెంట్ స్టెయిన్ ఉన్న వ్యక్తికి సరిపడే చికిత్స అందించబడినప్పటికి పొందిన ఎండిఆర్ టిబి అభివృద్ధి చెందుతుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఎండిఆర్/ఆర్ఆర్ఆర్ టిబిని త్వరితగతిన నిర్ధారించడం సాధ్యం కాదు. దీని చికిత్స సుదీర్ఘమైనది (6-24 నెలలు), ఖరీదైనది, కష్టమైనది, ఎందుకంటే మైకోబాక్టీరియం జన్యుపరమైన మార్పులకు లోనవుతుంది. కాబట్టి తగిన మందుల కలయికతో చికిత్స అందించేటప్పుడు డ్రగ్ సెన్సిటివిటీ టెస్ట్‌లు, సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా చూడాలి. నయమయ్యేవరకు రోగికి శారీరక, మానసిక మద్దతు ఇవ్వాలి. రోగిని సపరేట్‌గా ఉంచి చికిత్స చేయాలి. సాధారణ చికిత్స కంటే 10-100 రెట్లు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి సకాలంలో పరీక్షలు చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా రోగిని నయం చేయడమే కాకుండా వ్యాధి ప్రసారాన్ని నిరారించడమే దీని లక్ష్యం అవసరమైతే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. వేగవంతమైన రోగనిర్ధారణ మరియు చికిత్స ద్వారా కంటిన్యూగా జ్వరం రావడాన్ని కంట్రోల్ చేయాలి. పారాసిటమాల్ టాబ్లెట్స్ ఎక్కువగా వాడరాదు. స్పాంజింగ్ ద్వారా టెంపరేచర్‌ని కంట్రోల్ చేయాలి. 4-5 క్రియశీల మందులు అవసరం. సైడ్ ఎఫెక్స్ లేకుండా ఇమ్యూనిటీని పెంపొందించే శారీరక మానసిక ఆరోగ్యం, విశ్రాంతి అవసరం, దీనికి కుటుంబ, స్నేహితుల సహకారం ముఖ్యం. సెల్‌వాల్ సంశ్లేషణ, ప్రోటీన్ సంశ్లేషణ, న్యూక్లియర్ ఆసిడ్ సంశ్లేషణ నిరోధాన్ని బట్టి మందుల్ని ప్రతిరోజూ ఒకే సమయంలో తీసుకోవాలి. నొప్పి ఉపశమనం కోసం నాన్‌స్టీరాయిడ్ ఆంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్‌ను ఎంచుకోవాలి. □

# పూరీ జగన్నాథుడు

శ్రీకృష్ణుని స్థిర విశ్వాస క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పూరీకి శ్రీక్షేత్రమనే పేరు కూడా ఉంది. ఎక్కడైనా ఏ దేవుడైనా సతీ సమేతంగానో, ఏకమూర్తిగానో వెలుస్తాడు. కానీ పూరీలో సోదరుడు. బలరాముడు, సోదరి సుభద్రలతో కలిసి కొలువుతీరిన కృష్ణుడు జగన్నాథుని పేరుతో పూజలందుకుంటున్నారు. ఇది జగన్నాథుని పురం కనుక జగన్నాదపురి అని పిలిచేవారు. కాలక్రమేణా అటు దిటు మారి.. పురం జగన్నాథ్.. పూరీ జగన్నాదగా స్థిరపడింది. శ్రీరాముడు నిరంతరం తననే సేవించి, తన జీవించిన లక్ష్మణుడి పట్ల ప్రేమ కోసమే, ఆదరణలతో పై జన్మలో నీకు తమ్ముడినై సేవిస్తాను అని వరమిచ్చాడు. ఆ ప్రకారం లక్ష్మణుడు బలరాముడిగా, రాముడు శ్రీకృష్ణుడిగా జన్మించారు. శ్రీరాముడు సీతాదేవి, లక్ష్మణులతో కూడి దర్శనం ఇస్తున్నట్లే శ్రీకృష్ణుడు అన్న చెల్లెళ్లతో కూడి దాదాపు వెయ్యి అడుగుల ఎత్తులో శ్రీమహావిష్ణువు ఆయుధమైన సుదర్శన చక్రాకారంలో ఉన్న పూరీ. జగన్నాథ ఆలయానికి దిక్కుల ద్వారా ఉండటం విశేషం. ఏటు నుంచి అయినా లోనికి వెళ్లవచ్చు. ఇక్కడి దేవతలు చెక్కతో చేసిన వారు మూర్తులు ఆలయంలో అనేక నియమాలున్నాయి. వంట కోసం మట్టి కుండలను మాత్రమే వాడతారు. నిత్యం 56 రకాలు నైవేద్యాలు నివేదిస్తారు. ఉదయం ఆధ్యాత్మిక చింతన, పారమార్థిక ప్రయోజనాలను చేకూరుస్తూ సామాజిక ఐక్యతను పెంచే ఉత్సవం రథయాత్ర ఏటా 9 రోజులు సాగే ఈ రథయాత్ర ఆషాడ శుక్ల విడిద మొదలై దశమినాడు ముగుస్తుంది. నిజానికి వైశాఖ శుద్ధ విదియ నాడే రథయాత్ర కోసం పనులు ప్రారంభిస్తారు. అక్షయ తృతీయనాడు రథాల తయారీకి శ్రీకారం మడతారు. శ్రీకృష్ణమైన కలపను సేకరిస్తారు. జగన్నాథుని. రథం పేరు నందికోశ బలభద్రుని రథం తాళధ్వజం సుభద్రాదేవి రథం పేరు దర్పదలన్. అన్నీ సిద్ధం చేయడానికి రెండు నెలలు పడుతుంది.జగన్నాథుని రథానికి దారకుడు, బలభద్రుని రథానికి మాటలి, సుభద్రాదేవి రథానికి అర్జునుడు సారథులు. □



ఆధ్యాత్మికం

# స్కేళ్లను విరగ్గొట్టేస్తున్నారా ?



స్కేలు చాల అవసరం, లేకపోతే పనే జరగదు అన్నట్లు పిల్లలు స్కేళ్లను తెగ కొంటారు. అంత మారాం చేసికొని పించుకుంటారా.. ఎన్ని రోజులు ఉంచుతారు? ఒక్కోసారి రెండు రోజుల్లోనే రెండు ముక్కలు చేసి చేతిలో పెడతారు. పైగా 'పౌచ్‌లో పెడితే విరిగింది, పక్కవాడు విరగ్గొట్టాడు అని బోలెడు కబుర్లు చెబుతారు. ఆటలాడుతూనో, చూడకుండా తొక్కో విరిగేవీ ఎక్కువ తరవాతేంటి.. మళ్లీ కథ మొదటికే.. ఇంకోటి కావాలంటూ ఏడుపు. ఇలా ఎన్నని కొంటాం చెప్పండి? అలాగని కొనకుండానూ ఊరుకోలేం. అందుకే.. ఈ ఫ్లెక్సిబుల్ లేదా బెండబుల్ రూలర్స్‌ని తెచ్చేయండి.



భిన్నరంగుల్లో, కార్టూన్ రూపాల్లో చూడటానికి అందంగా ఉండటమే కాదు..ఏం చేసినా త్వరగా విరగవు. కొన్నింటినైతే బ్రేస్‌లెట్‌లానూ పెట్టుకోవచ్చు. హమ్మయ్యా.. ఒక బాధ తప్పిందని మీకూ అనిపిస్తోందా? అయితే వెదికేయండి. ఆన్‌లైన్ వేదికల్లో దొరుకుతున్నాయి. □

# నేరేడులో ఎన్ని సుగుణాలో..



నేరేడులో ఎన్ని సుగుణాలో.. నల్లగా నిగనిగలాడే నేరేడు పండును చూస్తేనే నోరూరిపోతుంది. కండ తక్కువ, గింజ పెద్దది కనుక ఎన్ని తిన్నా తిన్నట్టే ఉండదు. ఇవి రుచిలోనే కాదు, ఆరోగ్యం అందించడంలోనూ ముందుంటాయి. వీటితో ఎన్ని లాభాలున్నాయంటే.

✦. నేరేడుపండ్లు తినటం వల్ల శరీరానికి అవసరమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, సల్ఫర్, థియామిన్‌ఖ, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, ఎ,బి1, బి2, బి3, బి5, బి6, సి-విటమిన్లు అందుతాయి.

రక్తపోటును తగ్గిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి.

✦.బరువు తగ్గటంలో తోడ్పడతాయి. ✦. కీళ్లనొప్పులను నివారిస్తాయి. ✦ కంటిచూపును మెరుగుపరుస్తాయి. ✦. గొంతులో వచ్చే సమస్యలను నివారిస్తాయి.

✦. జుట్టు రాలదు. కుదుళ్ల దృఢంగా ఉంటాయి.

✦ శరీరంలో చేరిన మలినాలను హరింపచేస్తాయి.

✦. కాలేయాన్ని సంరక్షిస్తాయి.

✦ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

✦ చర్మం కాంతితో మెరిసేలా చేస్తాయి.

✦ మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.

✦. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. □

# విజయ్ ఆంటోని మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం

## 'మార్గన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత సురేష్‌బాబు

**విజయ్ ఆంటోని** నటిస్తూ, నిర్మించిన 'మార్గన్ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. ఈ సినిమాను సురేష్ బాబు తెలుగులో జూన్ 27న రిలీజ్ చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. ఈ సందర్భంగా మార్గన్ ప్రీ రిలీజ్ లైవ్ ఇంటరాగేషన్ అనే ఓ ఈవెంట్‌ను చిత్రయూనిట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు మాట్లాడుతూ, విజయ్ ఆంటోని మ్యూజిక్ డైరెక్టర్ నుంచి హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన ప్రయాణాన్ని చూస్తూ ఉన్నాను. నేను అలాంటివారు తీసే చిత్రాల్ని చూసేందుకు ఇష్టపడు తుంటాను. అందుకే నేను 'మార్గన్ మూవీని తీసుకుని తెలుగులో రిలీజ్ చేశాను. ఆయన ప్రొడక్షన్ కంపెనీ, వాల్యూ, మేకింగ్ అన్నీ కూడా నాకు చాలా ఇష్టం అని అన్నారు.



విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, మా సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న సురేష్ బాబుకి చాలా ధన్యవాదాలు. ఆయన చాలా గొప్ప నిర్మాత. ఆయన మా సినిమాను రిలీజ్ చేస్తుండటమే మా మొదటి సక్సెస్. లియో జాన్ పాల్ ఈ మూవీని అద్భుతంగా తీశారు. ఇదొక నార్మల్ సీరియల్ కిల్లర్ చిత్రంలా ఉండదు. ఇందులో చాలా లేయర్లు ఉంటాయి. నేను కంటెంట్ గురించి ఎక్కువ మాట్లాడితే కథ రివీల్ అవుద్ది. ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకు ఎంగేజింగ్‌గా ఉంటుంది. నేను ఈ సినిమాకు సంగీతాన్ని అందించాను. నేను ప్రస్తుతం ఆరేడు సినిమాల్ని నిర్మిస్తున్నాను. మా 'మార్గన్'ప్రస్తుతం తమిళ, తెలుగులో రిలీజ్ చేశాను. మా సిస్టర్ సన్ అజయ్ ధీషన్ బిచ్చగాడు సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. అతడ్ని ఈ చిత్రంతో నటుడిగా పరిచయం చేస్తున్నాను. భాష్యశ్రీ పాటలు, మాటల వల్ల ఇది పూర్తి తెలుగు సినిమాగా అనిపిస్తోంది. బ్రిగిడ, దీప్శిఖ గొప్పగా నటించారు. మా మార్గన్ సినిమాను అందరూ చూడండి అని అన్నారు. అజయ్ ధీషన్ మాట్లాడుతూ, అందరూ తప్పకుండా చూడండి. రెగ్యులర్ క్రైమ్ థ్రిల్లర్‌లా ఉండదు. ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది. ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా ఉంటుంది. మా డైరెక్టర్ లియో జాన్ పాల్ నా మీద ఎంతో నమ్మకంతో అవకాశం ఇచ్చారు. నన్ను నమ్మి ఛాన్స్ ఇచ్చినా ఫాతిమాకి, విజయ్‌కి థాంక్స్ అని అన్నారు. బ్రిగిడ మాట్లాడుతూ, మా మూవీని తెలుగులో రిలీజ్ చేసిన సురేష్‌కి థాంక్స్. 'మార్గన్'తో ఆడియెన్స్ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ప్రతీసారి తెలుగు ఆడియెన్స్ నన్ను ఎంకరేజ్ చేస్తూనే వచ్చారు. ఈ చిత్రంతోనూ నన్ను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అందరూ చూడండి. నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనికి థాంక్స్ అని అన్నారు. దీప్శిఖ మాట్లాడుతూ, 'మార్గన్' చిత్రంలో నా పాత్ర అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనికి, లియో జాన్ పాల్‌కి థాంక్స్. ఈ మూవీ టీంతో పని చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు.

రైటర్ భాష్యశ్రీ మాట్లాడుతూ, విజయ్ ఆంటోనితో నా ప్రయాణం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 127 నిమిషాల నిడివితో రాబోతోన్న ఈ చిత్రం ప్రతీక్షణం ఎంగేజింగ్‌గా ఉంటుంది. ఎక్కడా కూడా బోర్ కొట్టదు. బ్రిగిడ, దీప్శిఖ, అజయ్ పాత్రలు అద్భుతంగా ఉంటాయి. నన్ను నమ్మి అవకాశం ఇస్తున్న విజయ్ ఆంటోనికి థాంక్స్. ఇది థియేటర్లో చూడాల్సిన సినిమా. అందరూ తప్పకుండా చూడండి అని అన్నారు.

## ఆగస్ట్ 14న 'వార్ 2' ఐమాక్స్ థియేటర్స్‌లో రిలీజ్

**భారతదేశపు** ప్రముఖ సినిమా నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలింస్ (వైఆర్ఎఫ్) దేశంలో అతిపెద్ద సినిమాటిక్ ఫ్రాంఛైజీలకు కేరాఫ్‌గా నిలుస్తోన్న ఈ సంస్థ, మోస్ట్ అవెయిటింగ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ ఆఫ్‌ది ఇయర్ 'వార్2'ను ఆగస్టు 14, 2025న ఐమాక్స్ థియేటర్లలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ఉత్తర అమెరికా, మిడిల్ ఈస్ట్, యుకె, యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, సౌత్‌ఈస్ట్ ఆసియా సహా భారతదేశంలో ఐమాక్స్ థియేటర్లలో విడుదల కానుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులకు నెక్స్ట్ లెవల్లో ఓ అద్భుతమైన ఎక్స్‌పీరియెన్స్‌ను ఈ చిత్రం అందించనుంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వార్ 2 చిత్రం లేటెస్ట్‌గా రూపొందిన భారతదేశపు అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ఫిలిం ఫ్రాంఛైజీలలో ఒకటి. పఠాన్, టైగర్ 3, వంటి వైఆర్ఎఫ్ బ్లాక్‌బస్టర్‌ల తర్వాత రాబోతున్న కొత్త మూవీ ఇది. 2023లో విడుదలైన పఠాన్ భారతీయ బాక్సాఫీసులో అత్యధిక ... కలెక్షన్లలో ఒకటిగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇది ఈ స్పై యూనివర్స్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ ఏంటో తెలియజేస్తోంది. వార్ 2కి సంబంధించి వైఆర్ఎఫ్ సంస్థ వార్ 2 రిలీజ్‌కు ఇంకా 50 రోజులు మాత్రమే ఉందని తెలియజేసే సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్, కియారా అద్వానీల పోస్టర్లను నిర్మాణ సంస్థ విడుదల చేసింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్ వైస్ ప్రెసిడెంట్ నెల్సన్ డిసౌజా ఈ సందర్భంగా మాట్లాడుతూ, యశ్ రాజ్ ఫిలింస్‌గా భారతీయ సినిమాను ప్రపంచ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం. వార్ 2 అనేది స్పై యూనివర్స్‌లో ఒక ముఖ్యమైన భాగం. ఇండియన్ సినిమాలో ఇద్దరు బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య జరిగే ఈ అద్భుతమైన తలపోరును ఐమాక్స్ ఫార్మాట్‌లో ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులకు, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతిని అందించగలగుతాం అన్నారు.

ఐమాక్స్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టఫర్ టిల్మాన్ మాట్లాడుతూ, 'వార్2 అనే ఈ భారీ ఇండియన్ యాక్షన్ చిత్రాన్ని గ్లోబల్ ఐమాక్స్‌శ్రీ థియేటర్లకు తీసుకురావడం మాకు ఆనందంగా ఉంది. ఈ ఏడాదిలో అతి పెద్ద ఇండియన్ బిగ్గెస్ట్ ఫిల్మ్ కోసం యశ్‌రాజ్ ఫిల్మ్స్, ఆదిత్య చోప్రాతో చేతులు కలపటం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు అయ్యన్ ముఖర్జీ రూపొందిస్తున్న ఈ సినిమా యాక్షన్ సినిమాకే ఓ పాఠంలా ఉంటుంది. హృతిక్, ఎన్టీఆర్ మధ్య యాక్షన్ సన్నివేశాలు, వారి అద్భుతమైన పెర్ఫామెన్స్‌లు గూజ్ బంప్స్ తెప్పిస్తాయి. ఇలాంటి తిరుగులేని, మరచిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఐమ్యాక్స్‌లో మాత్రమే పొందగలరు" అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్, వావ్ అనిపించే యాక్షన్ సీక్వెన్స్‌లతో కూడిన వార్2 ను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించాడు. అతి పెద్దగా ఉండే ఐమ్యాక్స్ స్క్రీన్ ఎక్స్‌పీరియెన్స్, ఆకట్టుకునే సౌండింగ్‌తో సినిమాను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఇప్పటికే వార్ 2ఐమాక్స్. టీజర్ ప్రదర్శన మొదలైంది. పూర్తి చిత్రం ఆగస్టు 14, 2025న ఐమాక్స్‌లో మాత్రమే విడుదల అవుతుంది.



## 'కూలీ' తెలుగు రైట్స్ సొంతం చేసుకున్న ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

**సూపర్ స్టార్ రజనీకాంత్** మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'కూలీకి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సియు)తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేర తో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నారు.

తాజాగా డి. సురేష్ బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఇది ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న మ్యాసీవ్ హైప్‌ను సూచిస్తోంది. ...చిత్రాలన్నీ గతంలో బ్లాక్ బస్టర్ విజయాలు సాధించిన నేపథ్యంలో హక్కుల కోసం గట్టి పోటీ ఏర్పడింది.



రజనీకాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. తాజాగా విడుదలైన మాస్ సాంగ్ 'చికిటు అదరగొట్టింది. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించిన ఈ పాటలో ఆయన స్వరాలతో పాటు అరివు కూడా పాటను హై ఎనర్జీగా పాడారు. పాటలో టి. రాజేందర్ సౌండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ డాన్స్, విజువల్స్ ఫ్యాన్స్‌కు ఫుల్ ఫీస్ట్‌లా ఉన్నాయి.

## జూలై 4న సూర్య సేతుపతి 'ఫీనిక్స్' రిలీజ్

**ప్రముఖ స్టంట్ మాస్టర్** అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఫీనిక్స్ చిత్రం, యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను మిళితం చేస్తూ, కొత్త హీరోకి సరైన లాంచింగ్ మూవీగా వుండబోతోంది. ఈ సినిమాకి సామ్ సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా, వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కెఎల్ ఎడిటర్. టెక్నికల్ క్రూ బలంగా ఉండటంతో, ఫీనిక్స్‌పై అంచనాలు పెరిగాయి. ఇది సూర్య సేతుపతి పూర్తి స్థాయిలో హీరోగా నటిస్తున్న తొలి చిత్రం కాగా, గతంలో నానుమ్ రౌడీ ధాన్, సింధుబాద్ వంటి చిత్రాల్లో స్మాల్ రోల్స్‌లో కనిపించాడు. ఫీనిక్స్‌తో హీరోగా డెబ్యు చేస్తున్నారు. ఈరోజు విడుదలైన రెండవ సింగిల్ "ఇంధ వంగికో", సామ్ సిఎస్ స్వరపరిచిన పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ, వెల్‌రాజ్ అందించిన కలర్ ఫుల్ విజువల్స్, సూర్యసేతుపతి ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో పాట సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ సేతుపతి స్వయంగా ఈ పాటను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఇది అభిమానుల్లో మరింత ఆసక్తిని కలిగించింది.



## ఎస్‌జె సూర్య పాన్ ఇండియా మూవీ టైటిల్ 'కిల్లర్'

**మల్టీ టాలెంటెడ్** సూపర్‌స్టార్ ఎస్‌జె సూర్య పది ఏళ్ల విరామం తర్వాత మళ్లీ దర్శకునిగా రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం టైటిల్ 'కిల్లర్'. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఎస్‌జె సూర్య హీరోగానే కాకుండా, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రం ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్ (గోకులం గోపాలన్ నేతృత్వంలో) ఎస్‌జె సూర్యా సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, మలయాళ, కన్నడ తదితర భాషలలో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గోకులం మూవీస్, ఈ సినిమాతో తమిళ సినీ రంగంలో కంబ్యాక్ ఇస్తోంది.

ఈ చిత్రానికి సహ నిర్మాతలు వి.సి. ప్రవీణ్, బైజు గోపాలన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కృష్ణమూర్తి వ్యవహరిస్తున్నారు. 'వాలి', 'ఖుషీ' 'న్యూ' వంటి క్లాసిక్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్‌జె సూర్య, ఈ సినిమాకు స్టార్ స్టడెడ్ తారాగణాన్ని తీసుకొస్తున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఐదు భాషలలో విడుదల కానుంది. ఇది ట్రూ పాన్ ఇండియా అనుభూతిని ఇవ్వనుంది. "కిల్లర్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే స్థాయి సినిమా ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. దేశవ్యాప్తంగా ప్రతిభ గల నటులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రంగా రూపొందించబోతున్నాం" అని నిర్మాతలు తెలిపారు. త్వరలోనే ఈ చిత్ర తారాగణం, సాంకేతిక బృందం కథా నేపథ్యం వంటి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించనున్నారు.



## 'లవ్ జాతర' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

**అంకిత్ కొయ్య,** మానస చౌదరి హీరో హీరోయిన్లుగా యూజీ క్రియేషన్స్ బ్యానర్‌లో "సమ్మతమే" ఫేమ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి రూపొందిస్తున్న చిత్రానికి 'లవ్ జాతర' టైటిల్ ఖరారు చేశారు. ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ నిర్మిస్తున్న ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఈ రోజు రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే టైటిల్‌కు తగినట్లే కంప్లీట్ రోలర్ కోస్టర్ లవ్ ఎంటర్ టైనర్ గా "లవ్ జాతర్ణ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ అందిస్తుండగా..సుజాత సిద్దార్థ్ డీవోపీగా వ్యవహరిస్తున్నారు. "లవ్ జాతర్ణ కు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే మేకర్స్ ఇవ్వబోతున్నారు.

నటీనటులు : అంకిత్ కొయ్య, మానస చౌదరి, తదితరులు. టెక్నికల్ టీమ్: డీవోపీ సుజాత సిద్దార్థ్, మ్యూజిక్ చేతన్ భరద్వాజ్, బ్యానర్ యూజీ ప్రొడక్షన్స్, పీఆర్‌ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), మార్కెటింగ్ హౌస్ ఫుల్, ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ, రచన, దర్శకత్వం గోపీనాథ్ రెడ్డి .



## సోషియోఫాంటసీగా 'దీర్ఘాయుష్మాన్ భవ'

**ఇప్పటివరకు వచ్చిన** ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా సోషియో ఫాంటసీ ప్రేమకథతో సినిమాగా 'దీర్ఘాయుష్మాన్ భవ్ణ చిత్రాన్ని తెరకెక్కించారు. కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లు. ఎం.పూర్ణానంద్ దర్శకత్వం వహించారు. త్రిపుర క్రియేషన్స్ పతాకంపై వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని జులై 11న విడుదల చేయబోతున్నట్లు నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ తెలిపారు. చక్కటి ఫ్యామిలీ కథాశంతో రెండున్నర గంటలపాటు ప్రేక్షకులను అలరింపజేసే వినోదంతో ఈ చిత్రాన్ని మలచడం జరిగిందని ఆయన చెప్పారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యం ఇచ్చాం. ఏ పాటకు ఆ పాట ఆహ్లాదభరితంగా ఉంటుందని అన్నారు. యూత్‌తో పాటు అన్ని వర్గాల



ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని చెప్పారు. దర్శకుడు ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని పాత్రలలో ఎవరికి వారు పోటీపడి నటించారు. జబర్దస్త్ ఆర్టిస్టుల కామెడీ ఆద్యంతం నవ్వుల పూలు పూయిస్తుంది. హీరో, హీరోయిన్లు తమ పాత్రలలో ఒదిగిపోయారు. సీనియర్ నటి ఆమని నటన ఓ హైలైట్. మొత్తం మీద ఓ మంచి చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకుడికి కలుగుతుంది. ఆ విషయంలో మా టీమ్ సక్సెస్ అయినట్లు నమ్మకంగా చెప్పగల్లం అని అన్నారు.

## 'ఓ భామ అయ్యో రామ' నుంచి లిరికల్ వీడియో సాంగ్ విడుదల

**సినిమా సినిమాకు** డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం నుంచి తాజాగా 'గల్లి స్టెప్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'ఓ మెరుపులా చిందులే వేయారా' అంటూ కొనసాగే ఈ పాటను కథానాయకుడు సుహాస్ ఆలపించడం విశేషం. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటకు సంగీత దర్శకుడు రథన్ స్వరాలు అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ సుహాస్ ఆలపించిన ఈ మాస్ సాంగ్ నేటి ట్రెండ్‌కు తగిన విధంగా ఉంటుంది. ప్రతి గల్లిలో తీన్‌మార్ సాంగ్‌లా ఈ సాంగ్ సన్సేషన్ క్రియేట్ చేస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. క్యూట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ నిర్మాత హరీష్ కథ చెప్పగానే క్వాలిటీగా తీద్దామని చెప్పాడు. ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ ప్రొడక్ట్ క్వాలిటీగా రావడానికి ఆయనే కారణం. మణికందన్ ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు.





## ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పివిదే : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారత రత్న పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు.ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పి.వి. నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు.నాడు పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారన్నారు. పీవీ స్ఫూర్తితో రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి గుమ్మడి వెన్నెల

## దివ్యాంగులను సాంస్కృతికోత్సవాల్లో భాగస్వామ్యం చేస్తాం

### రాష్ట్ర సాంస్కృతిక సారథి గుమ్మడి వెన్నెల

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే సాంస్కృతికోత్సవాల్లో దివ్యాంగులను భాగస్వామ్యం చేస్తామని తెలంగాణ సాంస్కృతిక సారథి గుమ్మడి వెన్నెల అన్నారు. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలు సంయుక్తంగా హెలెన్ కెల్లర్ 145వ జయంతి సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాలు తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ఘనంగా జరిగాయి. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 30 మంది విద్యార్థులకు రామిజాబీ మెమోరియల్ అవార్డులు ప్రదానం చేసిన అనంతరం గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని అన్నారు. సాంస్కృతిక శాఖ ద్వారా దివ్యాంగులకు అవసరమైన సహాయం చేస్తామని అన్నారు. ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దివ్యాంగుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వలన ప్రజలకు ఒరిగిందేమి లేదని అన్నారు. యుద్ధాల వలన దివ్యాంగులు పెరిగిపోతున్నారని అన్నారు.

## రాష్ట్రంలో యువతకు డ్రగ్స్ అలవాటు చేసింది కెటిఆరే

### పిసిసి జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం ఆరోపణ

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలో యువతకు డ్రగ్స్ అలవాటు చేసింది కెటిఆరే అని పిసిసి జనరల్ సెక్రటరీ గజ్జల కాంతం ఆరోపించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ డ్రగ్స్ సృష్టి కర్తే కేటీఆర్ అని ఆయన సిద్ధాంతీకరించారు. తెలంగాణలో కెటిఆర్ డ్రగ్స్ కాంట్రాక్ట్ తీసుకొని పదేళ్లలో తెలంగాణకు పది వేల కోట్ల డ్రగ్స్ సరఫరా చేశారని విమర్శించారు. వెయ్యి మందిని పెట్టుకొని అన్ని మండలాలకు, గ్రామాలకు డ్రగ్స్ సరఫరా చేసిండని తెలిపారు. గ్రామాలలోని ఎస్సిల, ఎస్టీల కుటుంబాలను సర్వనాశనం చేసిన వ్యక్తి కెటిఆర్ అని ఆపాదించారు. యువత చాలామంది చనిపోయారని, కాలేజ్ యువతకు డ్రగ్స్, గంజాయ్ మత్తులో ఉంటున్నారని అన్నారు.

కరీంనగర్ ,ఆదిలాబాద్,నిజామాబాద్, రంగారెడ్డి జిల్లా కేంద్రాలలో 5వేల మందికి డ్రగ్స్ అలవాటు చేసి విచ్చల విడిగా దోపిడీ చేసిండు అని అన్నారు. ఒక వైపు గంజాయి అలవాటు చేసి ఇంకో వైపు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టిండు అన ఆవేదన చెందారు. కెటిఆర్‌కు అలవాటు ఉంది కొత్తగా సినిమా ఇండస్ట్రీకి వచ్చిన హీరో, హీరో యిన్లకు డ్రగ్స్ అలవాటు చేసి వినకపోతే కేసులు పెట్టిండని ఆరోపించారు. ఇతర దేశాల నుండి తెలంగాణ రాష్ట్రానికి డ్రగ్స్ ను తీసుకొచ్చిందే కేటిఆరే అని అన్నారు. 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో డ్రగ్స్ లేదు,అది ఏంటో ఎవరికి తెలియదు అని ఆయన అన్నారు. 2014 తర్వాత కేసీఆర్ ముఖ్య మంత్రి, కేటీఆర్ మంత్రి అయ్యాక డ్రగ్స్‌ను అలవాటు చేసిండు. కేసీఆర్‌కు తెలిసి కేటీఆర్‌కు డైరెక్షన్ ఇచ్చిండు. దేశంలో డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా కేటీఆర్ మార్చిండు. గంజాయ్, ఇసుక, దేన్ని కేటిఆర్ వదిలిపెట్టలేదని ఆరోపించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

## హెడ్‌మాస్టర్లను సొంత జిల్లాలకు బదలీ చేశాకే పోస్టులను భర్తీ చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో తొలుత గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు బదిలీలు చేపట్టిన తరువాతే ఖాళీగా ఉన్న 750 గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులలో స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టార్స్ అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టు మల్టిజోన్ స్థాయిలోకి చేర్చడం జరిగిందన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజ గంగా రెడ్డి, ఎస్.గిరధర్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ 2023-24లో స్కూల్ అసిస్టెంట్‌లకు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు వచ్చిన ప్పుడు కొన్ని వందలమంది ప్రధానోపాధ్యాయులుగా వారివారి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం లేకపోవడం వల్ల మల్టిజోన్ పరిధిలోని ఇతర జిల్లాల్లో పదవులు పొందడం జరిగిందన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులైన వారికి సొంత జిల్లాల్లో పనిచేసే అవకాశం కల్పించాలని,

దీని వల్ల ఎలాంటి ఆర్థిక భారం ఉండదని వారు తెలిపారు. ఈ సమావేశంలో అసోసి యేషన్ ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, కృష్ణాచారి, ప్రసూన, శైలజ, ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ నిందితులను ఎప్పుడు అరెస్టు చేస్తారు?

### నన్ను వదిలేసి అందరిని పిలుస్తున్నారు

### అన్నపూర్ణ క్యాంటీన్లను ఇందిరమ్మ క్యాంటీన్ పేరు మార్చడం దౌర్భాగ్యం: బిజెపి ఎంపి రఘునందన్‌రావు



**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ 18 నెలల పాలన తర్వాత తనను తాను సమీక్షించుకొని ప్రజలకు అందుబాటులో ఉండేటువంటి పనులు, ప్రజలకు ప్రామిస్ చేసినటువంటి ఎన్నికల హామీల గురించి మాట్లా డేందుకు ధైర్యం లేక ప్రజల అటెన్షన్‌ని డైవర్ట్ చేసేందుకు రోజుకో కొత్త పేరు, కొత్త కథతోటి వస్తుందని బిజెపి ఎంపి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమర్జెన్సీ వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిందని చెప్పి జూన్ 25వ తారీఖుని ఈ దేశమంతా ఎమర్జెన్సీని గుర్తు చేసు కొని, భారత రాజ్యాంగాన్ని కాలరాసినటువంటి చీకటి రోజులని గుర్తు చేసుకొని భవిష్యత్ తరాలకి తెలియజేసే కార్యక్రమాలు నడుస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఇంగిత జ్ఞానం పక్కన పెట్టి ఐదు రూపాయలకు అన్నం పెట్టే అన్నపూర్ణ క్యాంటీన్ల పేర్లను ఈ దేశంలో ఎమర్జెన్సీ తీసుకొచ్చిన ఇందిరమ్మ క్యాంటీన్ పేరుగా మార్చడం కాంగ్రెస్ పార్టీ దౌర్భాగ్యాన్ని, దిగజారుడుతనాన్ని తెలుపుతుందన్నారు. 18 నెలలుగా సాగుతున్న ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ వేసి, దానిపై విచారణ నడిపిస్తున్నామంటున్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొదలైంది దుబ్బాకలో ఉపఎన్నిక సమయంలో అప్పుడు పోలీసులు మా ఫోన్లు వింటున్నారని నేను అప్పటి డిజిపికి ఫిర్యాదు చేశాను, కానీ స్పందన లేదు. ఎన్నికల సమయంలో, గెలిచిన తర్వాత కూడా ఇచ్చాను. కానీ ఆ ఉత్తరాలు సిట్‌కి చేరలేదు. అప్పుడు ఉన్న డిజి, చీఫ్ సెక్రెటరీ, స్పెషల్ సెక్రెటరీలను పిలిచారు. ప్రభాకర్ రావును పట్టుకొచ్చినట్టు చెప్పి మిగతా వారిని పట్టుకుంటామని చెబుతున్నారు తప్పితే విచారణ పూర్తి చేసింది లేదన్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ బాధితుడు నేను. కానీ నన్ను వదిలేసి, పిసిసి ప్రెసిడెంట్‌ను పిలుస్తున్నారంటూ మండిపడ్డారు. మీరు వేయాలనుకుంటున్నది కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ అనే పంచాయితీ చేయదు మేనా? అని ప్రశ్నించారు.ఇంకెప్పుడు నిందితులను అరెస్ట్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. 100 శాతం అప్పటి చీఫ్ సెక్రెటరీ చెప్పినట్లుగా ఆ 615 మందిని విచారించాలని డిమాండ్ చేశారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 29వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నిజామాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. పసుపు రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కలగడం కోసం, వారు పండిస్తున్నటువంటి పంటకు ధర రెట్టింపు అవ్వడం కోసం, అలాగే పసుపు ప్రాసెసింగ్ యూనిట్స్ ద్వారా అనేక రకాల బైప్రొడక్ట్స్ తయారు చేసి అంతర్జాతీయంగా కూడా మార్కెటింగ్ చేసుకునే విధంగా రైతులకు మేలు చేసే విధంగా నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డును ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణలో 2014 నుండి 2025 వరకు కేంద్రంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం దాదాపు లక్షల కోట్ల రూపాయలను తెలంగాణ వ్యవసాయ రంగానికి ఖర్చు చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 14 పంటలపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ మూడే పంటలకు మాత్రమే బోనస్ ప్రకటించి, వాటిలో సగం మంది రైతులకే ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి ఒక్క ఎకరానికి రూ. 18000 సబ్సిడీ మీద ఎరువులు ఇస్తుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులపై అదనపు భారం మోపుతూ ఒక్కొక్క బస్తాకు రూ.25 రవాణా ఛార్జీ కట్టాలంటుందన్నారు. పంట నష్ట పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## డాక్టర్ భూమ్‌రెడ్డికి పద్మశ్రీ ఇవ్వాలి

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లాలో శుక్రవారం ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత పర్యటించి, పలువురిని పరామర్శించారు. జాగృతి నాయకుడు జాడి శ్రీనివాస్ నివాసానికి వెళ్లారు. అనంతరం ఇటీవలే మరణించిన డాక్టర్ భూమ్‌రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన గండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. బిసి సంఘాల్లో చాలా చురుకుగా సంపత్ పాల్గొన్నారని, వారి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. అదేవిధంగా ఇటీవలే మరణించిన డాక్టర్ భూమ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణలోనే మొట్టమొదటి జనరల్‌సర్జన్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ భూంరెడ్డికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దేశ తొలిప్రధాని నెహ్రూకు ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స చేసిన డాక్టర్ భూమ్‌రెడ్డి విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా వదులుకొని కరీంనగర్‌లో వైద్యసేవలు అందించారని గుర్తు చేశారు. కవిత వెంట జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత, బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, జాగృతి నాయకులు జాడి శ్రీనివాస్, తానిపర్తి తిరుపతిరావు, పొన్నం అనిల్ గౌడ్, బిసి సంఘం నాయకులు వారాల శ్రీనివాస్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యం యాదవ్ తదితరులు ఉన్నారు.

## ఆర్అండ్‌బి 64 డిప్యూటీ ఇఇలకు ఇన్‌చార్జీ ఇఇగా బాధ్యతలు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలశాఖలో ఖాళీగా ఉన్న 64 కార్యనిర్వాహక ఇంజినీరు పోస్టులను ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లను ఇంచార్జీలుగా నియమిస్తూ ఆర్అండ్‌బి పూర్తి అదనపు బాధ్యతలు కలిగిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.తెలంగాణలో 7947 కిమీ నిడివి కలిగిన రోడ్లను హైబ్రీడ్ అన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలుచేస్తున్నది దీనితో ఇఇ క్యాడర్ అధికారుల కొరత ఆర్ అండ్ బిలో ఇబ్బందికరంగా మారింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు నియామకం చేయకపోవడం, రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణలో రోడ్లు గుంతలమయం అయింది. గతపాలకులు అప్పులు చేయడంతో వాటి కిస్తీలు కట్టడం కు నిధులు పరిమితం కావడంతో ప్రైవేట్ పబ్లిక్ పార్టిసిపేషన్‌తో రోడ్లు వేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రోడ్లను మరమ్మతు చేయడానికి గుర్తించారు.

పంచాయతీరాజ్‌కు చెందిన 5190 కిమి రోడ్లు కూడా హామ్ పద్ధతిలో బాగు చేయబో తున్నారు. తొలుత 17వేల కి.మీ రోడ్లు బాగుచేయబోతున్నారు. వీటికి రూ.28వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రోడ్లకు సంబంధించి 40శాతం నిధులు ప్రభుత్వం సమకూర్చుతుంది.మిగితా కాంట్రాక్టు సంస్థ60శాతం రుణాల ద్వారా సమకూర్చుతుంది. ఈ రోడ్లపై ప్రయాణించే వాహనాలకు ఏలాంటి టోల్ వసూలు చేయమని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో హరీష్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానం ఆర్అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడంతో గ్రామీణ, జిల్లా మండల రహదారుల్లో ప్రయాణించేవారు ఆనందం వ్యక్తంచేశారు.

## అటవీశాఖ అధికారుల బాధ్యత మరింత పెరిగింది

### ఎఫ్ఆర్‌ఒల పాసింగ్ పెరేడ్‌లో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి సువర్ణ

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** అటవీ అధికారులు, ఉద్యోగుల బాధ్యత మరింత పెరిగిందని, విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహ రించాలని అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి సువర్ణ అన్నారు. శుక్రవారం దూలపల్లిలోని ఫారెస్టు అకాడమిలో జరిగిన అటవీశాఖ క్షేత్రాధికారులుగా (ఎఫ్ఆర్‌వో) ఎంపికై, 18 నెలలు శిక్షణను ముగించుకున్న మహారాష్ట్రకు చెందిన 32మంది ఎఫ్ఆర్‌వో అధికారుల పాసింగ్‌అవుట్ పెరేడ్ ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్య క్రమంలో ఆమె మాట్లాడుతూ..పర్యావరణ మార్పులు,అడవులపై ఒత్తిడి కారణంగా ఫారెస్టు అధికారులపై ఒత్తిడి పెరిగిందని, ఇటువంటి సమయం లోనే అధికారులు మరింత సమర్ధవంతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ డా. ఎస్ జే ఆశా (ఐఎఫ్ ఎస్), కోర్స్ డైరెక్టర్ ప్రవీణ (ఐఎఫ్ఎస్) ఇతర అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ అటవీ శాఖలో శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సమస్యలను సమర్థ వంతంగా 32మంది అధికారులతో కూడిన 10వ బ్యాచ్ అటవీ క్షేత్రస్థాయి అధికారుల 18 నెలల శిక్షణా కార్యక్రమం 2023 డిసెంబర్ 28న ప్రారంభమై శుక్రవారంతో ముగిసింది. అడవుల్లో విధులు, ఎదురయ్యే సవాళ్లు, రక్షణ, సంబంధిత అంశాలపై ఈ శిక్షణ ఉంటుంది. దీనిలో భాగంగా వెపన్ ట్రైనింగ్, సర్వే ట్రైనింగ్‌లపై ప్రత్యేక శిక్షణ ఫారెస్ట్ అకాడెమీలో ఇచ్చారు. శిక్షణ ముగింపులో జరిగిన పరీక్షలలో శుభం దశరథ్ ఇంగాలే, ప్రాచీ అనిల్ ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు, క్రీడల్లోనూ ప్రతిభ చూపి ఓవరాల్ ఆల్ రౌండర్‌గా మనీషా క్రాంతిలాల్ నిలిచారు.

## రాష్ట్రవ్యాప్తంగా మినీగోదాముల నిర్మాణం

### నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు

### ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం మహిళా సంఘాలు, రైతుల కోసం అదిరిపోయే శుభవార్త చెప్పింది! పంట చేతికి వచ్చినా సరైన ధర కోసం ఎదురు చూసే అన్నదాతల కోసం రాష్ట్రవ్యాప్తంగా మినీ గోదాములు నిర్మించనుంది. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయిస్తూ, నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనుంది. తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్.. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం కోసం కీలక చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా మహిళలు, అన్నదాతల అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసకుంటుంది. ఇప్పటికే మహిళా సంఘాల కోసంరూ. 10 లక్షల బీమా, వారి చేత పెట్రోల్ బంకులుతెరిపించడం వంటి నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వర్ ఇప్పుడు వారికి మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమైంది.మహిళా సంఘాలకు, అన్నదాతలకు ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకుంది.దీనిలో భాగంగా మహిళాసంఘాలకు రూ.15 లక్షల లబ్ధి కలిగించేందుకు ముందుకు వచ్చింది.పంట చేతికొచ్చిన తర్వాత. మంచి ధరవచ్చే వరకుఆగి అమ్ముకుందామనుకునే అన్నదాతలకు గోదాముల కొరత తీవ్ర సమస్యగా మారింది.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంకీలక నిర్ణయం తీసుకుంది.రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మినీ గోదాములు నిర్మించడానికి చర్యలు ప్రారంభించింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో వీటి నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తోంది.దీనిలో భాగంగా ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించేందుకు రేవంత్ సర్కార్ ముందుకు వచ్చింది. అంతేకాకుండా గోదాముల నిర్వహణ బాధ్యతలను మహిళా రైతు సంఘాలు, మండల సమాఖ్యలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు మండలాల్లో గోడౌన్ల నిర్మాణం కోసం అనువైన ప్రాంతాల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో భూములు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ఒక్కో గోదాములో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం నిల్వచేయవచ్చు అనే దానిపై నాబ్ కిసాన్ సంస్థ.. అంచనాలు రెడీ చేస్తుంది. త్వర లోనే రాష్ట్రవ్యాప్తంగా గోదాముల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతుండటంతో అధికారులు దీనిపై చర్యలు వేగవంతం చేశారు.ఈ గోదాములు అందుబాటులోకి వస్తే.. రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవడమే కాక..వారి ఆశించిన ధరలు వచ్చినప్పుడు పంటలను అమ్ముకోవచ్చు. ఈ గోదాముల నిర్మాణం, నిర్వహణను సెర్ప్ పర్యవేక్షించనున్నది. అలానే వీటి నిర్వహణపై మహిళా సంఘాలకు, సమాఖ్యలకు శిక్షణ అందించనుంది. మినీగోదాముల నిర్మాణానికి స్థలాలు గుర్తించిన మండలాల్లో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. మహిళా సంఘాలకు గోదాముల నిర్వహణ, బాధ్యతలు అప్పగించడం రాష్ట్ర చరిత్రలో ఇది ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో మినీ గోదాముల నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం

### మాజీ ఎంపి హనుమంతరావు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** లోకల్ బాడీ ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేస్తామని మాజీ ఎంపి హనుమంతరావు ప్రకటించారు.శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ ఇందిరా గాంధీ బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తేదని ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చాక బీజేపీ నాయకులు ఎమర్జెన్సీ అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఎమర్జెన్సీ డ్రామాలు బంద్ చేయాలని బిజెపిని హెచ్చరించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని హైకోర్టులో కేసు ఉన్నందున ఎన్నికలు ఆపామన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సిఎం రేవంత్‌రెడ్డి చేసిన కులగణన దేశంలో తెలంగాణ దిక్సూచిగా నిలిపారు.

పూర్వం భార్యలు.. భర్తలను కాపాడాలని దేవుళ్లను వేడుకునే వారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. కానీ ఇప్పుడు భార్యలే భర్తలను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నంబర్‌వన్ సిటీ కావాలంటే ఇలాంటి చెడు సంప్రదాయం దూరం చేయాలని ఆయన అన్నారు. భార్యాభర్తలు కలిసి జీవించాలని, భార్యలు భర్తపై ప్రేమ చూపించాలని, అలాగే పిల్లలు తల్లిదండ్రులపై ప్రేమ చూపించాలని అప్పుడే ఫ్యామిలీ బాగుంటుందని చెప్పారు. లవ్ ఎఫైర్స్ పక్కన పెట్టాలి.. ప్రేమ ఉంటే పెళ్లి చేసుకోండి కానీ, తల్లిదండ్రులను చంపకండి, భర్తలను చంపకండి.. అని విహెచ్ ఉద్బోధించారు. హైటెక్ సిటీలో ఏదైతే జరుగుతుందో దానిపై నేను మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖ రాస్తానని విహెచ్ స్పష్టం చేశారు.

## ఎంబిసి యువతకు నైపుణ్య శిక్షణ

### నేటి నుంచి జూలై 12 వరకు దరఖాస్తులు స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన యువతకు నైపుణ్య శిక్షణను ఇవ్వనున్నారు. తెలంగాణ ఎంబిసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో ఈ నైపుణ్యాల శిక్షణను ఇవ్వ నున్నట్టు ఎంబిసిడి కార్పొరేషన్ సిఇఒ కె అలోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీసీ నిరుద్యోగ యువతీయువకులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించడానికి హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ నాలుగు రోజులపాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ట్రావెలింగ్ అలవెన్స్‌తోపాటు భోజన, వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులు 21 నుండి 30 సంవత్సరాల వారు అర్హులని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని.. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం అది కూడా ఎంబిసిలోని 36 కులాలకు చెందిన వారే అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించారు. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షల వరకు, పట్టణ ప్రాం తంలో రూ.2 లక్షల వరకు వార్షికాదాయం కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తులను నేటి(జూన్ 28) నుంచి జూలై 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని.. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను జతపరిచి వారివారి జిల్లాలోని జిల్లా బిసి అభివృద్ధి అధికారికి జూలై 14 సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.



నాంపల్లిలోని టిజిపిఎస్సీ కార్యాలయం వద్ద పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

## పోస్టింగ్‌ల జాబితా ప్రకటించాలి

### గ్రూప్-2 అభ్యర్థుల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** మెడికల్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేసి, పోస్టింగ్స్ లిస్ట్ ప్రకటించాలని గ్రూప్ 2కి సెలెక్ట్ అయిన అభ్యర్థులు టిజిపిఎస్సి, గాంధీభవన్‌లో వినతిపత్రాలు సమర్పించారు. 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, 2024లో పరీక్ష నిర్వహించి, 2025 మార్చిలో ఫలితాలు ప్రకటించారని, అయితే ఇంత వరకు మెడికల్ వెరిఫికేషన్ పూరినతచేసి పోస్టింగ్ జాబిత ప్రకటించలేదని ఈ సందర్భంగా అభ్యర్థులు పేర్కొన్నారు. నోటిఫికేషన్ నాటి నుండి మూడు సంవత్సరాలు గడుస్తున్నా గ్రూప్ 2 ప్రక్రియ పూర్తి కాలేదదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వస్తే మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా తదుపరి ప్రక్రియ పూర్తి చేసి అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వాలని అభ్యర్థులు ప్రభుత్వానికి, టిజిపిఎస్సీకి విజ్ఞప్తి చేశారు.

## బాలుడిని బలిగొన్న టిప్పర్

### తల్లి ఎదుటే మృత్యు ఒడిలోకి..

**హైదరాబాద్ (దుండిగల్), జూన్ 27, ప్రభాతవార్త:** పద అమ్మ.. ఆలస్యం అవుతుందంటూ ఆ బాబు తల్లి స్కూటీపై పాఠశాలకు బయలుదేరాడు. ఇంకా సేపట్లో పాఠశాలలోకి చేరుతారనేలోగా మృత్యువు టిప్పర్ రూపంలో దూసుకు వచ్చింది. నిర్లక్ష్యంతోపాటు అతివేగంగా దూసుకువచ్చిన టిప్పర్ వెనుక నుండి వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. దీంతో అప్పటి వరకు తల్లిని పట్టుకొని ఉన్న ఆ బాలుడు ఎగిరి టిప్పర్ టైర్ల కిందపడి నలిగిపోయాడు. చూస్తుండగానే తల్లి ఎదుటే మృత్యు ఒడిలోకి చేరాడు. ఈ హృదయ విదారకమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ప్రాంతానికి చెందిన రాజు దంపతులు దుండిగల్ పురపాలిక పరిధి మల్లంపేటలోని ఆకాష్ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అభిమన్యు (6) స్థానికంగా ఉన్న గీతాంజలి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు తల్లి ద్విచక్రవాహనంపై కొడుకు అభిమన్యుని తీసుకొని పాఠశాలకు బయలుదేరారు. ఒఆర్ఆర్ సమీపంలోని పల్లవి పాఠ శాల సమీపంలోకి చేరుకోగానే వెనుక నుండి దూసుకువచ్చిన టిప్పర్ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి వెనకాల కూర్చున్న బాలుడు ఎగిరి టిప్పర్ వెనక చక్రాల కిందపడి నలిగిపోయాడు. తల్లికి గాయాల య్యాయి. ఈ హఠాత్పరిణామం నుండి తల్లి తేరుకునేలోపే బాలుడు మృత్యు ఒడిలోకి చేరిపోయాడు.



అభిమన్యు(ఫైల్)

# టీమిండియాకు ప్లానింగ్ లోపం



## ఫీల్డింగ్ నుండి లోయర్ ఆర్డర్ వరకూ వైఫల్యం

## రెండో టెస్టుకు టీమిండియా గట్టెక్కేనా?

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. ఈ మ్యాచ్‌లో ఐదు సెంచరీలు చేసినప్పటికీ విజయం దక్కలేదు. చిన్న చిన్న పొరపాట్లతో భారీ మల్యం చెల్లించాల్సి వచ్చింది. భారత్ ఓటమికి ప్రధాన కారణాల్లో ఫీల్డింగ్ లోపాలు ఒకటి. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ వదిలిపెట్టిన క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాన్ని మార్చేశాయి. బెన్ డకెట్ తొలి, రెండో ఇన్నింగ్స్‌లోను జైస్వాల్ క్యాచ్‌లు మిస్ చేశాడు. దీంతో క్రీజులో ఎక్కువ సేపు ఉండి ఇంగ్లాండ్‌కు సూపర్ నాక్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లో 97 పరుగుల వద్ద వదిలిన క్యాచ్ తర్వాత డకెట్ మరో 51 పరుగులు చేశాడు. ఆరంభంలోనే బెన్ డకెట్ ఇచ్చిన క్యాచ్‌లను బుమ్రా, రిషబ్ పంత్‌లు కూడా వదిలేసారు. మొదటి ఇన్నింగ్స్‌లో 5 క్యాచ్‌లు వదిలేశారు. రెండోఇన్నింగ్స్‌లోకూడా అదే సంఖ్యలో క్యాచ్‌లు మిస్‌చేశారు. ఇక లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ మరీ దారుణంగా ఉంది. భారత బ్యాటింగ్ మొదటి ఇన్నింగ్స్‌లో 430/3 పరుగులతో బలమైన స్థితిలో ఉండి 471 వద్ద ఆలౌటైంది. చివరి 7 వికెట్లు కేవలం 41 పరుగులకే కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. చివరి 6 వికెట్లు కేవలం 31 పరుగులకే పడిపోయాయి. రెండు ఇన్నింగ్స్‌లలో టెయిల్ ఎండ్ ఆటగాళ్లు పెద్దగా రాణించలేకపోయారు. ఒత్తిడి తట్టుకోలేక పోయారు. అలాగే భారత స్టార్ బౌలర్లు మ్యాచ్ చివరిరోజు తమ సామర్థ్యాన్ని చూపలేక బౌలింగ్‌లో తేలిపోయారు. జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్ వంటివారు డకెట్-క్రాలీ భాగస్వామ్యాన్ని ఛేదించడంలో విఫలమయ్యారు. డకెట్ 149 పరుగులతో ఆడగా, క్రాలీ 65 పరుగులు చేశాడు. మైదానం మారుతున్న సమయంలో బంతికి స్పిన్, బౌన్స్ తగ్గిపోవడం కూడా బౌలర్లకు అనుకూలించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా 5 వికెట్లు తీసుకుని పర్వాలేదనిపించినా అప్పటికే ఇంగ్లాండ్ బిగ్ స్కోర్ మార్కును దాటింది. మిగతా బౌలర్లు రాణించలేకపోయారు. రెండో ఇన్నింగ్స్‌లో అయితే, మొత్తంగా బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. కాగా భారత్ టీం ఒత్తిడిని జయించలేక పోయింది. 371 పరుగుల లక్ష్యాన్ని డిఫెండ్ చేయడం ఓ సవాల్ అయినా, బౌలింగ్ యూనిట్ చివరి రోజు భారత్ పూర్తిగా ఒత్తిడిలో పడిపోయింది. బ్యాటింగ్‌లో సెంచరీలు చేసిన జట్టుకు, విజయం వైపు దూకుడుగా వెళ్లే ఆత్మవిశ్వాసం కనిపించలేదు. ఫీల్డింగ్‌లో జరిగిన చిన్నచిన్న తప్పిదాలు మ్యాచ్‌పై ప్రభావం చూపాయి. ఇంగ్లాండ్ బ్యాటింగ్ సమయంలో భారత ప్లేయర్లలో ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా బౌలర్లు వికెట్లు పడకపోవడంతో ఇది స్పష్టంగా కనిపించింది. ఇది ఫీల్డింగ్‌పై కూడా ప్రభావం చూపించింది.

## యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్.. క్వార్టర్ ఫైనల్స్‌కు ఆయుష్, తన్వి




**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్-2025లో భారత మహిళల, పురుషుల యువ షట్లర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. అమెరికాలోని అయోవాకు చెందిన మిడ్-అమెరికా సెంటర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి మరియు తన్విశర్మ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఆయుష్ శెట్టి తన దేశస్థుడు తరుణ్ మన్నెపల్లిపై మూడు గేమ్‌ల (21-12, 13-21, 21-15) హోరాహోరీగా జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో విజయం సాధించగా, తన్వి థాయిలాండ్‌కు చెందిన పిచ్చమోన్ ఒపట్నిపుత్‌ను 21-18, 21-16 తేడాతో ఓడించింది. క్వార్టర్ ఫైనల్లో ఆయుష్ మాజీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ చైనీస్ తైపీకి చెందిన కువో కువాన్‌లిన్‌తో తలపడనున్నాడు. అలాగే మహిళల విభాగంలో మొదటి రౌండ్‌లోనే రెండో సీడ్ క్రీడాకారిణిని ఓడించిన 16 ఏళ్ల తన్వి, 2025లో తన తొలి వరల్డ్ టూర్ ఈవెంట్‌లో చివరి ఎనిమిది స్థానాలకు చేరుకోవడానికి ఉన్నత ర్యాంక్ ఉన్న క్రీడాకారిణిపై వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో తన్వి మలేషియాకు చెందిన కరుపతేవన్ లెత్సనాతో తలపడనుంది, ఆమె భారత్‌కు చెందిన ఆకర్షి కశ్యప్‌పై మూడు గేమ్‌లతో (21-17, 20-22, 21-13) విజయం సాధించి చివరి ఎనిమిది స్థానాల్లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో, భారత యువ ద్వయం హరిహరన్ అంసకరుణన్-రూబన్ కుమార్ రెంథినసబాపతి కెనడా జోడీ లై-యాకురాపై వరుస గేమ్ (21-10, 21-17) విజయం సాధించారు. ఇంతలో, ఇతర యువ భారత మహిళా సింగిల్స్ క్రీడాకారిణులు, అన్మోల్ ఖర్బ్ మరియు ఇరా శర్మ, డానిష్ మరియు ఉక్రేనియన్ ప్రత్యర్థుల చేతిలో తమ తమ మ్యాచ్‌ల్లో ఓడిపోయి రెండవ రౌండ్‌లోనే పోటీ నుండి నిష్క్రమించారు.

## ఓటమి దిశగా బంగ్లాదేశ్

### రెండో ఇన్నింగ్స్‌లో 96 రన్స్‌తో శ్రీలంక ఆధిక్యం



**న్యూఢిల్లీ:** రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి దిశగా సాగుతోంది. మూడోరోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి బంగ్లా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేసింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ స్కోరుకు బంగ్లాదేశ్ ఇంకా 96 పరుగులు వెనకబడి ఉంది. లిట్టన్ దాస్ (13) క్రీజులో ఉన్నాడు. లంక బౌలర్లు ధనంజయ డిసిల్వ (4-1-13-2), ప్రభాత్ జయసూర్య (15-2-47-2), తిరిందు రత్నాయకే (2.4-0-10-1), అశిత ఫెర్నాండో (8-1-22-1) చెలరేగడంతో బంగ్లా జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో పేకమేడలా కూలుతోంది. ఆ జట్టు ఆటగాళ్లు ఒక్కరు కూడా క్రీజ్‌లో కుదురుగా నిలబడలేకపోయారు. ఇప్పటి వరకూ ఔటైన 6 గురు రెండంకెల స్కోర్లు మాత్రమే చేయగలిగారు కానీ భారీ స్కోర్ చేయలేకపోయారు. షద్మాన్ ఇస్లాం 12, అనాముల్ హక్ 19, మొమినుల్ హక్ 15, నజ్ముల్ షాంటో 19, ముష్ఫికరల్ రహీం 26, మెహిది హసన్ 11 పరుగులకు ఔటయ్యారు. 290/2 స్కోర్ వద్ద శుక్రవారం ఆటను ప్రారంభించిన శ్రీలంక మరో 168 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ నిస్సంక తన సెంచరీకి మరో 12 పరుగులు జోడించి 158 పరుగుల వద్ద ఔటయ్యాడు. మరో ఓవర్‌నైట్ బ్యాటర్ జయసూర్య తన వ్యక్తిగత స్కోరుకు మరో 5 పరుగులు జోడించి ఔటయ్యాడు, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (84) సెంచరీకి చేరువై ఔట్ కాగా, కమిందు మెండిస్ (33) ఓ మోస్తరు స్కోరు చేశాడు. అంతకు ముందు దినేష్ చండిమల్ (93) తృటిలో సెంచరీ మిస్ కాగా, లహీరు ఉదార 40 పరుగులు చేశాడు. మొత్తంగా శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 458 పరుగులకు ఆలౌట్ అయింది. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం 5, నయిమ్ హసన్ 3, నహిద్ రాణా ఒక వికెట్ పడగొట్టారు. అంతకు ముందు బాంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌట్ అయింది.



అనిష్ భన్వాలా


నర్మద నితిన్

## త్రిశూల్ షూటింగ్ రేంజ్‌లో.. భారత్ షూటర్ల విజయం

### అగ్రస్థానంలో అనిష్, నర్మద

**న్యూఢిల్లీ:** త్రిశూల్ షూటింగ్ రేంజ్‌లో భారత్ షూటర్లు అనిష్ భన్వాలా, మహిళల విభాగంలో నర్మద నితిన్ విజయం సాధించారు. డెహ్రాడూన్‌లోని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలోని త్రిశూల్ షూటింగ్ రేంజ్‌లో శుక్రవారం జరిగిన 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ పురుషుల జాతీయ సెలక్షన్ ట్రయల్4లో ఒలింపియన్ అనిష్ భన్వాలా వరుసగా రెండోసారి విజయం సాధించాడు. ఫైనల్స్‌లో అనిష్ 30 పాయింట్లు సాధించాడు, ఇండియన్ నేవీకి చెందిన ప్రదీప్ సింగ్ షెకావత్ రెండవ స్థానంలో నిలిచాడు, అతని రాష్ట్ర సహచరుడు ఆదర్శ్ సింగ్ 23 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచాడు. అంతకుముందు, అనిష్ స్టేజ్ 1లో 291 పాయింట్లు సాధించి మొత్తం 584-20 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించిన తర్వాత, క్వాలిఫికేషన్ స్టేజ్ 2లో 293 పాయింట్లు జోడించాడు. ఆదర్శ్ 581-14 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచాడు, మన్దీప్ సింగ్ 579-16 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. భవేష్ షెకావత్ (577-10), ఉదయవీర్ సిద్ధు (576-15), మరియు ప్రదీప్ (574-22) అర్హత రౌండ్ నుండి మొదటి ఆరు స్థానాల్లో నిలిచారు. దీనితో, అనిష్, నీరజ్ కుమార్ మరియు ఆదర్శ్ 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ జాతీయ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచారు, సెప్టెంబర్‌లో చైనాలోని నింగ్బోలో జరిగే ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లు 2025 మరియు ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఇక మహిళల విభాగంలో ఎయిర్ రైఫిల్ ట్రయల్3లో నర్మద విజయం సాధించింది. మహిళల 10 మీటర్ల రైఫిల్ ట్రయల్స్‌లో నర్మద నితిన్ 253.7 స్కోరుతో ట్రయల్3లో అగ్రస్థానంలో నిలిచింది, సోనమ్ మస్కర్ 252 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచింది. రాజశ్రీ సాంచెటి 230 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచింది. అంతకుముందు, అర్హత రౌండ్‌లో మెహులి ఘోష్ 632.2 స్కోరుతో, సోనమ్ 632.1 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచారు. రాజశ్రీ 631.9 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు, శ్రేయ అగర్వాల్ (630.5), విదర్శ కె. వినోద్ (630.3), నర్మద (629.5), అయోనికా పాల్ (629.4), ధ్యానేశ్వరి పాటిల్ (629.3) టాప్ ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

## ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. ఛాంపియన్‌గా భారత్ మహిళా జట్టు

**న్యూఢిల్లీ:** ఆసియా ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫ్రీస్టైల్ పోటీలో భారత మహిళా రెజ్లింగ్ జట్టు ఓవరాల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. వియత్నాంలోని వుంగ్ టౌలో జరిగిన సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అండర్23 మహిళల రెజ్లింగ్ జట్టు విజయం సాధించిన తర్వాత, అండర్17 మహిళా రెజ్లర్లు కూడా అసాధారణమైన ధైర్యం, దృఢ సంకల్పం మరియు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. భారత్ మహిళల జట్టు వెయిట్ విభాగాలలో ఆధిపత్యం చెలాయించింది, మొత్తం 10 పతకాలు గెలుచుకుంది 5 స్వర్ణాలు, 3రజతాలు మరియు 2కాంస్యాలు, తద్వారా 215 పాయింట్లతో ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. చైనా 151 పాయింట్లతో రెండవ స్థానంలో ఉండగా, జపాన్ 149 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. భారత్ అండర్17 ఫ్రీస్టైల్ రెజ్లింగ్ జట్టు 3 స్వర్ణాలు, 2 కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. మొత్తం మీద మొదటి మూడు ర్యాంకింగ్‌లలో తృటిలో స్థానం కోల్పోయి జట్టు ట్రోఫీని గెలుచుకోలేకపోయినప్పటికీ, వ్యక్తిగత అథ్లెట్ల ప్రదర్శన, ముఖ్యంగా భారీ బరువు విభాగాలలో అసాధారణమైన ప్రదర్శన కనపరిచారు. 65 కిలోల విభాగంలో గౌరవ్ పునియా, 92 కిలోల విభాగంలో అర్జున్ రుహిల్, 110 కిలోల విభాగంలో లాకీ బంగారు పతకాలు గెలుచుకున్నారు.

# రుణాలకు పెరుగుతున్న డిమాండ్..

**ముంబై, జూన్ 27:** సాధారణంగా బ్యాంకుల వద్ద విద్యారుణం తీసుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తారు. మరికొందరు వ్యక్తిగత రుణాలను తీసుకుని, వాటిని చదువుకు ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు రకాల రుణాల మధ్య తేడాలేమిటి, రెండింటిలో ఏది మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం. విద్యారుణాలను చదువుకోవటానికి మాత్రమే మంజూరు చేస్తారు. వీటిని ఉపయోగించుకుని మన దేశంతో పాటు విదేశాల్లో కూడా చదువుకోవచ్చు. తక్కువ వడ్డీ రేటుతో పాటు రుణం తీర్చడానికి ఎక్కువ సమయం ఉంటుంది. విద్యార్థులు తమ చదువు పూర్తయిన తర్వాత, ఉద్యోగం చేరిన అనంతరం విద్యా రుణాన్ని చెల్లించడం మొదలుపెట్టవచ్చు. అయితే బ్యాంకుల నుంచి విద్యారుణం పొందటానికి వివిధ పత్రాలు చాలా అవసరం. అడ్మిషన్ నిర్ధారణ, కోర్సు ఫీజు షెడ్యూల్ తదితర సమగ్రమైన డాక్యుమెంట్లు సమర్పించాలి. అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాతనే రుణం మంజూరు చేస్తారు. పర్సనల్ రుణాలను వ్యక్తిగత ఖర్చులు, అవసరాల కోసం తీసుకుంటారు. వివాహం, ఇంటి నిర్మాణం, చదువు, వైద్యం.. ఇలా అన్ని అవసరాలకూ వీటిని వాడుకోవచ్చు. వ్యక్తిగత రుణాలను బ్యాంకులు త్వరగానే మంజూరు చేస్తాయి. కానీ వీటికి వడ్డీరేటు ఎక్కువ. మంచి క్రెడిట్ స్కోర్ ఉంటే ఒక్కరోజులోనే రుణం పొందే అవకాశం ఉంటుంది. ఈ రుణ వాయిదాలు చెల్లింపులకు సమయం ఉండదు. రుణం తీసుకున్న తర్వాత నెల నుంచే ఈఎంఐల రూపంలో కట్టడం ప్రారంభించాలి. విద్యా రుణాలు, వ్యక్తిగత రుణాల మధ్య తేడా ఏమిటంటే వాటి వడ్డీరేటు, చెల్లించే కాలపరిమితి అని చెప్పవచ్చు. విద్యారుణాలను సుమారు 15 ఏళ్ల వరకూ తక్కువ వడ్డీతో చెల్లించే అవకాశం ఉంటుంది. నెలవారీ వాయిదాలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. మరో వైపు వ్యక్తిగత రుణాలకు వడ్డీరేటు ఎక్కువ. సుమారు ఐదేళ్ల వరకూ మాత్రమే కాలవ్యవధి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టంలో సెక్షన్ 80ఇ ప్రకారం.. విద్యా రుణాలపై చెల్లించే వడ్డీకి మినహాయింపు లభిస్తుంది. అప్పు చెల్లించడం ప్రారంభించిన రోజు నుంచి ఎనిమిదేళ్ల వరకూ ఈ అవకాశం ఉంటుంది. చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగంలో చేరిన తర్వాత నుంచి వాయిదాలు కట్టడం ప్రారంభించవచ్చు. కానీ వ్యక్తిగత రుణాల విషయంలో ఈ అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఉన్నత చదువుల కోసం విద్యారుణాలే ఉపయోగంగా ఉంటాయి.




## జపాన్‌లో స్కూల్ బ్యాగుల ధరలు అధికం

**టోక్యో, జూన్ 27:** జపాన్‌లో స్కూల్ బ్యాగుల (ప్రత్యేకంగా రాండోసేలు అనే బ్యాగులు) ధరలు ఎక్కువగా ఉండటానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. ఇవి సాధారణంగా రూ.18,000 - రూ.60,000 వరకు కూడా ఉంటాయి. ఇందులో ప్రధానమైన కారణాలుఇవే.నాణ్యత రాండోసేలు చాలా పక్కాగా తయారు చేస్తారు. వాటిలో పటిష్టమైన సింథటిక్ లెదర్ వాడతారు. వాటిని పిల్లలు 6 ఏళ్ల వయసులో కొనుగోలు చేసి 6 సంవత్సరాల పాటు ఉపయోగించగలిగేలా చేస్తారు. వాటి నిర్మాణం వెన్నెముకకు మద్దతివ్వడానికీ, బ్యాలెన్స్ మెరుగుగా ఉండడానికీ రూపొందించి తయారు చేస్తారు. పెద్ద మొత్తంలో ఈ బ్యాగులు చేతితోనే తయారు చేస్తారు. ధర పెరగడానికి ముఖ్యమైన కారణం.. వాటిలో వివరణాత్మక స్టిచింగ్, శ్రమతో చేసిన డిజైన్ ఉంటాయి. బ్యాగ్ ఒకసారి కొనుగోలు చేస్తే 6 సంవత్సరాల పాటు మళ్లీ కొనాల్సిన అవసరం ఉండదు. దీర్ఘకాలిక పెట్టుబడి అనే భావనతో తల్లిదండ్రులు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉంటారు. రాండోసేరు అని పిలువబడే జపనీస్ స్కూల్ బ్యాగులు ఖరీదైనవి. వాటి అధిక నాణ్యత, మన్నిక, నైపుణ్యం కారణంగా ధరలు ఎక్కువగానే ఉంటాయి. అవి ప్రీమియం పదార్థాలతో తరచుగా తోలుతో తయారు చేస్తారు. ప్రాథమిక పాఠశాల మొత్తం, సాధారణంగా ఆరు సంవత్సరాలు ఉండేలా రూపొందిస్తారు. అలాగే వాటిని తరచుగా నైపుణ్యం కలిగిన చేతివృత్తుల వారు చేతితో తయారు చేస్తారు. ఒక వేళ పిల్లలు నీటిలో మునిగినా అవి పిల్లలు మునిగిపోకుండా కాపాడుతాయి. నీటిలో జాకెట్ ప్రూఫ్‌లా పని చేస్తాయి. బ్యాంకులు నీటిలో పడిపోయినా అవి మునిగిపోకుండా పైకి తేలుతాయి. అంతేకాదు ఆ బ్యాంకులు తడిసిపోకుండా ఉంటాయి.





## పెరుగుతున్న ఆయుధ తయారీ కేంద్రాలు

**న్యూఢిల్లీ, జూన్ 27:** భారతదేశంలో హైదరాబాద్, పుణె, జబల్పూర్, బెంగళూరు, నాగ్‌పూర్ మరియు కొచ్చి వంటి నగరాలు వాటి ఐటీ, పారిశ్రామిక బలానికి మాత్రమే కాకుండా ఆధునిక ఆయుధాల ఉత్పత్తికి కీలక కేంద్రాలుగా కూడా వేగంగా గుర్తింపు పొందుతున్నాయి. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వంటి ప్రధాన రక్షణ సంస్థలు, అనేక ప్రైవేట్ సంస్థలు ఈ ప్రాంతాల్లో తయారీ కేంద్రాలను నెలకొల్పాయి. ఇటీవల బెంగళూరులోని హెచ్‌ఏఎల్ అభివృద్ధి చేసిన 'తేజస్' ఫైటర్ జెట్‌ను భారత వైమానిక దళంలో చేర్చారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతోతయారు చేసిన తేజస్, క్షిపణి లాంచర్లు, స్మార్ట్ రాడార్ వ్యవస్థలు, సూపర్‌సోనిక్ సామర్థ్యాలతో సహా అధునాతన లక్షణాలతో రూపొందించారు. భారతదేశ వైమానిక పోరాట నౌకాదళాన్ని మరింత బలోపేతం చేయడానికి హెచ్‌ఏఎల్ ఇప్పుడు మరింత అధునాతన వెర్షన్ 'తేజస్ మార్క్ 2'పై పని చేస్తోంది. తమిళనాడులోని అవడిలో ఉత్పత్తి చేసిన అర్జున్ ట్యాంక్, పాకిస్తాన్ ట్యాంకుల కంటే యుద్ధంలో అత్యుత్తమమైనదిని పరిగణిస్తున్నారు. అలాగే జబల్పూర్‌లోని గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ 'ధనుష్' ఫిరంగిని అభివృద్ధి చేసింది.



## వాణిజ్యం

## అన్నింటా విద్యుత్ వాహనాలే టాప్


**ముంబై, జూన్ 27:** వాహన మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు కొత్తవిగా ఉన్నాయి. అయితే ఈ వాహనాల సగటు జీవితకాలం గురించి కొనుగోలుదారులు ఆలోచనలు చేస్తున్నారు. అయితే ఐసిఇ ఇంజిన్‌తో నడిచే కారుకు సంబంధించిన సగటు జీవితకాలాన్ని సులభంగా నిర్ధారించగలిగినప్పటికీ చాలా మందికి ఈవీల జీవితకాలాన్ని అంచనా వేయడం కష్టంగా ఉంటుంది. అయితే ఒక అధ్యయనం ప్రకారం ఎలక్ట్రిక్ వాహనాలు వాస్తవానికి శిలాజ ఇంధనంతో నడిచే వాహనానికి సంబంధించిన జీవితకాలాన్ని అధిగమిస్తాయని పేర్కొంది. యూకేకు చెందిన వాహన టెలిమాటిక్స్ అందించే జియోటాబ్ అనే కంపెనీ చాలా ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు కనీస వార్షిక క్షీణతతో 20 సంవత్సరాలు పని చేస్తాయని పేర్కొంది. ఈవీ బ్యాటరీ మొత్తం జీవితకాలం అనేక దేశాలలో సగటు కారు వయస్సు కంటే ఐదు నుంచి ఆరు సంవత్సరాలు ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. భారతదేశంలో వాహన జీవిత కాలం 15 సంవత్సరాలుగా ఉంటుంది. అయితే ఈవీ వాహనాల జీవిత కాలంలో దాని కంటే ఎక్కువ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ అధ్యయనం ప్రకారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ క్షీణత దాదాపుగా సమస్య కాదని తేలింది. ఆధునిక ఎలక్ట్రిక్ వాహనం బ్యాటరీ సగటున ప్రతి సంవత్సరం 1.8 శాతం క్షీణిస్తుందని, దీని ఫలితంగా చాలా ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు 20 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేస్తాయని కూడా పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉండవని నమ్మే మెజారిటీ ప్రజల భావనకు వ్యతిరేకంగా ఈ పరిశోధన ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ క్షీణత అనేది ఒక సరళ ప్రక్రియ కాదు. ఇది బహుళ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉష్ణోగ్రత, స్థానం, డ్రైవింగ్ విధానం, ఛార్జింగ్ టెక్నాలజీ, ఛార్జింగ్ ఫ్రీక్వెన్సీ బ్యాటరీ జీవితకాలంపై ప్రభావం చూపుతాయి. బ్యాటరీ ప్యాక్‌కు



అతి పెద్ద దెబ్బ దాని జీవితకాలానికి సంబంధించిన మొదటి కొన్ని సంవత్సరాల్లో వస్తుంది. ఆ తర్వాత అది తగ్గుతుంది. జీవితకాలానికి సంబంధించిన చివరి దశల్లో మరొక పెద్ద ప్రభావం చూపుతుంది.

## మొబైల్‌లో కొత్త మాల్వేర్..మీ ఖాతా ఖాళీ సుమా!

**ముంబై, జూన్ 27:** ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వినియోగదారులు మాల్వేర్ ముప్పును ఎదుర్కొంటున్నారు. అందుకే ఫోన్‌ను ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు పదేపదే హెచ్చరిస్తుంటారు. ఎందుకంటే ఒక చిన్న పొరపాటు మీకు చాలా హాని కలిగిస్తుంది. హ్యాకర్లు డేటాను దొంగిలించడానికి, బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేయడానికి మాల్వేర్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్త మాల్వేర్ భయం ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులను భయపెడుతోంది. గాడ్‌ఫాదర్ మాల్వేర్ లక్ష్యం ఎవరు? ఈ కొత్త మాల్వేర్ బ్యాంకింగ్, క్రిప్టోకరెన్సీ, ఇ-కామర్స్ యాప్‌లను లక్ష్యంగా చేసుకుంటోంది. వర్చువల్ ఫైల్ సిస్టమ్, ఇన్‌స్టంట్ స్పూఫింగ్, వర్చువల్ ప్రాసెస్ ఐడి వంటి అనేక విషయాలు ఈ మాల్వేర్ యాప్‌లను లక్ష్యంగా చేసుకోవడానికి సహాయపడుతున్నాయి. 2021లో వచ్చిన ఈ మాల్వేర్ పాత వెర్షన్ అనేక దేశాలలో భీభత్సం సృష్టించింది. అలాగే ఇప్పుడు కొత్త వెర్షన్‌లో తిరిగి వచ్చిన ఈ మాల్వేర్ మునుపటి కంటే ప్రమాదకరంగా మారింది. ఇది మీకు హాని కలిగించవచ్చు. భద్రతా సంస్థ జింపెరియం మాల్వేర్ కొత్త వెర్షన్‌ను కనుగొంది. ఈ మాల్వేర్ నకిలీ లాగిన్ స్క్రీన్‌ను సృష్టించడమే కాకుండా మీకు తెలియకుండానే డివైజ్‌ను కూడా అధీనంలోకి తీసుకుంటుంది. మాల్వేర్ మీ ఫోన్‌లో హోస్ట్ ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేస్తుంది. మీ ఫోన్‌లో అసలు బ్యాంకింగ్ యాప్ ఖచ్చితమైన కాపీని సృష్టిస్తుంది. దీనివలన అసలు, నకిలీ యాప్ మధ్య తేడాను గుర్తించడం కష్టమవుతుంది. ఈ మాల్వేర్‌ను గుర్తించడం మీకు మాత్రమే కాకుండా, కొన్నిసార్లు యాంటీవైరస్ యాప్ కూడా దానిని పట్టుకోవడం కష్టమవుతుంది. మీరు యాప్‌ను తెరిచిన వెంటనే మాల్వేర్ మిమ్మల్ని వర్చువల్ వెర్షన్‌కు తీసుకెళుతుంది. దీని ఇంటర్‌ఫేస్ నిజమైన యాప్ లాగా కనిపిస్తుంది. మాల్వేర్ మీ ప్రతి పనితీరును పర్యవేక్షిస్తుంది. ఈ ప్రమాదకరమైన మాల్వేర్ మీ పాస్‌వర్డ్, పిన్, బ్యాంకింగ్ సందేశాలను కూడా దొంగిలించడం ద్వారా మీకు హాని కలిగిస్తుంది. మీరు యాప్‌ను ఉపయోగించనప్పుడు, ఈ మాల్వేర్ మీకు తెలియకుండానే డబ్బును బదిలీ చేయడం ద్వారా మీ బ్యాంక్ ఖాతాను కూడా ఖాళీ చేస్తుంది. ఇది కూడా ప్రమాదకరమైనది. మీకు యాప్స్ ఉపయోగిస్తున్నప్పుడు మీకు తెలియకుండానే ఈ ప్రమాదకరమైన మాల్వేర్ బ్యాంక్ రౌండ్‌లో రహస్యంగా దాని పని అది చేసుకుంటూనే ఉంటుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.